1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 8
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

అక్టోబరు 2019



మహాత్మాగాంధీ
150 వ జయంతి

"భాషా పెత్తనం
స్వరాజ్యం కాబోదు.
మొదటి ప్రాధాన్యత
ఎల్లవేళలా మాతృభాషదే.
ఆ తర్వాతనే హిందీ భాష.
నిఖార్సయిన ఉన్నతి
మాతృభాషతోనే సాధ్యం.
'మాతృభాషను పణంగా పెట్టి
ఆంగ్లభాషను నేర్చుకోవలసివస్తే
అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన
అవసరం ఏ దేశానికీ లేదు."

- ఏ భాష ఎందుకు?
- వేల్పు పలుకు మన పలుకు ఒకటి కాదా?
- తెలుగునాట గిరిజనుల స్థానం – ప్రస్థానం
- మనం ఎవరి వారసులం? ఎందుకు, ఎలా?

అమ్మనుడులన్నీ జాతీయభాషలే

# తెనాలిలో ఘనంగా తాపీధర్మారావు జయంతి



కీ.శే. తాపీధర్మారావుగారికి నివాళులు



అన్నాబత్తుని శివకుమార్



డా॥ నాగసూరి వేణుగోపాల్

19 సెప్టెంబరు 2019న తాపీధర్మారావు 132వ జన్మదినోత్సవం సందర్భంగా తెనాలిలో 'తెలుగు జన మాధ్యమాల దినోత్సవం' జరిగింది. తెలుగు భాషోద్యమ సమాఖ్య తెనాలి శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తెనాలిలోని ఎ.ఎస్.ఎన్. డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో సభ జరిగింది. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు సభకు అధ్యక్షత వహించారు. తెలుగు పత్రికలలోను, సినిమాల్లోను ప్రజల తెలుగును ప్రవేశపెట్టి వాటిని ప్రాచుర్యంలోకి తెచ్చిన ఘనత తాపీధర్మారావుగారిదని, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖ సంపాదకులను తీర్చిదిద్దిన కీర్తి ఆయనదేనని అన్నారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎం.ఎల్.ఎ. అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ – తెలుగుభాషను విద్యారంగంలో ప్రజల జీవనంలోను పెంపొందించ వలసిన బాధ్యత మనదేనని, ప్రభుత్వ పరంగా ఇందుకోసం తాను కృషి చేస్తానని అన్నారు. తెలుగు జనమాధ్యమాల దినోత్సవం సందర్భంగా – దిన పత్రికల, వార్తా ఛానెళ్ల స్థానిక ప్రతినిధులను తక్కిన పెద్దలతో కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు.

ఈ సభలో విశిష్ఠ అతిథిగా పాల్గొన్న హైదరాబాదులోని ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్, రచయిత డా॥ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ తాపీ ధర్మారావు పత్రికలపైన, నాటి సినిమాల్లోని సంభాషణలపైన చూపిన ప్రభావం నేటికీ ఆదర్శంగా ఉందని అన్నారు. ఆత్మీయ అతిథి ప్రజాసాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కొలసాని రామచంద్ ప్రసంగించారు. తొలుత, సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి డా॥వెన్నిసెట్టి సింగారావు అతిథులందరినీ వివరంగా పరిచయం చేసి, స్వాగతం పలికారు. సమాఖ్య తెనాలి శాఖ అధ్యక్షుడు డా॥ సామల లక్ష్మణబాబు, కార్యదర్శి ఎర్రంశెట్టి హనుమంతరావు సభను నిర్వహించారు. 'అమ్మనుడి' పత్రిక సౌజన్యంతో ఈసభను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ తేదీని ప్రకటించవలసిందిగా ముఖ్యమంత్రిగారిని కోరాలని శ్రీ నాగసూరి వేణుగోపాల్ స్థానిక ఎం.ఎల్.ఎ.గారికి చేసిన అభ్యర్థనను సభ ఏకగ్రీవంగా బలపరిచింది. అందుకు తన ఏకీభావాన్ని శ్రీ అన్నాబత్తుని శివకుమార్ ప్రకటించారు.



మరికొన్ని బొమ్మలను 3వ అట్టపై చూడండి

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




అక్టోబరు 2019

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | అమ్మనుడులన్నీ జాతీయ భాషలే | | **05** |
| **మహాత్మాగాంధీ 150 :** | అమ్మనుడితోనే అందలం... | **కొంపల్లి సుందర్** | **07** |
| **భాషలు :** | ఏ భాష ఎందుకు | **ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు** | **09** |
| **వేల్పు పలుకు :** | మన వేల్పు పలుకు... | **ప్రొ.పులికొండ సుబ్బాచారి** | **13** |
| **మన మూలాలు :** | మన మూలాలపై... | **రహ్మానుద్దీన్ షేక్** | **16** |
| **సంప్రదాయం :** | తెలుగునాట గిరిజనుల... | **డా.పి.శివరామకృష్ణ 'శక్తి'** | **19** |
| **పిట్టచూపు :** | హిందీ భాషా దురభిమానం... | **చలసాని నరేంద్ర** | **30** |
| **తీరుతెన్నులు :** | నేల విడిచిన సాములు... | **సడ్లపల్లె చిదంబర రెడ్డి** | **36** |
| **తెలుగు చరిత్రకారులు:** | ఒంగోలు వెంకట రంగయ్య... | **డా. జి. వెంకటేశ్వరరావు** | **37** |
| **తెలుగుతనం :** | నా నాసిక్ యాత్ర | **య. మాధవరావు** | **44** |
| **పుస్తక సమీక్షలు:** | **డా. గుమ్మా సాంబశివరావు, ఆచార్య వంగపల్లి విశ్వనాథం డా. యస్.కృష్ణశర్మ, ఎం.వి. శాస్త్రి** | | **45** |
| **గ్రంథాలయం :** | | | **50** |
| **నవల :** | జగమునేలిన తెలుగు- 2 | | **25** |
| **ధారావాహికలు :** | సొతంత్రకాల సదువులు-5 | **నంద్యాల నారాయణరెడ్డి** | **33** |
| | జోగిని మంజమ్మ ఆత్మకథ | **రంగనాథ రామచంద్రరావు** | **38** |
| **కవితలు :** | కలలకు బలి వేదిక | **డా॥ సి.భవానీదేవి** | **43** |



రేఖాచిత్రాలు, **పావులూరి చిదంబరేశ్వరరావు**

ముఖచిత్రం **గిరిధర్**

కంప్యూటరీకరణ **లంకె జనార్దన్**


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. - సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|
| శాశ్వత చందా : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్) లో ప్రచురిత మవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకు నేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి


సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

సంపాదక హృదయం

# అమ్మనుడులన్నీ జాతీయభాషలే

'భారతమాత' అంటున్నాం. 'తెలుగుతల్లి' అనీ తెలంగాణ తల్లి అనీ అంటున్నాం. ఆ విధంగా భారతదేశంలో ఎన్ని భాషలున్నాయో అందరు తల్లులున్నట్లు అవుతుంది. మరి ఇందరు అమ్మలకు అమ్మ హిందీ భాషేనా? కానే కాదు! మరి, 'హిందీ దివస్' నాడు సాక్షాత్తూ మన దేశ గృహమంత్రి అమత్‌షా ట్విట్టర్‌లో ఒక సందేశాన్నిచ్చారు. దేశాన్ని సమైక్యంగా ఉంచగలిగిన శక్తి హిందీభాషకు ఉందనీ, హిందీని ఎక్కువ మంది మాట్లాడుతున్నారు గనుక దానిని జాతీయభాషగా మనం ప్రకటించుకోవాలనీ ఆ ప్రకటన సారాంశం.

అమిత్‌షాగారు 'కాశ్మీర్' ఊపునుండి ఇంకా స్థిమితపడనట్లుంది. దేశాన్ని సమైక్యపరచడానికి వెంటవెంటనే చేయగలిగినవన్నీ చేసేయాలనే తొందరలో ఉన్నట్లున్నారు! పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా కలుపుకొని అఖండ భారతాన్ని సాధించి, అభినవ పటేల్‌గా భారత చరిత్రలో నిలిచిపోవాలనే కలను నిజం చేసుకోవాలన్న లక్ష్యం మాత్రమే ఆయన్ను నడిపిస్తున్నట్లుంది. అదంతా ఏమోగాని, ఇప్పుడా ఆశయాలన్నిటినీ నీరుగార్చే విధంగా జాతీయభాష అనే తేనెతుట్టెను ఆయన కదిలించారు. దీనితో 370 అధికరణ విషయంలో అమిత్‌షాను అభినందనపూర్వకంగా చూసిన వారిలో కూడా ఆయన పట్ల అమితమైన వ్యతిరేకత చోటు చేసుకొంది. జాతీయభాష విషయంలో అమిత్‌షా అభిప్రాయాలు పాలక 'భాజపా' ప్రణాళికను సూచిస్తున్నదనే అనుమానం జనం గుండెల్లో పడింది.

అవును...డెబ్బదేళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఒక జాతీయ భాషను రూపొందించుకోలేకపోయాం. కారణం ఈ నేలపై ఎన్నో జాతీయభాషలున్నాయి. భాషలే జాతీయతను ప్రాథమికంగా నిర్ణయిస్తాయనే మౌలిక వాస్తవాన్ని మనం ఒప్పుకోక తప్పదు. అయినా భౌగోళిక, చారిత్రిక, సామాజిక, రాజకీయ పరిస్థితులవల్ల ఏర్పడిన పరిణామాల ఫలితంగా - భారత దేశమంతా ఒకే పాలనా చట్రం క్రింద ఉన్నది గనుక మనం 'భారతజాతి' గా 'భారతదేశం'గా పిలువబడుతున్నాం. దీనికై ఎంతగా సాంస్కృతిక చారిత్రిక వాదాన్ని మనం ఆధారంగా చేసుకొన్నా, అదంతా భాషల వైవిధ్యాన్ని గౌరవించినంతవరకే సాగుతుంది.

మతం ఒకటే అయినా, భాషా సంస్కృతులు వేరు కావడం వల్ల పాకిస్తాన్ నుంచి తూర్పు పాకిస్తాన్ విడిపోయిన వాస్తవాన్ని మనం మరచిపోకూడదు. ఇలాంటి అంశాలన్నిటినీ ముందుగానే అంచనా వేశారు గనుకనే, రాజ్యాంగ రచనకోసం పాటుపడిన రాజ్యాంగ నిర్మాణ సభ సభ్యులు ఎంతో లోతైన చర్చలు జరిపి, చివరకు - హిందీని రాష్ట్రాల మధ్య వినియోగించగల ఒక సంధాన భాషగా మాత్రమే ఆమోదించారు. అప్పటికే పాలనారంగాన్ని తన బిగి కౌగిట్లో బంధించిన ఇంగ్లీషు పట్టునుండి పదిహేనేళ్లలో బయటపడి, హిందీని అధికారభాషగా అమలు చెయ్యాలని సూచించింది. అందుకోసం హిందీభాషను పాలనారంగంలో అభివృద్ధి చెయ్యడానికి చర్యల్ని సూచించింది కూడా.

అంతేగాక, రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూలులో కొన్ని భాషలను చేర్చి, వాటిని పాలన, బోధనారంగాల్లో రక్షించుకోవడానికి కొన్ని ఏర్పాట్లు చేసింది. భాష ప్రాతిపదికగా రాష్ట్రాల ఏర్పాటు వల్ల ఆయా రాష్ట్రాలు తమ భాషలను తమ ఉనికికి ఆధారాలుగా చేసుకొని ముందుకు సాగడానికి అవకాశాలను ఇచ్చింది.

అయినా - అటు అన్ని రాష్ట్రాలను, భాషలను కలుపుకొని ముందుకు సాగడంలో చాలా రంగాల్లో

– ముఖ్యంగా భాష విషయంలో జాతీయస్థాయి పార్టీలు, నేతలు విఫలమయ్యారు. కేంద్ర ప్రభుత్వంలో ఏ పార్టీలు అధికారం సాగించినా, హిందీ పెత్తనం అక్కడ సాగుతూనే ఉంది. ఉభయ సభల్లోను, ప్రభుత్వంలోనూ హిందీదే ఆధిపత్యం, దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల నుండి వచ్చేవారికి – వారికి హిందీపై పట్టు ఉంటే తప్ప – చొరవగా జాతీయ వ్యవహారాల్లో, చట్ట సభల్లోనూ ముందుకు పోలేని పరిస్థితి ఎప్పుడూ ఉంటూనే ఉంది. ఇంతకాలం గడచినా, ఇతర భారతీయ భాషలను సమస్థాయిలో గౌరవించిన చరిత్ర హిందీ వాదులకు ఎన్నడూ లేనే లేదు!

పదిహేనేళ్ల గడువుదాటి యాబదేళ్లు గడిచినా, దేశంలో ఇంగ్లీషు భాష ప్రభావం అన్నిరంగాల్లో మరింతగా పాతుకు పోయింది. పాలనారంగంలో, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అన్ని స్థాయిల్లోనూ ఇంగ్లీషుదే ఆధిపత్యం. ఇంగ్లీషు, హిందీ ఆధిపత్యం క్రింద, తక్కిన భారతీయ ప్రజల భాషలు అన్నీ ప్రతిఘటనను ఎదుర్కొంటున్నాయి.

ఈ పరిస్థితుల్లో గత 20 ఏళ్లుగా వేగంగా దూసుకొస్తున్న అంతర్జాతీయ ఆర్థిక ఆధిపత్యవాదంతోపాటు పెనవేసుకొని వస్తున్న ఆంగ్లభాష విస్తరణకు మన ప్రభుత్వాలు, పార్టీలు దాసోహమంటున్నాయి. కార్పొరేట్ సంస్కృతి విస్తరణకు దోహదపడుతున్నాయి. అన్ని రంగాలలో ప్రభుత్వాలు కార్పొరేట్ల ఆదేశాలకు అనుగుణంగా తమ విధానాలను రూపొందించుకొంటున్నాయి. హిందీ ప్రాంతాలతో సహా దేశమంతటా ఈ పరిణామాలు వేగవంతమవుతున్నాయి. దీనితో హిందీ, ఇంగ్లీషు రెండింటి పెత్తనాన్ని అధిగమించి నిలువజాలని పరిస్థితి ప్రజల భాషలకు ఏర్పడింది.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానంలోగాని, జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న భాషా విధానంలోగాని హిందీ తప్ప తక్కిన ప్రజాభాషలకు రక్షణ లేదు. రాజకీయంగా హిందీ ప్రాంతీయుల ఆధిపత్యాన్ని నిలువరించగల అవకాశం లేదు. కనుక – ఇప్పుడు హిందీని జాతీయ భాషగా అధికారికంగా ప్రకటించడమంటే విద్య, ఉద్యోగాలల్లోగాని, పరిపాలనలోగాని పూర్తి అణచివేతకు తలొగ్గినట్లే అవుతుందని భయం నెలకొంటున్నది. ఆ భయం వాస్తవాల మదింపువల్ల ఏర్పడిందే.

అమిత్‌షా ట్విట్టర్ దూకుడుకు తీవ్రంగా వ్యతిరేకత వచ్చింది. హిందీ వ్యతిరేకతకు చారిత్రక ఖ్యాతి గడించిన తమిళనాడు రాజకీయ నేతలతోపాటు, భాజపాకే చెందిన కర్ణాటక ముఖ్యమంత్రీ, వామపక్ష కేరళ ముఖ్యమంత్రీ జాతీయభాషగా హిందీ ప్రతిపాదనను వ్యతిరేకించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నోరు విప్పకపోయినా వారి బాటా అదే అవుతుంది. ఈ దశలో భాజపా నేతలు దిద్దుబాటు ప్రకటనలెన్ని చేసినా వాటిని ఎవరూ నమ్మరు. గృహమంత్రి గృహాన్ని బలోపేతం చెయ్యడానికీ ప్రజల ఐక్యతకూ పాటుపడాలేగాని, ప్రజల అనైక్యతకూ ఆందోళనకూ దారి తీసే చర్యలకు పాల్పడకూడదు.

'భాజపా' కొన్ని సుదీర్ఘ జాతీయ లక్ష్యాలతో రాజకీయ రంగంలో ఉన్న పార్టీ. ప్రజల సమర్థన ఉన్నంతవరకు వారిని అధికారంలో లేకుండా ఎవ్వరూ నిరోధించలేరు. కాని, తమ తొందరపాటు చర్యలతో తమ నెత్తిన తామే చెయ్యిపెట్టుకుంటే – ప్రజా సమర్థనను కోల్పోతే – కాపాడగల వారెవ్వరూ ఉండరు. అప్పుడు వారు తలపెట్టిన సుదీర్ఘ లక్ష్యాలు దెబ్బతింటాయి. ఏ రాజకీయ పార్టీ అయినా ఈ వాస్తవాన్ని తెలుసుకోవాలి.

గాంధీ మహాత్ముడి 150వ జయంతిని ప్రభుత్వం ఘనంగా చెయ్యాలని తలపెట్టి అనేక కార్యక్రమాల్ని చేపడుతున్నది. ప్రజల్లో కూడ ఈ విషయమై ఆసక్తి నెలకొని ఉంది. ఈ సమయంలో మాతృభాషల గురించీ, జాతీయభాష గురించీ ఆ మహానేత ఏమి చెప్పారో మనం తెలుసుకోవాలి. ఆలోచించాలి. ఈ తర్వాతి పుటలలో ఆ వివరాలను చూడండి.

భాషా పెత్తనం స్వరాజ్యం కాబోదు అని మహాత్మాగాంధీ స్పష్టం చేశారు. మొదటి ప్రాధాన్యత ఎప్పటికీ మాతృభాషలదేనని, ఆ తర్వాతే హిందీ భాష అని ప్రకటించారాయన. మాతృభాషను ఫణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసి వస్తే అసలు ఆంగ్లాన్ని నేర్చుకోవలసిన అవసరం ఏ దేశానికీ లేదు అని నిర్ద్వందంగా గాంధీజీ ప్రకటించారు.

గాంధీజీ మాటలను మన ప్రధానమంత్రి, గృహమంత్రి పట్టించుకుంటారని ఆశిద్దాం.

తేదీ : 30-9-2019

సామల రమేష్‌బాబు

మహాత్మాగాంధీ-150

# అమ్మనుడితోనే అందలం

కొంపల్లి సుందర్
9989358883

## భాషాపెత్తనం స్వరాజ్యం కాబోదు

దేశ పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా మహాత్మాగాంధీ తన నిర్మాణ కార్యక్రమంలో అనేక సూత్రాలను ప్రతిపాదించాడు. ఆ మహనీయుని 150వ జయంతి సందర్భంలో మనందరం వాటిని స్మరించుకోవాల్సిన తరుణమిది. అందునా, ముఖ్యంగా ఆయన మాతృ భాష, జాతీయ భాషలపై వెలిబుచ్చిన అభిప్రాయాలు గమ నార్హం. రకరకాల కారణాలచేత మనం గాంధీగారి అనేక సామాజిక విలువలను చాలా సౌకర్యవంతంగా మరచిపోయాము. అందులో మాతృభాషకు ఆయనిచ్చిన విలువ ఒకటి. ప్రపంచమంతా ఆయన 150వ జయంతిని ఒక పండుగలా జరుపుకునే సమయంలో, ఆయన ప్రవచించిన కొన్ని మౌలిక సామాజిక కార్యక్రమాలను గుర్తుకు తెచ్చుకోవడం మన విధి. మాతృభాషే మన అస్తిత్వమని ఆయన 1916వ సంవత్సరంలోనే ఎలుగెత్తి చాటాడు. ఒక విశ్వ విద్యాలయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ **"మన విద్యార్థులందరూ తమతమ మాతృభాషలందు విద్యా విధానాన్ని కొనసాగిస్తే మన 'జాతీయ ఆత్మ'తో మనం అనుసంధానమౌతాము. ఆ పరంపరే మన జాతి వారసత్వంగా పరిణమిస్తుంది'** అని పేర్కొన్నాడు. ఆయన ఉద్దేశ్యంలో ప్రాథమిక విద్యా విధానమంతా మాతృభాషలోనే కొన సాగాలి. జాతీయభాష (హిందీ)ఆ తరువాతే! హిందీ భాషను అందరూ నేర్చుకోవాల్సిన అవసరమున్నా, ప్రాథమిక విద్యమాత్రం ఆయా ప్రాంతాల్లోని స్థానిక భాష ద్వారానే జరగాలని ఆయన నిక్కచ్చి అభిప్రాయం. ఈ నేపథ్యంలో గాంధీగారిని, ఆయన భావాలను అందరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

మన మాతృభాషే మన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందని గాంధీ గారి ప్రగాఢ విశ్వాసం. మన భాష మన భావాలన్నింటినీ వ్యక్తం చేయలేదని మనం భావిస్తే, ఒక జాతిగా మనం త్వరలో అంతరించి పోతామని ఆయన కుండ బద్దలు కొట్టాడు. భాషకు నాలుగు ప్రధాన లక్షణాలుంటాయని ఆయన అభిప్రాయం.

1. భాష అనేది ప్రభుత్వాధికారులు సులభంగా నేర్చుకొనే పద్ధతిలో ఉండాలి.

2. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక (మతంతో సహితంగా ) సంబంధాలను ప్రోత్సహించేదిగా, ప్రోద్బలం చేసే విధంగా ఉండి తీరాలి.

3. జాతీయ భాషను తీసుకున్నా, అది అందరూ నేర్చుకునే సులభరీతిలో ఉండాలి.

4. భాషను ఎంచుకునే (నేర్చుకునే) క్రమంలో తాత్కాలిక లాభాపేక్షను ఆశించకూడదు.

పై నాలుగు అభిప్రాయాలను పరిశీలిస్తే, గాంధీ మహాత్ముడు స్థానిక భాషలకు, జాతీయ భాషకు ఎంత ప్రాధాన్యమిచ్చాడో అవగతమవగలదు. ఇంగ్లీషు భాషపై మక్కువను ఆయన 'బలహీనతకు చిహ్నంగా', 'అజ్ఞానానికి పునాది'గా వర్ణించాడు. 1920 దశకంలోనే ఆయన ఒక విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నాడు. ఆంగ్లభాషా వ్యామోహాన్ని వదిలించుకోవడమే 'స్వరాజ్య' భావనకు అత్యంత ఆవశ్యకమైన విషయం. పరాయిభాషను అనుకరించే వారెవ్వరూ జాతి నిర్మాతలు కాలేరని ఆయన 'యంగ్ ఇండియా' పత్రికలో 1921లోనే ప్రకటించాడు. ఆంగ్లభాష పరిజ్ఞానం లేకుండానే



రష్యా దేశం సాధించిన వైజ్ఞానిక ప్రగతిని ఆయన ఉదహరించాడు. ఆంగ్లంలో, హిందీలో ఆయన నిష్ణాతుడైనా తన ప్రధాన రచనలన్నీ (హింద్ స్వరాజ్, ఆత్మకథ, సర్వోదయ) మాతృభాష గుజరాతీలోనే రచించాడు. **'మాతృభాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసి వస్తే, అసలు ఆంగ్లభాషను నేర్చుకోవాల్సిన అవసరం ఏ దేశానికీ లేదు'** అని ప్రకటించాడు. ఈ 150వ జయంతి సందర్భంలో నైనా మనం గాంధీగారి భావాలను స్మరించుకుందామా! లేదా గాంధీగారికి పూజచేసి ఆయన ప్రవచించిన విలువలను ప్రకటించిన నిర్మాణ కార్యక్రమాన్ని నిర్మాల్యంలా తీసివేద్దామా!

మాతృభాష పరిరక్షణకు, మాతృభాషను ప్రోత్సహించుటకు గాంధీగారు ఏడు ప్రధాన చర్యలను సూచించాడు.

1. సాధారణ, దైనందిన వ్యవహారాల్లో ఆంగ్లభాషను ఉపయోగించరాదు.

2. రెండు భాషలు తెలిసిన వారు మంచి విషయాలను నేర్పించే ఆంగ్ల గ్రంథాలను మాత్రమే ప్రజల ముందుంచాలి.

3. విద్యాసంస్థలు తమ పాఠ్య గ్రంథాలను తామే తయారు చేసుకోవాలి.

4. స్థానిక భాషల్లో పాఠశాలల స్థాపనకు సమాజంలోని స్థితి మంతులు ముందుకు రావాలి.

5. పాఠశాల, విద్యా సంస్థలన్నింటిలో మాతృభాషలోనే విద్యను బోధించాలని ప్రభుత్వాన్ని కోరాలి.

6. న్యాయస్థానాలు, శాసన సభలన్నీ తప్పనిసరిగా స్థానిక భాషలనే ఉపయోగించాలి.

7. జాతి పురోభివృద్ధి మొత్తం మాతృభాషలా విద్యాబోధన మీదనే ఆధారపడి ఉంది.

మహాత్మాగాంధీ స్థానిక భాషలకు, హిందీభాషకు సంబంధించిన 20వ శతాబ్ది మొదట్లోనే సుస్పష్ట ప్రకటన చేశాడు.

**"భాషా పెత్తనం స్వరాజ్యం కాబోదు. మొదటి ప్రాధాన్యత ఎల్లవేళలా మాతృభాషదే! ఆ తరువాతే హిందీ భాష. నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం".**

మనమందరం ఈనాడు మాతృభాష పరిరక్షణకు సంకల్పం మరోసారి చెప్పుకోవలసిన అవసరం ఉంది. మహాత్మాగాంధీ ఆశయాలకు విలువనిస్తూ, కనీసం ఈ 150వ జయంతి సందర్భంలోనైనా మనం ఆవిధంగా పనిచేద్దాం.

## తెలుగు మాండలిక భాషాదినోత్సవంగా తెనాలిలో కాళోజీ నారాయణరావు జయంతి




ప్రసిద్ధ కవి, తెలంగాణ పోరాటయోధుడు కాళోజీ నారాయణరావు జయంతిని తెలుగుభాషోద్యమ సమాఖ్య పిలుపును అనుసరించి పలుచోట్ల 'తెలుగు మాండలిక భాషాదినోత్సవం'గా సెప్టెంబరు 9న జరుపుతున్న సంగతి తెలిసిందే.

దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షతన తెనాలిలో - తెలుగు భాషోద్యమ సమాఖ్య తెనాలిశాఖ నిర్వహించింది. తొలుత స్థానిక శాఖ అధ్యక్షుడు డా॥ సామల లక్ష్మణబాబు అందరికీ ఆహ్వానం పలికి, పరిచయం చేశారు. ఆచార్య కృపాచారి తన ప్రసంగంలో కాళోజీ జీవిత విశేషాలను, వ్యక్తిత్వాన్ని కృషిని క్లుప్తంగా వివరించారు. న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన కాళోజీ, స్వాతంత్ర్య సమరంలోను, తెలంగాణ ఉద్యమాల్లోను ప్రముఖంగా పాల్గొనడమేగాక, తన కవితలతో ప్రజలను ఉద్యుక్తులను చేశారన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్‌ను, కేంద్ర ప్రభుత్వాన్నుండి 'పద్మ విభూషణ్' గౌరవాన్ని పొందిన విశిష్ట వ్యక్తి కాళోజీ అని నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న - తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు మాట్లాడుతూ - ఎక్కడ ఆధిపత్య భావజాలం ఉన్నా దానిని ఎదుర్కోవడానికే తన జీవితాన్ని, రచయితగా తన శక్తిని వెచ్చించిన ఉద్యమకారుడు కాళోజీ అంటూ కొన్ని ఉదాహరణలను పేర్కొన్నారు. ఆయనా మాతృభాష తెలుగు కాకపోయినా, తెలుగునాట స్థిరపడిన కుటుంబ సభ్యుడుగా తెలుగు ప్రజలతో, వారి భాషతో మమేకం అయ్యారని, 'తెలుగు వాళ్లయి పుట్టి తెలుగు రాదనే వారిని ఎంతగా ఈసడించుకొన్నారంటే - 'అలా బ్రతికే బదులు చావవెందుకురా' - అని ఆయన ఆగ్రహించారు. ఆయనను తెలుగు సమాజం స్వంత మనిషిగా అక్కున చేర్చుకొన్నది అందుకే. తన జన్మదినోత్సవాన్ని తెలుగు మాండలిక భాషా దినోత్సవంగా జరపాలని ఆయన స్వయంగా ప్రతిపాదించారు. తెలంగాణ ప్రజల తెలుగు ప్రత్యేకత, అణచివేతకు గురవుతున్నదని ఆయన ఎలుగెత్తి చాటారు అని వివరించారు. తెలంగాణ ప్రజల ఆవేదనను, ఆగ్రహాన్ని ఆయన తన రచనల్లో చాటారని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందుగానే 2002లో ఆయన మృతి చెందారని తెలిపారు. సమాఖ్య ఉపాధ్యక్షులు, ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు శ్రీ కొత్తపల్లి రవిబాబు ప్రసంగించి, కాళోజికి నివాళులర్పించారు.

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

# ఏ భాష ఎందుకు?

ఏ భాషనైనా ఎవరైనా ఎక్కడైనా ఎందుకు వాడాలంటే ఒకటే సమాధానం. అది వారి అమ్మభాష.

అది ఆనాట పుట్టిన మాట. అది వారి తల్లిదండ్రులనుంచి పుణికిపుచ్చుకొన్న వారసత్వం.

నేడు ప్రపంచంలో ఏడు వేలకు పైచిలుకు భాషలు ఉన్నాయి. ఐతే, ప్రపంచ జనాభాలో 85 శాతం మంది వీటిలో 100 భాషలను మాత్రమే వాడుతుండగా, వాటిలో 25 భాషలు ప్రపంచ జనాభాలో సగం మందికి వాడుక భాషలు. ఈ ఇరవై ఐదు భాషలలో 13వ స్థానంలో ఉన్నదే తెలుగు భాష. అంటే ప్రపంచ స్థాయి భాషగా ఉన్న తెలుగును విద్యామాధ్యమంగా వాడుకనుండి తొలగించటం అంటే ప్రజాస్వామ్య విధానాలను పట్టించుకోనట్లే.

### భాషల ఆవిర్భావం

భాషలు మానవ నిర్మితాలు కావు. మానవుల ప్రమేయం లేకుండా మానవ పరిణామ క్రమంలో భాగంగా పుట్టినవి. ఆధునిక మానవ (హోమో సెపిఎన్స్) సమూహాలలో కొందరు ప్రాచీనులు (ముందరివారు) మరికొందరు ఆర్వాచీనులు (తర్వాతివారు) అనే భేదాలకు తావులేనట్టే భాషలలో కూడా ప్రాచీన భాషలూ ఆర్వాచీన భాషలూ అంటూ ఉండవు. మనం ప్రాచీన భాషలుగా అనుకొనేవి గతంలో లిఖిత పూర్వకంగా నమోదుచేయబడ్డ భాషలే. మాట క్షణభంగురం కావటంచేత మాటకు రాతలో కాల పరిధులను దాటి మనగలిగే ఆస్కారం కలుగుతుంది. అయితే లేఖనం 5000 ఏండ్లకంటే ప్రాచీనం కాదు. కానీ భాష లక్ష సంవత్సరాల కిందటే పరిణామ క్రమంలో అవతరించినదని జీవపరిణామ శాస్త్రజ్ఞుల పరిశోధనలో తేలిన విషయం.

పరిణామక్రమంలో, భిన్న ప్రాంతాలనుబట్టీ, విభిన్న భౌగోళిక వాతావరణ పరిస్థితుల ప్రభావంతో, వివిధ జాతులూ, భిన్న మతాలూ రకరకాల సంస్కృతులూ నాగరికతల ప్రభావంతో భాషలు నిరంతరం మార్పులకు లోనై నేటికి వేలాది భాషలుగా రూపుదిద్దుకొన్నాయి. ఇవన్నీ ప్రకృతి సహజ పరిణామంగా తయారైనవే. ఐతే, ఇట్లా పుట్టిన భాషల మనుగడ, వాటి వ్యాప్తి మాత్రం మానవుల అసహజ వ్యాపకం ద్వారానే జరిగింది. మొదట్లో ఆహారంకోసం వలసలు సాగించినా రానురాను అవి ఇతరులపై దాడిచేసి ఆక్రమించి వారి సంపదనూ, నేలనూ ఆక్రమించి వారి భాషలను వాడకుండా నియంత్రించే ప్రయత్నాలు జరిగినై. ఇట్లాంటి దండయాత్రలూ దురాక్రమణలలో భాగంగానే నేటి ప్రపంచభాషలు అనేవాటి విస్తరణ సాధ్యమయింది.

నేటి ప్రపంచంలో గొప్ప భాషలనేవి అశేష సేనావాహినులతో పొరుగున ఉన్న ఇతరుల నేలను దురాక్రమించి, వారి ధన, మాన ప్రాణాదులను హరించివేసి వారి భాషలపై పెత్తనం చేయగా తయారైనవే. భాషలలో కొన్ని భాషలు ప్రాచీనమైనవనీ ఆర్వాచీనమైనవనీ ఉండనట్టే కొన్ని సంక్లిష్టమైనవీ మరికొన్ని సులువైనవీ ఉండవు. అట్లాగే కొన్ని గొప్పవీ మరికొన్ని పేదవీ ఉండవు. ఇప్పటి అన్ని భాషలూ సంపూర్ణంగా తయారైనవే. అవసరాలను బట్టి భాష వికసిస్తుంది. భాషా వికాసానికి వాడుకే ప్రాతిపదిక. వాడుతున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

భాష వంశ పారంపర్యంగా తాతముత్తాతలనుండీ తల్లి దండ్రుల నుండీ పిల్లలకు సంక్రమించినదే. భాషతోపాటు ఆ ప్రాంత జీవజాలమూ చెట్లూచేమలగురించిన సమాచారమూ, ఆయా సమాజాలలోని వ్యవసాయం తదితర వృత్తివ్యాపారాలూ ఆచార వ్యవహారాదులూ, సమాజంలోని వ్యక్తుల సామాజిక, ఆర్థిక సంబంధాలూ వాటి గురించిన జ్ఞానసంపద అంతర్లీనంగా మన ఆలోచనలలో భాగమౌతాయి.

**భాష అంటే, మనుషుల మధ్య సమాచార వినిమయానికేగాదు, సమాజాల ఆర్థిక సంబంధాలను శాసించటమూ కాదు; భాష స్వేచ్ఛకు సంకేతం. మాతృభాష మనుగడతో మనకు ఒక గుర్తింపు. ఏ సమాజం లోనైనా మాతృభాషలు మృతభాషలుగా మారటం భావ దాస్యానికి ఆనవాలు. భాషలు పూర్తిగా అంతరించకపోయినా ఆ భాషను కొన్ని వాడుక రంగాలలో వాడక పోవటం ఆ భాష చావుకు దగ్గరవుతున్నట్లే. భాషల ఆరోగ్య స్థితికి ఆనవాలు కొన్ని ప్రత్యేక రంగాలలో వాడటమే. వాటిలో అతిముఖ్యమైనదీ తప్పనిసరిగా ఉండవలసినదీ విద్యామాధ్య మంగా వాడటం. ఏదైనా ఒక భాష విద్యామాధ్యమంగా వాడకపోవ టాన్ని ఆ భాష త్వరలో అంతరించిపోతుందనటానికి ముఖ్య సంకే తంగా గుర్తించాలి. తెలుగు రాష్ట్రాలలో తెలుగుకు దాపురించిన పరిస్థితి ఇదే. ఏ భాష అయితే విద్యామాధ్యమంగా వాడకంలో ఉంటోందో ఆ భాష అన్ని వ్యవహార రంగాలలోనూ సజీవంగా ఉంటుంది. భాషలు విద్యా మాధ్యమాలుగా ఉండటం చారిత్రక అవ సరం. ఆయా భాషల భవిష్యత్తుకేగాదు, ఆయా భాషల వ్యవహర్తల సమాజాల భవిష్యత్తుకూ అంతే అవసరం. ఆధునిక సమాజా లకు విద్య ఎంత అవసరమో భాషలను విద్యామాధ్యమాలుగా వాడ టమూ అంతే అవసరం.**

**బడిలో నేర్చిన భాషే ఇంటి భాషా బయటి భాష కూడా అవుతుంది. ఇంటి భాష బడి భాషగా ఉండటం ఎంత సహజమో బడి భాషే ఇంటాబయటా వాడే భాషగా వాడుకలోకి రావడం అంతే సహజం. అందుకనే ఇంటి భాష బడి భాష అవ్వాలి. ఆ బడి భాషే సామాజిక భాషగా మారాలి.** అట్లాకాకుండా బయటి భాష బడి భాషగా మారి ఆ బడి భాషే ఇంటిభాషగా మార్పు చెందినప్పుడు మన సమాజం మన నియంత్రణలో లేదని తెలుసుకోవాలి. మన సమాజపు ఆర్థిక సంబంధాలు దెబ్బతింటున్నాయని గ్రహించాలి. మన సమాజంలో మనవైన వనరులతో పెంపొందే ఉద్యోగ ఉపాధి

అవకాశాలు నాశనమై బహుళజాతి సంస్థల ఉద్యోగ ఉపాధి అవకాశాలపై పూర్తిగా ఆధారపడి జీవించే అవసరం కలుగుతుంది.

**భాషలూ – సమాజంలో ఆర్థిక సంబంధాలూ**

**మాతృభాష ఉండవలసిన చోట మాతృభాష కాక మరోభాష ఎందుకు ఉంటోంది? ఇది చరిత్ర. ఇది మరీ ఇటీవలి చరిత్రే. గత రెండుమూడు దశాబ్దాలుగా మొదలై ఇప్పుడే మాతృభాషను మృతప్రాయం చేసిన చరిత్ర ఇది.** దీనివలన వచ్చే నష్టాలూ, అనర్థాలూ, మన పరిశ్రమలూ ఉద్యోగ ఉపాధిరంగాలూ సమూలంగా అంతరించిపోయే పరిస్థితులూ దాపురిస్తున్నాయి. ఈ పరిస్థితి ఎలా వచ్చిందో అని ఒకమారు చూసుకుంటే మనం ఏనాడూ ఈ పరిస్థితి ఇలా వస్తుందని ఊహించటానికి కూడా అందనిది జరిగింది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలలో నూటికి తొంభైఎనిమిది శాతం పాఠశాల విద్య తెలుగుమాధ్యమంలో నడిచేది. పాఠశాలలు అన్నీ ప్రభుత్వ యాజమాన్యంలో ఎక్కువగా నడిచేవి. అన్నింటా తెలుగే ఉండేది. అయితే, బడిలో చెప్పినది చాలని బడిపిల్లలకూ ప్రవేశ పరీక్షలకోసం ప్రైవేట్లు చెప్పడం జరుగుతుండేది. ప్రవేశ పరీక్షలలో మార్కులు రాబట్టడానికి ప్రభుత్వంవారి బడి చదువు చాలదనుకున్న పిల్లలు ప్రైవేట్లవైపు మళ్లడం మొదలైంది. ఈ ప్రైవేట్లు తామరతంపరగా మారి ట్యుటోరియల్ కళాశాలలుగా రూపుదిద్దుకొని హంగూ ఆర్భాటాలతో జూనియర్ కళాశాలలుగా తామే రెగ్యులర్ తరగతులు నడిపి పరీక్షలు పెట్టేందుకు లైసెన్సులు పొందాయి. ప్రభుత్వాలు తమ బాధ్యతనూ బరువునూ తగ్గించుకొనేందుకు ఈ ప్రైవేటు కళాశాలలకు అండదండలు చేకూర్చారు. ఈ మార్పు రెండు దశాబ్దాలలో తెలుగునుంచి ఇంగ్లీషు మాధ్యమానికి ఒక వ్యూహ రచనతో పూర్తిగా మార్చివేసింది.

ప్రభుత్వాలు ప్రభుత్వ బడులని నిర్లక్ష్యం చేయటం, సరైన నిధులూ సౌకర్యాలూ, కావలసినంతమంది అధ్యాపకవర్గాన్ని అందించకపోవటం ముఖ్య కారణాలు. ఒక వేపు ప్రభుత్వ నిరాదరణా, మరో వేపు సుశిక్షిత యాజమన్యంతో కొత్త భవనాలలో, ఆంగ్లమాధ్యమంలో నడుస్తున్న ప్రైవేటు బడులూ కళాశాలలూ డబ్బు పెట్టి చదివించగల స్తోమత ఉన్న ప్రతి తల్లిదండ్రుల పిల్లలనూ ఆకర్షించటంలో పూర్తిగా సఫలీకృతమయ్యాయి. ఈ పరిస్థితిలో ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రభుత్వ బడులలో మిగిలినవారు డబ్బుబెట్టి చదివించలేని తల్లిదండ్రుల పిల్లలే. అందరికీ సమన్యాయం చేసే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ బడులలోనూ ఆంగ్ల మాధ్యమమే నడిపేందుకు ప్రభుత్వ ఆజ్ఞలు జారీఅయ్యాయి. దీనికి బాధ్యులు ఎవరు? ప్రభుత్వాలే. విద్య, రాజ్యాంగంలో ఉమ్మడి జబితాలో ఉండటంతో మార్పులూ చేర్పులకు రాష్ట్రాలకు అవసరమైనంత అధికారమూ స్వేచ్ఛా లేవు. రాష్ట్రాల విధానసభలు పాఠశాల విద్యలో విద్యా మాధ్యమంగా మాతృభాషలను తొలగించి ఇంగ్లీషును తీసుకు రావడానికి సరైన కారణాలుగానీ శాస్త్రీయ ఆధారాలుగానీ చూపలేదు. ఎలాంటి విచారణా సంఘాలనూ ప్రతిపాదించకుండానే చేసుకుపోయింది. భవిష్యత్తులో జరగబోయే సామాజిక విధ్వంసానికి బాధ్యత వహించేది ఎవరు?

ఇలా మూడు దశాబ్దాలుగా ఆంగ్ల మాధ్యమ ప్రవేశం చాపకింద నీరులా చొచ్చుకొస్తున్నా ప్రజాప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో తెలుగురాష్ట్రాలలో బడిమానేసే పిల్లలు ఎక్కువవడం, నిరక్షరాస్యత పెరగడం జరిగింది. తెలుగు రాష్ట్రాల అక్షరాస్యత 67%. అంటే జాతీయ సగటుకంటే తక్కువ కావటం వెనుక మన రాష్ట్రప్రభుత్వాల చేతలుడిగిన వైనం కనబడుతోంది.

**స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడుస్తున్నా మన ప్రజాప్రభుత్వాలు జనాభాను అక్షరాస్యతకు దూరంగా ఉంచాయి. అక్షరాస్యత మన ప్రభుత్వాల ప్రాధాన్యతలనుండి ఎప్పుడో వెనకబడిపోయింది.** మన చదువుకొన్న జనాభాలో ఎక్కువమంది ప్రాథమిక విద్య దాటని వారే (45% పైగా). అంటే మన తెలుగు రాష్ట్రాలలో వార్తా పత్రికలు చదవగలిగినవారు 22% దాటరు. అంటే మన ప్రజలలో తమకు కావలసిన సమాచారాన్ని చదివి తమంతట తాము నిర్ణయాలు చేయగలిగినవాళ్లు బహు తక్కువమంది.

ఎక్కువమంది (75% పైనే) ఒకరు చెప్పేది విని నిర్ణయాలు చేయగలిగినవారు మాత్రమే. ఇది ప్రజాస్వామ్యానికి చెంపపెట్టు, కాదు, గొడ్డలిపెట్టే. అంటే వీరు తమకు ఏది మంచో ఏది చెడో, ఏది అవసరమో ఏది ఎందుకో సొంతగా నిర్ణయించుకోలేరు. మన చుట్టూ ఉన్న ఎన్నో ఆసియా దేశాలవారు (కొరియా, మంగోలియా, తైవాన్, జపాన్, చైనా, థాయిల్యాండ్ మొద.) 98%కి అటూ ఇటుగా అక్షరాస్యత సాధించటమే ప్రధాన ప్రాధాన్యంగా పెట్టుకొని సాధించడానికి ముఖ్య కారణం ప్రజాస్వామ్య విలువలపట్ల ఆ రాజకీయ నాయకులకూ ఆ ప్రజలకూ ఉన్న నమ్మకమే. కానీ ఇక్కడ, ఇంగ్లీషు మాధ్యమాలు పెట్టి ఏ కొందరికో విదేశాలలో అవకాశాలు కల్పించడం కోసమేనా? ఆంగ్ల మాధ్యమం వలన పెరుగుతున్న ఉద్యోగాలు అంతగా లేవు, కానీ స్థానికంగా తరుగుతున్న మన ఉద్యోగ ఉపాధి సౌకర్యాలను పెంచుకొనే ప్రయత్నమూ చేయటంలేదు. ఆంగ్ల మాధ్యమం వలన ప్రతి సంవత్సరం కొన్ని లక్షల కోట్ల రూపాయల విదేశీ మారకం దేశం దాటిపోతోంది. మన వేలాది విద్యాలయాల గ్రంథాలయాలలో ఉండే లక్షాలాది పుస్తకాలలో 90% పైగా విదేశీయుల రచనలే. ప్రతి సంవత్సరం వేలాది గ్రంథాల లక్షల కాపీలు దిగుమతి అవుతున్నాయి.

వాటి సగటు విలువ 50 డాలర్లు వేసుకున్నా లక్షల కోట్లపైనే ఉంటుంది. ఇవే రచనలు అభివృద్ధిచెందిన దేశాలలో అయితే తమ భాషలలోకి అనువదించి లక్షల కాపీలు ముద్రించి తక్కువ వెలకు విద్యార్థులకు అందిస్తారు. గ్రంథ రచనా ప్రచురణా ముద్రణలతో లక్షలాదిమందికి ఉపాధి దొరుకుతుంది. ఇట్లాంటిదే భారతీయ సినిమా పరిశ్రమ. ఇరవైఐదు లక్షలమందికి ఉపాధి కల్పిస్తున్న బిలియన్ డాలర్ల పరిశ్రమ ఆంగ్ల మాధ్యమంతో రెండు దశాబ్దాలలో కుప్పకూలిపోకతప్పదు. మన దేశంలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ ప్రకటనా పరిశ్రమ. ఆంగ్లమాధ్యమంతో ఉనికినే పోగొట్టుకొంటోంది. ప్రతి ఏటా కోట్లల్లో కొత్త బ్రాండ్లు వస్తు రూపంలో మార్కెట్లలో విడుదల అవుతున్నాయి. అవి అన్నీ మన రాష్ట్రాలలో అమ్మాలంటే తప్పనిసరిగా స్థానిక భాషలో ఉండాలని నిబంధనతో వేలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆంగ్ల మాధ్యంవలన ఇట్లాంటివి ఆలోచనలకే దూరం అవుతున్నాయి. మనని

మన కాళ్ల మీద నిలబెట్టక ఇతరులు అందించే ఉద్యోగాలకు చేతులుచాపండని మన ప్రజా ప్రభుత్వాలు అనుకొంటున్నట్టు ఉంది.

### ఏమిటి ఈ సామాజిక విధ్వంసం?

చాలామంది ఆంగ్లమాధ్యమంతోనే అందరికీ ఉద్యోగాలు వస్తాయని భ్రమకలిగిస్తున్నారు. మన దేశంలో ప్రతి ఏటా కోట్లల్లో గ్రాడ్యుయేట్లు తయారవుతుంటే విదేశీ ఉద్యోగాలు వేలల్లో మాత్రమే వస్తున్నాయి. అట్లాంటప్పుడు ఎందుకు ఈ ఆంగ్ల మాధ్యమం?

పాఠశాల విద్యవరకూ మాతృభాషా మాధ్యమంలోనే విద్య కావాలనీ అది అందరికీ ఒకే విధంగా అమలుకావాలనీ చట్టం చేయాలనీ కోరుకోవడం విజ్ఞత కాదా.

### భవిష్యత్ భాషలు ఏవి?

ఒక భాష భవిష్యత్తును నిర్ణయించటానికి ఉండవలసిన యోగ్యతలలో ఈ క్రింది అంశాలను పరిగణించవచ్చు. భాషా సాంకేతిక పరిజ్ఞానంతో స్వయంచాలకంగా అనువాద వ్యవస్థల ఉపకరణాల ఉత్పత్తికి మార్గం సుగమం చేసే క్రమంలో కృత్రిమ మేధస్సుతో కూడిన పురోగతితో గొప్ప సాంకేతిక ఆవిష్కరణలు సాకారమయ్యే సమయంలో, ఆంగ్లభాషా మాధ్యమాల అవసరాలూ అనేక భాషలను తప్పనిసరిగా నేర్చుకోవాలనే నిబంధనలన్నీ అసంబద్ధం అవుతాయి.

భాషా సాంకేతిక పరిజ్ఞాన మద్దతు ఉన్న భాషలు భవిష్యత్తులో సురక్షితం. అలాగే విద్యా మాధ్యమంగా ఉపయోగించబడే భాషలూ రక్షణ, భద్రతా విషయాలలో ఉపయోగించే భాషలూ ప్రత్యేకమైన వేదాంత సాహిత్యాన్ని కలిగి ఉన్న భాషలూ సురక్షితమే.

**దేశాలు తమవి కాని భాషలను ఎందుకు ఉపయోగిస్తాయి?:**
ఈ ప్రశ్నకు సమాధానం, సిగ్గులేని దేశాలు మాత్రమే తమవి కాని భాషలను ఉపయోగిస్తాయి అనేది. చెప్పిన జవాబు కొంత అమర్యాదగా ఉన్నా, దీనికి కొంత వివరణ అవసరం. దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన గురజాడ సాక్షిగా ఇక్కడ ప్రజలకే సిగ్గు లేనిది. ఐతే ఒకటి, నిరక్షరాస్యులు ఎక్కువ ఉన్నారన్నా, ఈ స్థితికి కారణం మాత్రం చదువుకున్నవారే. దారితప్పిన ప్రభుత్వాలను దారిలో పెట్టవలసిన బాధ్యత వారిదే. మరో జవాబు, బానిసత్వంలో మగ్గుతున్న వలస దేశం కాబట్టీ వలసదారు భాషే వాడాలని నియమం. ఇది స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోయిన జాతి లక్షణం. ప్రజాస్వామ్యం అంటే ప్రతి ఒక్కరూ వనరుల వాడకంలోనూ ఇంకా ఉత్పత్తిలోనూ సమానంగా భాగస్వామ్యాన్ని కలిగివుండడం అని నిర్వచనం. ప్రజల భాష ప్రజలకు వారసత్వంగా సంక్రమించిన ప్రజా వనరు. దానిద్వారానే మనం ఉత్పత్తులను సాకారం చేసుకుంటాం. ఈ వరవడిలో ప్రజల భాషను ఉపయోగించడం ద్వారా మాత్రమే ప్రజల భాగస్వామ్యం సాధ్యమవుతుంది. ప్రజల భాషను ఉపయోగించని చోట, ప్రజాస్వామ్యం ఎలా సాధ్యం?

విదేశీ భాషల వాడకం పరోక్షంగా విదేశీ పాలనను శాశ్వతం చేస్తుంది. విదేశీ భాష ద్వారా విద్య విదేశీయ వ్యక్తులూ సంస్థల పట్ల సానుకూల వైఖరిని తీసుకోవటానికి తత్ఫలితంగా అంతర్గత అభిప్రాయాలను విస్మరించడానికి మనల్ని ప్రభావితం చేస్తుంది. స్థానికేతర భాషలను ఉపయోగించినప్పుడు జీవనోపాధి ఇంకా ఉద్యోగ అవకాశాలు బాగా తగ్గుతాయి. కింది వాటిని పరిశీలించండి:

స్థానిక భాషలపై ఆధారపడిన పరిశ్రమలు స్థానిక జనాభాకు ఆశ్రయమిచ్చే అద్భుతమైన సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇంతకు ముందు చెప్పినట్లు బిలియన్ డాలర్లకు పైగా టర్నోవర్ ఉన్న భారతీయ చలన చిత్రపరిశ్రమ ఇంకా 25,00,000 మందికి ఉపాధిని కలిగిస్తోంది.

భారతీయ భాషలలో ముద్రణా ప్రచురణ పరిశ్రమ ప్రపంచం లోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటి. ఇది ఇరవై నుండి ముప్పై లక్షల మందికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. మన విద్యా మాధ్యమం కేజీ నుండి పీజీ వరకు ఆంగ్లంలో కొనసాగితే వీరికి ఉద్యోగాలు ఎవరు ఇస్తారు? మనకు పెద్దా చిన్నా, ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర విశ్వవిద్యాలయ స్థాయి విద్యాసంస్థలు వెయ్యికి పైనే ఉన్నాయి వీటిలో ప్రతి ఒక్కటీ అనేక అనుబంధ కళాశాలలను కలిగి ఉంటుంది. వారందరికీ పెద్ద గ్రంథాలయాలు ఉంటాయి. ప్రతి లైబ్రరీ విదేశీ కరెన్సీలో నగదు చెల్లించి పదులూ లేదా వందల సంఖ్యలో కాపీలలో పుస్తకాలను కొనుగోలు చేస్తుంది. ఈ పుస్తకాలన్నీ ఆంగ్లంలో ఉంటాయి.

భారతీయులు రాసిన పుస్తకాలు 5% కన్నా తక్కువ. ఎందు కంటే, ఇంగ్లీష్ మనకు స్థానిక భాష కాదు. ప్రతి ఏటా మనం ఈ పుస్తకాలను కొనడానికి లక్షల కోట్ల చొప్పున విలువైన మన డబ్బును ఖర్చు చేస్తాము. ఈ పుస్తకాలను భారతీయ భాషల్లో ఉత్పత్తి చేస్తే డబ్బు మన వద్దనే ఉంటుంది గదా.

మనభాషలలోనే విద్య నేర్పితే మన ప్రచురణా పరిశ్రమ గొప్ప వ్యాపారం చేస్తుంది. పెద్ద సంఖ్యలో ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తుంది. మన ఉపాధ్యాయులూ ఆచార్యులూ చాలామంది వారి మాతృభాషలో పుస్తకాలు వ్రాస్తారు. విద్యార్థులు వారి మాతృభాషలోనే పుస్తకాలు చదవడానికి ఉత్సుకతను చూపిస్తారు.

భారతీయ భాషలలో లక్షలలో రచయితలూ గ్రంథకర్తలూ ఉన్నారు. ఆంగ్ల మాధ్యమం రావడంతో, ఏటా పాఠకుల సంఖ్య తగ్గడంతో మన రచయితలూ గ్రంథకర్తలనుండీ వినూత్నమైన సృజనాత్మక రచనలూ ప్రచురణలూ రావడం వేగంగా తగ్గిపోతోంది. ఇది ప్రత్యేకంగా వారి సృజనాత్మకతపై భయంకరమైన ప్రభావాన్ని చూపుతుంది. దీనితో మన సామాజిక, చారిత్రక, వారసత్వపు వేల సంవత్సరాల జ్ఞాననిధులు త్వరలో మన తెలుగు జనానికి అసంబద్ధం అవుతాయి.

ప్రస్తుతం, వివిధ ఆర్థిక రంగాలలో (వ్యవసాయం, చేపలపరిశ్రమ, అడవులూ, గనులతవ్వకం, భవననిర్మాణం, హోటలువ్యాపారం, పరిశ్రమలూ, గ్యాస్, విద్యుత్, నీటి సరఫరా, సేవలూ, వాణిజ్య–వ్యాపారాలూ, మొద.) పనిచేసిన శ్రామికులూ, ఉద్యోగుల వివరాలూ మన జనాభా లెక్కల ప్రకారం, వారి విద్యాస్థాయి, వారు ఉపయోగించిన భాషలను పరిగణనలోకి తీసుకొని స్థూల జాతీయోత్పత్తి అభివృద్ధికి అందించిన తోడ్పాటును పరిశీలించగా అందులో 85% భారతీయ భాషల ద్వారానే వస్తోందని తెలుస్తోంది. అలాంటప్పుడు



## హోసూరు సత్యనారాయణరెడ్డి కన్నుమూశారు

20 ఏళ్లుగా హోసూరు (తమిళనాడు) కేంద్రంగా నడుస్తున్న తెలుగు భాషోద్యమ కార్యక్రమాల్లో ప్రముఖంగా పాల్గొంటున్న శ్రీ ఎం. సత్యనారాయణరెడ్డి 21-9-2019 ఆదివారం నాడు గుండెపోటుతో కన్నుమూశారు. రైతు కుటుంబంలో పుట్టిన సత్యనారాయణరెడ్డి పాత్రికేయుడిగా చురుకుగా ఉండేవారు. భైరమంగల గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తూ, సెజ్‌ల వల్ల రైతులకు జరిగే నష్టాన్ని గుర్తించి అందుకు వ్యతిరేకంగా పోరాడారు.

ప్రధానంగా హోసూరు ప్రాంతంలో అత్యధిక సంఖ్యలో తెలుగు వారున్నా తెలుగువారికి తెలుగు భాషకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలుగు వ్యతిరేక చర్యల్ని ఎదుర్కొనడం కోసం గత 20 ఏళ్ళ క్రితం మళ్లీ మొదలైన తెలుగు భాషోద్యమంలో ముందు వరుసలో ఉండి పనిచేశారు. నిర్బంధ తమిళ బోధన చట్టాన్ని నిరసిస్తూ జరిగిన ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర వహించారు. హోసూరులోని ఉద్యమాన్ని గురించి తెలుగువారందరికి తెలుపాలనే ఆశయంతో తొలుత విజయవాడకు వచ్చి 'నడుస్తున్న చరిత్ర' సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబును కలిసి, కీ.శే. వావిలాల గోపాలకృష్ణయ్య గార్ని విజయవాడకు ఆహ్వానించి పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించి – హోసూరులో తెలుగువారి సమస్యలను బహిరంగ పరచిన ఘనత సత్యనారాయణరెడ్డి గారిదే. అనేకసార్లు వందలాది ప్రజలతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించడంలో ఆయనది ప్రధానపాత్ర. అప్పట్లో – నడుస్తున్న చరిత్రలో పలుసార్లు యీ అంశంపై వ్యాసాలు వ్రాశారు.

గత కొన్నేళ్లుగా 'సాక్షి' దిన పత్రిక ప్రధాన విలేఖరిగా హోసూరులో పనిచేస్తూ, 56 ఏండ్ల వయసులోనే తనువును చాలించడం అందరికీ విషాదాన్ని మిగిల్చింది. ఆయన నిర్యాణం తెలుగు భాషోద్యమంలో ఒక లోటుగా మిగిలిపోయింది. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపాన్ని సానుభూతిని తెలుపుతున్నాము. – సంపాదకుడు

మాతృభాషలను విద్యారంగంనుండీ తొలగించడం ఎంత వరకూ సబబు?

**ఆంగ్ల మాధ్యమం ప్రస్తుతం ఇలా కొనసాగితే, 23 ఏండ్లలో మన సమాజం ఉత్పాదక సమాజంగా కాకుండా పూర్తిగా వినియోగదారు సమాజంగా మారుతున్న పరిస్థితి వస్తుంది. మనం ప్రతిదీ డౌన్ లోడ్ లేక దిగుమతో చేసుకోవాలి ఆపై దానికోసం చెల్లించాలి. సృజనాత్మకత ఇంకా ఆవిష్కరణలకు అవకాశం ఉండదు. ఎక్కువ సమయం, మన విద్యార్థులు తెలియని భాషను నేర్చుకోవలసిన అవసరం ఉన్నందున అర్థం చేసుకోకుండా బట్టీపట్టే పద్ధతికి అలవాటు పడతారు.**

ఖర్చుతో కూడిన ఇంగ్లీష్ మాధ్యమాన్ని భరించగలిగే ఉన్నత వర్గాలవారూ దాన్ని భరించలేని దిగువవర్గాలవారూ అని ఇది రెండు వేర్వేరు భారతదేశాలకు దారితీస్తుంది. ఇంగ్లీష్ ఇండియా ఇంకా స్థానిక భారతదేశం పరంగా మన మధ్య చీలికలు తప్పవు. ప్రతి సంవత్సరం ఇరవై లక్షల మంది ఇంజనీర్లూ, మరో పది లక్షలమంది ఇతర నిపుణులు (వైద్యులు, మేనేజ్‌మెంట్ ట్రైనీలు మొదలైనవారు) దాదాపు ఒక కోటీ 20 లక్షలమంది ఇతర గ్రాడ్యుయేట్లు మన విశ్వవిద్యాలయాలనుంచి బైటికి వస్తున్నారు. మన ఉపాధి అవసరాలు ప్రతి సంవత్సరం కోటీ యాభై లక్షల మంది అయితే అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా ఇంకా ఇతర ఆంగ్ల ఆధారిత ఉపాధి అవకాశాలు 35,000 నుండి 40,000 ఉద్యోగాలు మాత్రమే. మరి ఈ కోటీయాభై లక్షల ఉద్యోగాలుఏ విదేశాలు పిలిచి ఇస్తాయి. అలా ఇవ్వనపుడు ఆంగ్ల మాధ్యమం ఎందుకు. ఇక్కడి ఉపాధి ఉద్యోగ వనరులను నాశనం చేసుకొని ఇంటా బయటా ఉద్యోగాలూ రాక ఈ యువత ఏం కావాలి. మరో ఉగ్రవాదానికి సరికొత్త నారుపోస్తున్నట్లు లేదా ఇది?

అవసరానికి అందుబాటులో ఉన్నవాటికీ మధ్య అంతరం చాలా పెద్దది. స్థానిక భాషలను బోధనా మాధ్యమంగా మార్చడం ద్వారా మన విద్యావ్యవస్థకు పునఃరూపకల్పన చేయకపోతే మా ఉపాధి సమస్యకు పరిష్కారం కనుగొనడం అసాధ్యం.

ఆంగ్లమాధ్యమ విద్యతో మన సమాజం పేదరికం నుండి ఉపశమనం పొందుతుందనే ఆలోచన తప్పు, అశాస్త్రీయమూ ఇంకా అహేతుకమూ కూడా. ఇంగ్లీషు మన గతకాలపు సంస్కృత స్థానంలోకి తెచ్చిపెట్టుకొన్నట్లు ఉండటమేగాక మళ్లీ అవే సామాజిక హెచ్చుతగ్గుల్ని కొనసాగించుతూనే ఉంటుంది.

**ఈ రోజు ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలన్నీ. జపాన్, దక్షిణ కొరియా, చైనా, తైవాన్, యూరోపియన్ ఇంకా ఇతర దేశాలు వారి విద్యావ్యవస్థను స్థానిక భాషలలోనే కొనసాగిస్తున్నాయి. అక్షరాస్యతను విదేశీ భాషలో కాకుండా స్థానిక భాషల్లో అమలు చేయడం అవసరం. సామాజిక సంబంధిత ప్రభుత్వ కార్యక్రమాలైన స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, చలామణి రద్దు, ఇ-బ్యాంకింగ్ మరియు ఇ-బిజినెస్ యొక్క ఫలాలు ప్రతిఒక్కరికీ చేరాలంటే అవి స్థానిక భాషలలో ఉండాలిగదా... భారతదేశం అంటే భారత సంయుక్త రాష్ట్రా లని గుర్తుంచుకోవాలి. ప్రతిభాషా ఒక జాతీయ భాషే... అన్ని అధికార భాషలూ ఈ దేశ అధికార భాషలే. వీటిని రాజ్యాంగంలో గుర్తించడం వీటి అభివృద్ధికి చర్యలు చేపట్టమని ప్రభుత్వాబాధ్యతను గుర్తించమనే.**

ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి
9440493604

# మన వేల్పుపలుకు మన పలుకు ఒకటి కాదా?

**భాష** అన్న మాటే బాగా వాడడం మనకు అలవాటై పోయింది. దానికి 'పలుకు', 'మాట', 'నుడి' అనే పర్యాయ పదాలున్నాయని దాదాపు మర్చిపోయాము. నా చిన్నతనంలో మా ఊరికి తూర్పునుండి ఒక కుటుంబం లేచి వచ్చింది. మా ఊరిలో వారి చుట్టాలున్నారు. వారి అండతో ఇక్కడ బతకాలని వచ్చారు. మా ఇంటికి వెనుకభాగంలో ఉండేవారు. ఒకటి రెండురోజుల్లోనే వారు మా ఇంటికి వచ్చి మాతో అది ఇదీ మాట్లాడవలసి వచ్చింది.

కొత్తగా వచ్చారు కదా ఏదైనా వస్తువుల కోసం పనిముట్ల కోసం ఆహార పదార్థాల కోసం వచ్చేవారు. వీటన్నిటిని గురించి అడగాలంటే వాటి పదాలు చెప్పాలి కదా. అలా చెప్పేవారు. మా నాయనమ్మ మా అమ్మ అవేవీ అర్థం కాక చాలా ఇబ్బంది పడేవారు. ఇదా ఇదా అని వస్తువులు ఆహారపదార్థాలు చూపేవారు. వారు పోయిన తర్వాత మా నాయనమ్మ మా అమ్మ ఇద్దరూ వారి మాట ఏమీ అర్థం కావడం లేదు. అనే వారు. అసలు ఆ పలుకే వేరు అనేవాడు మానాన్న. మా ఇంటికి పనికోసం వచ్చిన రైతులు వాళ్ళ పలుకుబడి అంతా వేరుగా ఉంది బావా అనేవారు మానాన్నతో.. వారు మాట్లాడేది తెలుగే. మన భాషే. కాని ఇక్కడ వారు మాట్లాడిన భాషకి మానాయనమ్మ మా అమ్మ మాట అని మాటలు అని అన్నారు. నాన్న పలుకు అని ఇంకా పలుకుబడీ అన్నారు మరికొందరు. మనకు మాట, పలుకు అనే పదాలు కూడా భాషకు వాడుకలో ఉన్నాయి.

మా చుట్టుపక్కల 'వేల్పులవాళ్ళు' అనే కులం వారు ఉండేవారు. వారు గ్రామదేవతల 'కొలుపులు' కొలిచేవారు. అందుకే వారికి 'కొలుపులోళ్ళు' అనే పేరుకూడా ఉండేది. దేవతలకు మనకున్న దేశీయమైన పేరు వేల్పు, పూజకు మనకున్న మాట కొలుపు. ఈ మాటల్ని కూడా మనం మరిచాము. దేశీయమైన పదాలే కాదు దేశీయమైన పూజలు ఆరాధన పద్ధతులు మనకున్నాయి. మనవారే పూజారులు. గ్రామాలలో అమ్మదేవతలు ఉన్నారు. ఆ గుడుల్లో చాకలి (రజక), మంగలి (నాయీబ్రాహ్మణ), కుమ్మరి (శాలివాహన) కులాల వారు ఇక గూడెం నుండి వచ్చే కొలుపులు వారు, వేల్పులవారు, కొమ్ములవారు పూజార్లుగా ఉన్నారు. వాళ్ళు పాడే మంత్రాలు, పాడే పాటలు అన్నీ తెలుగులోనే ఉన్నాయి. ఊరి వారు అందరూ తెలుగులోనే వాటిని వింటారు. అమ్మా తల్లే, కాపాడమ్మా, మేలు కోమ్మా, పొలందుకోమ్మా, బలందుకోమ్మా.. ఇలా అన్నీ తెలుగులో ఉండేవి. అక్కడ అమ్మతల్లులకు, అయ్యలకు అంతా తెలుగే అర్థమవు తుంది. ఇక్కడ వేల్పుపలుకు (దేవభాష) తెలుగే.

ఇక తర్వాత పరిశోధనలో దిగిన తర్వాత తెలంగాణ ప్రాంతం లో మల్లన్న గుడులు, ఎల్లమ్మ గుడులలో పరిశోధన చేసిన తర్వాత అక్కడ ఒగ్గుపూజార్లు, ముదిరాజు పూజార్లు ఇంకా ఇతరులు చదివే తెలుగు మేలుకొలుపులు, తెలుగు మంత్రాలు, పూజలు అన్నీ అక్కడి ప్రజలు మాట్లాడుకునే భాషలో ఉండడం చూశాను.

ఒగ్గు పూజారులు పటం వేసి పూజ చేయడం, మైలతీయడం అన్నీ తెలుగు పాటలతో, తెలుగు పూజలతో అంతా తెలుగులో ఉండడం చూశాను.

ఇలా ఉండగా మన పెద్ద గుడులలో అంటే, రామాలయం, వేణుగోపాల స్వామి గుడి, శివాలయం, సుబ్రహ్మణ్య స్వామి, ఇంకా ఇలాంటి పెద్ద దేవుడుల గుడులలో మాత్రం ఎక్కడా తెలుగు విన పడదు. పూజారి గారు భక్తులతో మాట్లాడేది మాత్రం తెలుగే. కాని దేవుళ్ళతో మాత్రం సంస్కృత మంత్రాలతోనే మాట్లాడతారు.

మన దేవుళ్ళు ఏ భాషలో మాట్లాడారో మనకు తెలియదు.; తెలుసు అని అనుకుని చెప్పేవాళ్ళు మాత్రం దేవుళ్ళు సంస్కృతంలో మాట్లాడుకుంటారు అని చెబుతారు. అందుకే దీన్ని దేవభాష అనీ 'అంటూంఛారు' అంతే కాదు దీన్ని గీర్వాణభాష అని గీర్వాణంగా చెబుతారు. కాని దేవుళ్ళు మాట్లాడగా విని చెప్పిన వారు తటస్థిస్తే దీన్ని నిక్కచ్చిగా నమ్మే వీలుంది. దేవుళ్ళలో కూడా జండర్ వివక్ష చాలా ఉందని చెప్పడానికి వీలుంది. మన సంస్కృత నాటకాల్లో పురుష దేవతలు అందరూ సంస్కృతంలో సంభాషిస్తూండగా సేవ కులు పరిచారకులు వంటి అథమ పాత్రలు, స్త్రీ దేవతలు మాత్రం సమాజంలో తక్కువగా భావించబడిన ప్రాకృత భాషలో మాట్లాడతాయి. ఇదంతా మన సంస్కృత నాటకకారుల చేతిచలువే కాని దేవతా స్త్రీలు ఏ భాషలో మాట్లాడారో వారికేం తెలుసు అని మన ఫెమినిస్టు వీరనారీమణులు అడిగే అవకాశమూ లేకపోలేదు. నిజానికి దేవుళ్ళు ఏభాషలో మాట్లాడినా మనకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. కాని మనం మాట్లాడే తెలుగు వారికి అర్థం కాదటనా. దీనితోనే మనకు ఇబ్బంది వచ్చింది.

ప్రతి మనిషి తాను పుట్టిన ఇంట్లో తల్లి తండ్రి కుటుంబ సభ్యులతో నేర్చుకునే భాష ఒకటి ఉంటుంది. దాన్నే మాతృభాష అని అంటారు. నిజానికి ఇది కుటుంబ భాష. వ్యక్తి పెరిగి విద్యావం తుడు అవుతూ ఇతర భాషలు నేర్చుకుంటాడు. తన సామాజిక అవసరాలకు ఏ భాష అవసరమో దానిలో అతను పని చేసుకుంటాడు. తన దైనందిన జీవితపు అవసరాలకు తన భాషే వినియోగపడాలని ప్రతి భాషీయుడు కోరుకుంటాడు. అలా వీలుపడని సందర్భాలలో ఆ సందర్భానికి అవసరమైన భాషలో పని చేసుకోవలసి ఉంటుంది.

ప్రతి భాషకు సంబంధించిన వారికి, ప్రతి సంస్కృతిలోని వారికీ సామాజిక సందర్భాలతోపాటు మత సందర్భాలూ ఉంటాయి. అంటే దేవునితో సంబంధం ఉన్న సందర్భాలు అని కూడా వీటిని చెప్పవచ్చు. ప్రతి సంస్కృతిలో జానపదులలో గిరిజన తెగలలోను ఈ మత సందర్భాలలో దేవునికి మనిషికి మధ్యన మరొక మనిషి ఉంటాడు. ఇతడినే పూజారి అని ఆచారమంతుడు అని, ముజావర్ అని పాస్టర్ అని ఒక్కొక్క మతంలో ఒక్కో సంస్కృతిలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఈ మధ్యవర్తి మన తరఫున దేవునితో మాట్లాడు

తుంటాడు.

ప్రతి సంస్కృతిలోను దేవునితో మాట్లాడే భాష దేవుడు మాట్లాడే భాష వేరుగా ఉంటాయని ప్రజలు విశ్వసిస్తారు. అందుకే చాలా మత గ్రంథాలు సామాన్య మానవులు మాట్లాడే భాషలో లేవు. అంతే కాదు మత సంబంధమైన దైవ సంబంధమైన కార్యక్రమాలు అన్నీ అందరికీ అర్థంకాని భాషలో ఉంటాయి. ఒక తరహా భాషకు మత గౌరవం లభించిన తర్వాత ఆ భాష అర్థంకాకపోయినా ఫర్వాలేదు అనే భావన ఆ భాషీయులలో కలగడం అన్ని చోట్లా గమనించవచ్చు. అందుకే వీటికి (ritual languages) రిచ్యువల్ లాంగ్వేజస్ అని అంటారు. అంటే ఇక్కడ పావిత్ర్యం అనే భావన భాషతో ఉందే కాని భావంతో ప్రధానంగా కాదని. ప్రస్తుతం ఈ విషయంలో తెలుగు నేలపై ఏం జరుగుతుందో గమనించి మంచి చెడు ఆలోచన చేద్దాం. ఆంధ్ర దేశంలో ఎక్కువ శాతం ప్రజలలో అంటే చాలా కులాల వారికి మత సంబంధ కార్యక్రమాలు నిర్వహించేది బ్రాహ్మణ కులానికి చెందిన పూజారులు.

లైఫ్ సైకిల్ రిచ్యువల్స్ వీటినే జీవనచక్రసంబరాలు అని అంటారు. అంటే మనిషి పుట్టినప్పుడు చేసే ఆచారం దగ్గరనుండి ఉపనయనం, రజస్వల, పెండ్లి, గర్భాదానం తిరిగి పుట్టుక అంటే బారసాల మరణం వీటన్నింటి సందర్భాలలో పూజారి ఉండి మనతో ఆయన పూజ చేయించవలసి ఉంటుంది. మన తరపున దేవునికి ఆయన మంత్రాలు చదువుతాడు. అంతే కాదు చాలా ఇతర సంద ర్భాలలో అంటే గృహప్రవేశం, సత్యనారాయణ స్వామి వ్రతాలు వంటి చాలా వ్రతాలలోను ఇలాంటి ఇతర మత సందర్భాలలోను పూజారి లేకుండా పనులు జరగవు. ఇక గుడికి పోతే మనం చేసే అష్టోత్తరం సహస్రనామం, అర్చనలు వంటి అన్ని సేవలు మన తరపున పూజారి చేస్తాడు. తెలుగు నేలమీద తెలుగు వారి ఇండ్లలో, గుడులలోను జరిగే ఈ అన్ని కార్యక్రమాలలోను పూజారి చదివే మంత్రాలు పూజలు; అన్నీ అటు పూజారికీ ఇటు చేయించుకునే వారికి తెలిసిన తెలుగు భాషలో జరగవు. ఇవి అన్నీ సంస్కృత భాషలో జరుగుతాయి.

దేవునికి ఘంటానాదం సమర్పయామి, మధ్యమధ్యే పానీయం సమర్పయామి, ధూపదీపమాఘ్రాపయామి; అని మనం చేసే సేవలు అన్నింటికీ మన తరపున పూజారి మనకు తెలియని సంస్కృతభాషలో చదువుతాడు. దేవాలయంలో కాని ఇంటి వద్ద కాని చేసే యజ్ఞ యాగాదులన్నింటా చేసేది మనం అయినా చేయంచే పూజారి చదివేది మనకు తెలియని సంస్కృత భాషే. చివరికి సంకల్పం చెప్పే భరత వర్షే భరత ఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే, కృష్ణా గోదావరీయోర్మధ్యదేశే అస్మద్ గృహే పత్నీ సహితం అని వగైరా మన ఇంట్లో మనం, అంటే నేను వ్రతాన్ని ఆచరిస్తున్నాను అని మనం చెప్పే మాటల్ని పూజారి దేవునికి సంస్కృతంలో వినిపిస్తాడు. ఇలాంటి సంకల్పాన్ని చక్కగా మనకై మనం తెలుగులో నేను ఫలానా పేరు కలిగిన వ్యక్తిని భరత వర్షంలో భరతఖండంలో మేరు పర్వతానికి దక్షిణ దిక్కున కృష్ణా గోదావరీ నదుల మధ్యభాగంలో ఉన్న తెలుగు నేలలో లేదా నదికి ఆవల పక్కన ఉండే ఆ విషయాన్ని చెబుతూ, ఫలానా ఊరిలో ఉండి, కుటుంబ క్షేమాన్ని కోరి వ్రతం చేస్తున్నాను దేవా అని దేవునికి తెలుగులో మనం చెప్పుకోలేమా అన్నది ప్రశ్న. ఇక్కడ పవిత్రత **సంస్కృత భాషని బట్టి వస్తుందా లేదా చేసే మనసును బట్టి వస్తుందా అన్నది మనం ఆలోచించాలి.**

అంతే కాదు పెళ్ళి సందర్భంలో వరుడుతో తాళి కట్టే ముందు పూజారి ఒక మంత్రం అనిపిస్తాడు. మాంగల్యంతంతునానేనా మమ జీవన హేతునాం కంఠే బధ్నామి శుభగే సంజీవ శ్శరదాం శతం అని. నోరు తిరిగినా తిరగకపోయినా పెళ్ళికొడుకు దాన్ని చెప్పి తర్వాత ఆమె మెడలో మాంగల్యాన్ని కడతాడు. ఇది పూజారికి అర్థం అయితే కావచ్చుగాక కాని తాళికట్టే పెండ్లి కొడుకులకు దీని అర్థం నూటికి తొంభై తొమ్మిది మందికి అర్థం కాదు. కట్టించుకునే పెండ్లి కూతురుకీ అర్థం కాదు చుట్టూ ఉన్న బంధుమిత్రులకూ; అర్థంకాదు. ఇంత బాధ ఎందుకు పెండ్లి కొడుకుతో నేను నూరేండ్లు హాయిగా ఈమెతో కలిసి జీవించడానికి గాను ఈమె కంఠంలో మాంగల్యాన్ని కడుతున్నాను అని చక్కగా తెలుగులో చెప్పి కట్టవచ్చుగా. మిగతా ప్రమాణాలు అన్నీ కూడా ఇలా తెలుగులో చేస్తే చాలా హాయిగా ఉండదా. కాని పెండ్లివేళ అక్కడికి ఆవాహన చేసిన దేవుళ్ళకి ఈ తెలుగు అర్థం కాదట. దేవుళ్ళకి అలా సంస్కృతం మంత్రాలలోనే చదివితేనే పవిత్రమైనదని వారికి తెలుస్తుందని ఒక పూజారి గారు సెలవిచ్చారు. అంతేకాదు అలా మంత్రాలని తెలుగులో చదివి చెప్పడాన్ని పెళ్ళి చేయించుకునే ప్రజలు ఎవరూ అంగీకరించేలా కూడా లేరు. వారికి కూడా సంస్కృతం మంత్రాలు చదివితేనే తృప్తి అక్కడికి అది పవిత్రమౌతుందని భావం కలుగుతుంది. గుడిలో జరిగే విషయంలోను ఇదే జరుగుతుంది. కాని ఒకప్పుడు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు పెండ్లిండ్లు అన్నీ తెలుగులో చేయవచ్చని చేయాలని ఒక ఉద్యమంగా గ్రహించి చేపట్టారని చాలా సందర్భాలలో అలా చేయించారని మా పెద్దవాళ్లు చెప్పగా విన్నాను. పెండ్లి మంత్రాలన్నీ తానే చదివి దేవునికి అప్పగిస్తే పెండ్లి కొడుకు ఊరక అతను చెప్పినవన్నీ చేస్తే ఆమె ఎవరి భార్య అవుతుంది అనే తీవ్రమైన ప్రశ్నలు కూడా లేవనెత్తాడు వెనిగళ్ళ సుబ్బారావు పెండ్లి మంత్రాల వెనుక బండారం అనే పుస్తకంలో.

కాని ఈ పరిస్థితి దేశం అంతటా ఇలా లేదు. చాలా గ్రామ దేవత గుడులలో పేరంటాళ్ళ దేవతల గుడులలో వెనుకబడిన వర్గా లకు చెందిన వారు దళితులు పూజారులుగా ఉన్నారు. అక్కడ జరిగే ఆచారాలన్నింటిలో తెలుగులోనే పూజా కార్యక్రమాలు జరగడం గమనించవచ్చు. చాలా గ్రామ దేవతల గుడులలో రజకులు, క్షురక వృత్తి వారు పూజారులుగా ఉన్నారు. అలాగే కొమ్ముల వాళ్ళు, బైండ్ల వాళ్ళు వంటి దళితులు పూజలు చేసే గుడులు జాతరలు కొన్ని ఉన్నాయి వాటిలో ఈ కులాల పూజారులు వారి మంత్రాలను ఆచా రాలను తెలుగులోనే చేస్తారు. కొన్ని సందర్భాలలో వినపడకుండా చదవడం కూడా ఉంది. దీన్ని బట్టి పవిత్ర కార్యక్రమాలు అన్నీ తెలుగులో చేసుకోవచ్చు అని ఒక నిరూపణ మనకు ఉండనే ఉంది.

చాలా మంది గిరిజనులు వారి దేవతల పూజల్ని వారి

## సంస్కృతాన్ని అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

భాషలోనే చేసుకోవడం ఉంది. ఇన్ని ఉండగా నూటికి ఎనభై మంది పైగా ఉన్న తెలుగు వారు అటు గుడులలోను ఇటు ఇండ్లలో జరిగే మత కార్యక్రమాలలోను ఎరికీ తెలియని సంస్కృత భాషను ఎందుకు వాడాలి మనకు తెలిసిన తెలుగులోనే మనం చేసుకోకూడదా. నిజానికి మనం మన దేవునికోసం మనమే చేసే పూజకు మధ్యవర్తి ఉండి మనకు తెలియని భాషలో చదవడం అవసరమా. ఇవి మౌలికమైన ప్రశ్నలు. ఇవి విశ్వాసానికి మాత్రమే సంబంధించినవి కావు. అసలు దేవుని దృష్టిలో మనుషుల మధ్య తారతమ్యాలు లేనట్లే భాషల మధ్య కూడా ఉండవు. అది నిజంగా దేవుడే అయితే ఆభేదాలు అసలు ఉండడానికే వీలు లేదు. మన దేవుళ్లకు తెలుగు రాదా అని ప్రశ్న వేసుకుంటే రాదు అని చెప్పగలిగే తెలుగు వారు ఉన్నారా? రాదు అని చెప్పలేనప్పుడు మన తెలుగుకు మతసంస్కార స్థాయిని కల్పించి గుడిలో ఇంట్లో అన్ని మత కార్యాలకు తెలుగే ఎందుకు వాడకూడదు అని ప్రశ్న వేసుకుందాం. ఈ విషయంలో క్రిస్టియన్లు కొంత మెరుగు అనిపిస్తుంది. వారు మత ప్రచారం చేయడానికి తమ టార్గెట్ గా ఎవరు ఉన్నారో వారి భాషలోనే ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారు. క్రీస్తు భాష అని హీబ్రూ భాషలో చేయరు. పెండ్లిలోను అందరికీ అర్థమయ్యే తెలుగులో ప్రమాణం చేస్తారు. కాని వారి తెలుగు విషయం లోను తకరారు ఉంది. వారు ఒక ప్రత్యేకమైన తెలుగును కృతకమైన దాన్ని అభివృద్ధి పరచారు. వారి మతప్రచారకులకు మామూలు అందరికీ అర్థమయ్యే తెలుగు వచ్చినా దానిలో మాట్లాడరు. వారి కృతకమైన తెలుగులోనే మాట్లాడతారు. ఇక్కడ కూడా ఆ తెలుగుకు మత స్థాయి వచ్చింది. అందుకే అదే భాష వారికి నచ్చుతుంది. వారి బోధనలు వినేవారికీ నచ్చుతుంది. ఆ కృతక అనువాద భాష వారి మతభాషగా నిలిచిన తర్వాత అదే వారికి (sacred diction) పవిత్రమైన పలుకుబడిగా మారింది.

కాని మన ఇండ్లలో చేసే పూజల్లోను గుడుల్లో చేసే పూజల్లోను మనకు మనమే దేవునికి మనకు తెలిసిన మన తెలుగులో చేసు కోలేమా అని ప్రశ్నించుకొని ఆచరిస్తే, మన తెలుగుకు మతసంస్కార స్థాయిని పవిత్ర స్థాయిని తెచ్చుకోవడం మన చేతుల్లోనే ఉంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక ఉద్యమం చేసైనా తెలుగుకు మత పవిత్ర స్థాయి కూడా తెచ్చుకోవాలి. నాకు తెలుగు అర్థం కాదు అనే దేవుడు ఉంటాడని దేవుడిని నమ్మేవాళ్ళు ఎవరైనా అంటారా. చూద్దాం వేచి చూద్దాం.

బడుల్లో తెలుగు పరిస్థితి దీనాతిదీనంగా ఉందనే విషయం మళ్ళీ చెప్పవలసిన పనిలేదు. అధికారభాష అమలుకూడా ప్రభుత్వం చేతిలో ఉంది దాని పరిస్థితీ అంతకన్నా అధ్వాన్నంగా ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు పాఠశాల స్థాయిలో తెలుగు తప్పని సరి సబ్జక్టు అవుతుంది అని ఘంటాపథంగా చెప్పారు.

కాని పాఠశాల విద్య వరకైనా తెలుగు మాధ్యమం ఉంటుంది అని, తెలుగులోనే అన్ని సబ్జెక్టులు చదువుకోవచ్చు అని, ఇంగ్లీషు కూడా ఒక సబ్జక్టుగా ఉంటుంది అని చెప్పవలసింది పోయి తెలుగు కూడా ఒక సబ్జక్టుగా ఉంటుంది అని అన్నారు. ఇదే బాషకు చేసే పెద్ద సేవ అనే స్థాయికి ప్రభుత్వం వచ్చింది. ఇక ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి, ఈ మాత్రం వాగ్దానం కూడా ఇంకా చేయలేదు. పాఠశాల చదువు అంతా ఇక ఇంగ్లీషు మీడియంలోనే వచ్చేలా ఉంది.

మన చదువులు మన పలుకులో ఉండాలి. మన పరిపాలన మన నుడిలోనే ఉండాలి. ప్రజాస్వామ్య దేశంలో వారి భాషలో పాలన సాగడం అందరికీ తెలియడం అనేది ప్రజలకున్న ప్రాథమిక హక్కు అనే విషయాన్ని ప్రజలు అందరూ గ్రహించిన రోజున అదే పెద్ద ఉద్యమం అవుతుంది. అప్పుడు ప్రభుత్వాలు తప్పని సరిగా వినవలసి వస్తుంది. అప్పటిదాకా దానికోసం భాషా ప్రేమికులు తప్పక ఉద్యమం చేయాల్సిందే.

అధికారంలోనికి రావడానికి పార్టీల నాయకులు ప్రజలలోకి వెళుతున్నారు. ప్రజలు మాట్లాడే భాషలోనే మాట్లాడుతున్నారు వారి యాసలోనే బ్రహ్మాండంగా ప్రసంగిస్తున్నారు. వేరే భాషల నాయకులు వచ్చినప్పుడు మన దగ్గర ఉన్న నాయకుడు మన ప్రజల భాషలోనికి అనువాదం చేసి ప్రసంగిస్తున్నాడు. ఓట్ల కోసం ప్రజల భాషలో మాట్లాడే నాయకులు వారికి అధికారంలోనికి వచ్చిన తర్వాత పరిపాలన కూడా అదే ప్రజలభాషలో పూర్తిగా చేస్తే వారికి బాగా అర్థం అవుతుంది కదా అని మాత్రం ఆలోచించడం లేదు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలు కాబోతున్న తరుణంలో కూడా మన ప్రభుత్వ ఉత్త ర్వులు, దస్త్రాలు మన తెలుగులో లేవు ఇంకా పరాయి పాలక భాషలో ఇంగ్లీషులోనే ఉంటున్నాయి. ఏ బ్యాంకుకు పోయినా, ఏ కార్యాల యానికి పోయినా మన భాషలేదు.

మనభాషలో మనం కనీసం చెక్కుపైనైనా...సంతకం పెట్టుకునే స్థితి లేదు. **మనకు నిజంగా స్వాతంత్ర్యం వచ్చిందా? మనం ఈ ప్రశ్న వేసుకుందాం.**

## మీరు 'అమ్మనుడి' చందాదారులేనా...

'అమ్మనుడి పత్రికకు చందాదారుల చందాలసొమ్మే ఆధారం.

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రిక కవరుపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.

2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవ ప్రతిగా (కాంప్లిమెంటరీగా) అందుతూ వుండవచ్చు. అటువంటి వారికి పత్రిక నచ్చితే, దయచేసి చందాను/ విరాళాన్ని పంపించి తోడ్పడ గలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం. ఎస్ / మెయిల్‌గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు. 5000/-) గాని, 5 సం॥ల చందా (రు.1000/-లు) గాని, 3 సం॥ల చందా (రు. 700/-లు) గాని పంపి పత్రికను ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥ చందా రు. 240/-లు పంపించి ఏటా పునరుద్ధరించు కోవచ్చు. – ప్రచురణకర్త, అమ్మనుడి.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# మన మూలాలపై ఒక చర్చ : మనం ఎవరి వారసులం? ఎందుకు, ఎలా?

"మధ్యభారతదేశంలో నివసించే ఆదివాసీలు మాత్రమే భారతదేశ మూలవాసులని, వారే మొదటి నుండి ఇక్కడి నేలపై పుట్టి, తరతరాలుగా నివసిస్తున్నవారు. భారతీయులమని చెప్పుకునే మిగతా వారంతా ఏదో ఒక సమయంలో వేరే ప్రాంతం నుండి భారతదేశానికి వచ్చి స్థిరపడినవారే. అందువలన ఆ ఆదివాసీలే భారతదేశ నిజనివాసీలు." – నిహార్ రంజన్ రాయ్.

ఈ మాటలు మనలో చాలా మందికి మింగుడు పడక పోవచ్చు, కానీ ఈ మాటల్లోని నిజానిజాలను తెలుసుకోకుండా కేవలం భావావేశంతో స్పందించవద్దని పాఠకులకు మనవి. శాస్త్రసాంకేతికత ఎంతో పురోగతి చెందింది. నేడు అత్యాధునిక జన్యుశాస్త్ర సాంకేతికాలను ఉపయోగించి, జన్యుపరమైన విశ్లేషణ ద్వారా ప్రతి ఒక్క మనిషికి సంబంధించిన పూర్వీకులు ఎక్కడివారో కనిపెట్టవచ్చు.

శాస్త్రాధారాలు లేకుండా ఇంత పెద్ద మాటలు, అందునా కోట్లమంది భారతీయుల మనోభావాలను దెబ్బతీసే మాటలను అంత ధైర్యంగా నిహార్ రంజన్ చెప్పలేరు. చెప్పకూడదు కూడా.

ఎందుకంటే భారతదేశంలో నేడు ప్రతి చిన్న విషయాన్ని మనోభావాలతో ముడిపెట్టుకుని, జాతిగా, కులంగా, ప్రాంతంగా భావావేశాలకు లోనవడం సర్వసాధారణం అయిపోయింది. మనోభావాలు దెబ్బతిన్నాయని మాటల దాడితో ఆగిపోక హింసాత్మక సంఘటనలకూ భావావేశంతో ఉన్న ఆయా ప్రజలు వెనకాడటం లేదు. కానీ అవతల పక్కన ఉన్నది ఏ ప్రభుత్వమో, వేరే కులమో, సినిమా నిర్మాతలో కారు. అవతల పక్కన ఉన్నది పరిశోధనలతో కూడిన జన్యుపరమైన సమాచారం, దాని ఆధారంగా విజ్ఞానశాస్త్రం చెబుతున్న నిజం.

నిహార్ రంజన్ రాయ్ మాటలకు డెక్కన్ క్రానికల్ పత్రికలో మోహన్ గురుస్వామి రాసిన అభిప్రాయానికి అనువాదంగానూ, అనుసరణగానూ ఈ వ్యాసాన్ని నేను రాస్తున్నాను. గత కొన్ని ఏళ్ళగా భారతదేశంలో ఒక భావన గట్టిపడింది.

దేశస్థాయిలో ఈ మధ్య నెలకొన్న రాజకీయ పరిణామాల వలన మన భారతీయుల రాజకీయ-ధార్మిక ఆలోచనలో అంతకు ముందు లేని ధోరణులు గట్టిగా వినిపిస్తున్నాయి. మన దేశంలోని ప్రజలంతా ఇక్కడి మూలవాసులేనన్నీ, మన సామాజిక-ఆర్థిక అభివృద్ధి మొత్తం భారతీయతను ప్రతిబింబిస్తుందనీన్నూ.

బహుళంగా కొన్ని వర్గాలు ఈ ప్రచారాన్ని ముమ్మరంగా అందరిలోకీ తీసుకుపోతున్నాయి. అలానే నిన్న మొన్నటి వరకు ధార్మికంగా నమ్మిన అంశాలను చరిత్రతో ముడిపెట్టి మతపరమైన విషయాలను చారిత్రక విషయాలుగా నమ్మించి, చెలామణి చేసే ప్రయత్నాలు పలువిధాల జరుగుతున్నాయి. ఇప్పటిదాకా రామాయణాన్ని మన ఆధ్యాత్మిక చింతనను మెరుగుపరిచేందుకు ఉపయోగిస్తే, ఇక మీదట రామాయణాన్ని చరిత్రగా చదువుకొనాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇలాంటి ప్రయత్నాలు విజ్ఞానశాస్త్రం చెప్పే విషయాలకు దూరంగా మనల్ని నెట్టివేసి, మనకు తెలిసిన వైజ్ఞానిక నిజాలను అసత్యాలుగా చూపిస్తాయి.

సైన్సును వెక్కిరించే ఈ వాదాలు నిత్యం సైన్సు దిశగా ఆలోచించే మెదళ్ళలో సంఘర్షణ పొందుతాయి.

భారతదేశ భూభాగానికి నిజమైన వారసులు ఆదివాసీలు. ఇతరత్రా అందరూ, వారు ఆర్యులు కానీ, ద్రావిడులు కానీ, హిందువులైనా, ముస్లింలైనా, రాజులైనా, యానాదులైనా, అందరూ ఇక్కడకు వలస వచ్చినవాళ్ళే. యూరప్ నుండి వలసగా అమెరికాకు చేరి అమెరికన్లమని చెప్పుకుంటున్నవారిలానే, యూరప్ లో నివసించే యూదులంతా ఇజ్రాయెల్ చేరి ఇజ్రాయెలీయులం అని చెప్పుకుంటున్నట్టే, వారిని ప్రపంచమంతా ఆ విధంగా గుర్తించినట్టే భారతీయుల విషయంలో కూడా జరుగుతోంది.

ఆర్యుల కథంతా బ్రిటిషర్లు భారత సంస్కృతి మీద దాడి చేసేందుకు కనిపెట్టిన పన్నాగమని కొట్టివేసేవారు మనలో ఉన్నారు. అయితే, మనకు తెలీని కాలంలో మానవులంతా ఆఫ్రికాలోని ఒక ప్రదేశం నుండి ఆహారజాడ కోసం పలు దిశల్లోకి వెళ్ళి వారికి అనువుగా ఉన్న చోట్ల స్థిరపడ్డారని రాతియుగం నాటి చరిత్ర ద్వారా మనకు తెలుస్తోంది. ఈ విషయాన్ని శంకించే వారు దాదాపుగా లేరు. ఆ విధంగా ఆర్యులు, ద్రావిడులు, ఆహారం కోసం వెతుక్కుంటూ తూర్పు వైపుకు వచ్చారని కాసేపు అనుకుందాం.

ఇలా ఆలోచించటం కూడా కొందరికి అపచారంలా అనిపించవచ్చు. ఇలాంటి వాదనలు అతి - దేశభక్తులకు, హైందవమత సంప్రదాయవాదులకూ, నచ్చకపోవచ్చు, గంగాభట్ శివాజీకి వంశచరిత్రను సృష్టించిన విధంగా, విశ్వనాథ నాయకుడు కృష్ణదేవరాయల గురించి రాయించిన విధంగా, దేశ ప్రజలందరికీ కృత్రిమంగా వంశవృక్షాలు రాయబడుతున్నాయి.

వాటి ప్రకారం భారతదేశంలో నివాసముంటున్న మన భారతీయులందరమూ, భూమి పుట్టిననాటి నుండి భారతదేశంలో ఉన్న వారి సంతతియే.

మనమెవరమో ఏదో వంశచరిత్రలో చూడాల్సిన పని ఇవాళ మనకు లేదు. వివిధ ప్రాంతాల వారి మధ్య ఉన్న సంబంధాలను జన్యుశాస్త్రం నేడు ఆధారాలతో నిరూపిస్తోంది.

భారతదేశంలోనే జరిగిన పలు అధ్యయనాలు కూడా ఈ

విషయాన్నే చెబుతున్నాయి.

నిహార్ రంజన్ రాయ్ చెప్పినదే వాస్తవం. కేవలం మధ్య భారతంలో ఉండే కొన్ని ఆదివాసీ తెగలవారే మొదటి నుండి భారతదేశంలోనే నివసించినవారు.

అమెరికాలోని ఊటా విశ్వవిద్యాలయ జన్యుశాస్త్రజ్ఞుడు డా. మైకేల్ బంషాద్ జూన్ 2001లో వెలువడిన జీనోమ్ రీసెర్చ్ అనే పత్రిక సంచికలో భారతదేశ అగ్రకులాలవారి జన్యువులు ఐరోపా దేశాలవారి జన్యువులకు దగ్గరగా ఉన్నాయని, అలానే కింది కులాల వారి జన్యువులు ఇతర ఆసియా దేశాల ప్రజల జన్యువులను పోలి ఉన్నాయని వివరంగా తెలిపాడు. ఇదే విషయమై మరింత పరిశోధన జరిపి, డేవిడ్ రీక్, కె. తంగరాజ్, ఎన్. పాటర్సన్, ఏ.ఎల్. ప్రైస్ మరియు లాల్జీ సింగ్ – ఈ ఐదుగురు శాస్త్రజ్ఞులు సెప్టెంబర్ 2009 నాటి నేచర్ పత్రిక సంచికలో 'రికన్‌స్ట్రక్టింగ్ ఇండియన్ పాపులేషన్ హిస్టరీ' అనే వ్యాసంలో మైకేల్ బంషాద్ చెప్పిన విషయం నిజమని నిర్ధారించారు.

ఈ పరిశోధన 25 వివిధ సమూహాలను ఎంపిక చేసి ఆ సమూహాలలోని జనాభాపై జన్యుపరమైన పరీక్షలు చేసింది. భారతదేశంలో రెండు ప్రధాన జన్యువర్గాలుగా మొత్తం జనాభాను అనుకోవచ్చు. వారే ప్రాచీన ఉత్తర భారతీయులు మరియు ప్రాచీన దక్షిణ భారతీయులు. వారి మధ్యనున్న భేదాలను గుర్తించేందుకు జరిపిన కొన్ని పరీక్షలలో ప్రాచీన ఉత్తర భారతీయుల జన్యువులు ఐరోపా, మధ్య ఆసియా, తూర్పు మధ్య ఆసియా వాసుల జన్యువులకు పోలిక కలిగి ఉన్నాయని, చైనావాసుల జన్యువులకు ప్రాచీన ఉత్తర భారతీయుల జన్యువులకు ఉన్నంత వ్యత్యాసమే ప్రాచీన ఉత్తర భారతీయుల జన్యువులకు – ప్రాచీన దక్షిణ భారతీయుల జన్యువులకు ఉందని తేలింది. ప్రధానంగా సంస్కృత భాషా కుటుంబానికి చెందిన భాషలు మాట్లాడే జనాభాలో, అగ్ర వర్ణ ఉత్తర భారతీయుల్లో 39 నుండి 71 శాతం జనాభా పూర్వీకులు ప్రాచీన ఉత్తర భారతీయులు అయి ఉండవచ్చు.

ఆంధ్ర విశ్వవిద్యాలయ శాస్త్రజ్ఞులు (బి.బి. రావు, ఎం. నాయుడు, బి.వి.ఆర్. ప్రసాద్, ఇతరులు) చేసిన పరిశోధనలలో ఉత్తర భారతీయులకు, దక్షిణ భారతీయులకు మధ్య కనీసం జన్యుపరంగా చాలా భేదాలున్నాయని తెలిసింది. ప్రాచీన వర్ణవ్యవస్థకు, నేటి కులాల పరిస్థితులను పోల్చి చూస్తే దక్షిణ భారతంలో తక్కువ కులాలు అగ్రవర్ణాలుగా ఉండగా, ఉత్తర భారతంలో ప్రాచీన వర్ణవ్యవస్థ కొనసాగింపు కనిపిస్తోందని ఈ పరిశోధన వెల్లడించింది.

అయితే ఈ దక్షిణ–ఉత్తర వ్యత్యాసం కూడా ఎంతో పాతది కాదని, కొన్ని వందల సంవత్సరాల ముందు ఉత్తర–దక్షిణ భారతీయులు జన్యుపరంగా ఒకటి అయ్యేందుకు ఆస్కారాలున్నట్టు కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

ఉత్తర భారతదేశంలో మాట్లాడే హిందీ, గుజరాతీ, మరాఠీ, ఒడియా, బాంగ్లా మొదలగు భాషలు ఇండో–యూరోపియన్ భాషా కుటుంబానికి చెందినవని లోకవిదితం. ఇదే ఇండో–యూరోపియన్ భాషా కుటుంబంలో ఆంగ్లం, జెర్మన్, డచ్, రష్యన్ భాషా కుటుంబ శాఖలున్నాయన్నది తెలిసినదే. ఈ భాషలన్నీ ప్రాచీన గ్రీక్, లాటిన్, సంస్కృతాల నుండి అభివృద్ధి చెందాయని కూడా తెలుసు.

అలానే తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం మొదలగు దక్షిణ భారత భాషలన్నీ ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవనీ తెలుసు. ఇక ఇండో–యూరోపియన్ భాషా కుటుంబంలోని ఉత్తర భారతీయ భాషలకు, ద్రావిడ భాషా కుటుంబంలోని దక్షిణ భారత భాషలకు ఉన్న వ్యత్యాసం తెలిసిందే.

అయితే శాస్త్రజ్ఞులు ఒక మెట్టు వెనక్కు వేసి, 12, 000 ఏళ్ళ క్రితం ప్రోటో- ఇండో-యురోపియన్(ఇండో-యురోపియన్ భాషలకన్నా ముందున్న భాషా కుటుంబం) భాషా కుటుంబం ఉండేదని ప్రతిపాదించారు. అమెరికాలోని వేన్ స్టేట్ యూనివర్సిటీ ఆచార్యుడు డా. అలెక్సిస్ మనాస్టర్ రామర్ ప్రకారం ఫిన్నిష్, ఎస్టోనియన్, హంగేరియన్ భాషల ఉరాలిక్ భాషా కుటుంబానికీ, తుర్కిష్, మంగోలియన్ భాషల అల్టైక్ భాషా కుటుంబానికి ఇండో–యూరోపియన్ భాషా కుటుంబానికి మూలంగా నోస్ట్రాటిక్ భాష ఉందని ప్రతిపాదించాడు. ద్రావిడ భాషలతో సహా అన్ని భారతీయ భాషలు ఈ నోస్ట్రాటిక్ నుండి పుట్టి ఉండాలి. ఈ నోస్ట్రాటిక్ భాష లక్షా ఇరవై సంవత్సరాల పూర్వం మాట్లాడబడిందని, ఇది నేడు మాట్లాడే ఇండో–యురోపియన్, ద్రావిడ, ఉరాలిక్ భాషలకు మాతృక అని మాస్కోలోని భాషా శాస్త్రవేత్త డా. వితాలీ షవరొస్కిన్, హైఫా విశ్వవిద్యాలయం ఆచార్యుడు డా. ఆరొన్ దొగొపోల్స్కి ఇద్దరూ 1960 లోనే ప్రతిపాదించారు. నొస్ట్రాటిక్ అంటే అర్థం మన భాష అని. ఈ భాష అధ్యయనం మనిషి పరిణామక్రమాన్ని అధ్యయనం చేసేందుకు దోహదపడుతుంది.

భాషా శాస్త్రజ్ఞులకు భాష అనేది కేవలం మన భావాలను చెప్పి, ఇతరుల భావాలను వినే సాధనం మాత్రమే కాదు. అందుకు సైగలూ ఉన్నాయి. హవాయి విశ్వవిద్యాలయ ఆచార్యుడు డ. డెరెక్ బికర్‌టన్ ప్రకారం "భాష మూలసారం పదాలు, పదాల అమరిక. ఇవి మనిషి మెదడులోని కలివిడి వ్యవస్థ ద్వారా తయారవుతాయి."

ఫిన్‌లాండ్ కు చెందిన భాషావేత్త డ. అస్కో పోర్పొలా ప్రకారం సంస్కృతం కూడా ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదే. అందుకు సరిపడినంత ఆధారాలు కూడా ఆయన తయారుచేసాడు. ఇతర భాషావేత్తలు ద్రావిడ భాషలైన తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, తుళు భాషలకూ, ఫిన్నిష్, హంగేరియన్, ఎస్టోనియన్ భాషలకూ మధ్య ఉన్న సామ్యతలను గురించి లోకానికి పరిచయం చేసారు. ప్రస్తుత ద్రావిడ భాషలు సంస్కృతంలోని చాలా పదాలను తమలో ఇముడ్చుకున్నా, ద్రావిడ పదాలను సంస్కృతం అరువు తీసుకొని ఋగ్వేదంలో సైతం చేర్చుకుందని నిరూపించిన భాషావేత్తలూ ఉన్నారు.

ద్రావిడ భాషల్లోని ఎన్నో పదాలు సంస్కృతంతో పాటుగా ఐరోపా భాషల్లో కనిపిస్తాయి. అరిచి అనే పదం బియ్యాన్ని సూచించే ప్రాచీన ద్రావిడ పదం, ఇది లాటిన్ , గ్రీక్ భాషల్లో బియ్యం కోసం వాడే పదం ఒరైజా కు దగ్గర పదం. అలానే తమిళంలో అల్లాన్ని ఇంచివర్ అంటారు, జెర్మన్ లో ఇంజివర్, గ్రీక్‌లో జింజిబెరిస్ అల్లానికి

ఉన్న పేర్లు. ఇలాంటి విషయాలు చూస్తే ద్రావిడులు కూడా ఆరు వేల ఏళ్ళ క్రితం భూమధ్య సాగర ప్రాంతం నుండి సింధు నదీ తీరానికి వలస వచ్చి సింధులోయ నాగరికతను స్థాపించారని అనుకోవచ్చు.

పాకిస్తాన్ లోని బలూచ్ ప్రాంతంలో బ్రుహ్యీ ద్రావిడ భాషను మాట్లాడే వారి సంఖ్య ఐదు లక్షల పైమాటే. వీరి అస్తిత్వం వలన ద్రావిడులు మధ్య ఆసియా నుండి సింధు లోయ వైపుకు తూర్పుగా వచ్చి, అక్కడి నుండి భారతానికి దక్షిణంగా వచ్చి స్థిరపడ్డారని అనుకోవచ్చు. ఎరుపు చర్మం ఉన్న ఆర్యులకు, నలుపు చర్మం ఉన్న ద్రావిడులకు మధ్య జరిగిన సంఘర్షణ ద్రావిడులను దక్షిణానికి నెట్టేసి ఉండవచ్చు. ఇదే విషయాన్ని చూచాయగా మనం తెల్లవర్ణమున్న దేవుళ్ళు-నల్ల వర్ణమున్న అసురుల కథల్లో చూస్తాం.

సంతోష్ కుమార్ ఖరే హిందీ మూలాల గురించి "ట్రూత్ అబౌట్ లాంగ్వేజ్ ఇన్ ఇండియా" అనే వ్యాసంలో(ఎకనమిక్ అండ్ పొలిటికల్ రివ్యూ డిసెంబర్ 14, 2002 సంచికలో ప్రచురితం) చెబుతూ, "19వ శతాబ్దపు మొదటి యాభై ఏళ్ళలో ఫోర్ట్ విలియం కళాశాల వేదికగా హిందీ-ఉర్దూ రెండు వేరు వేరు భాషలనే భావన స్థిరపడింది. ఆ రెండు ఉపభాషల భాషాకోశాలు, సాహిత్య రచనలు ఈ సిద్ధాంతం ప్రకారం అప్పటికప్పుడు రూపు దాల్చుకున్నాయి. ఉర్దూ పారశీక, అరబ్బీ భాషల నుండి పదాలను, సాహిత్యాన్ని అరువు తెచ్చుకుంటే, హిందీ సంస్కృతం నుండి పదాలను, సాహిత్యాన్ని అన్వయించుకుంది." ఈ రెండు భాషల ప్రజలు రెండు పరస్పరం ఘర్షణ పడే సమూహాలుగా మిగిలాయి. అయితే ఆ వ్యాసంలో చివరగా ఇచ్చిన ఒక విషయం చాలా కటువుగా తగులుతుంది.

**ఆధునిక హిందీ భాష (లేదా ఖడీబోలీ యాస) ఈస్ట్ ఇండియా కంపెనీ వారు కృత్రిమంగా రూపొందించినది.** ఉర్దూ భాషా స్వభావాన్ని, వ్యాకరణాన్ని కలిగి పదాల విషయంలో ఉర్దూ-పారశీక-అరబ్బీ భాషల పాత మరియు మలిన పదాలను ప్రక్షాళన చేసుకొని సంస్కృత తత్సమాలను చేర్చుకుంది."

ప్రస్తుతం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వారు హిందీని తమ నెత్తికెత్తుకుని ఆంగ్లం మాట్లాడే భారతీయులను "మెకాలే సంతానం" అని దూషిస్తూ హేళన చేస్తున్నారు. హిందీ భారతీయులను ఏకీకృతం చేసే భాష అని, అది సహజంగా భారతీయులు మాట్లాడిన భాష అనీ వారు నమ్ముతూ, అందరినీ నమ్మిస్తున్నారు. కానీ పైన సంతోష్ కుమార్ ఖరే వ్యాసపు ఆఖరు వాక్యం వీరి భావనలను అపహాస్యము చేస్తోంది.

పై వ్యాసం సంగతి ఎలా ఉన్నా, భారతీయులు సంపూర్ణంగా నమ్ముతూ వచ్చిన సిద్ధాంతం ఒకటి ఉంది, అదే "అయం నిజః పరోవేతి గణనా లఘుచేతసాం? ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకం?" ఈ భూమంతా మన కుటుంబం అని నమ్మిన మన సంస్కృతి, ప్రాంత-మత-కుల విద్వేషాలకు లోనవకుండా ఉన్నన్నాళ్ళూ మనకు వేల ఏళ్ళ క్రితం జరిగిన చరిత్రలోని అంశాలు

మనలను భారతీయులు కానీయకుండా చేయలేవు.

# అచ్చతెలుఁగు పల్కుబడి

ఆదిభట్ల నారాయణ దాసుగారు మంజరిలో అచ్చ తెలుఁగును గుఱించి యొక చిన్నపొత్తము వ్రాసిరి, అందులోఁ దనభావములెల్ల వెల్లడిం పఁబడినవి. రెండు రెండు పాదాలకంత్యప్రాసము నలంకారమును బెట్టిరి.

***తీయన మెత్తన తేఁటతెల్లంబు/ నుడులలో నచ్చ తెనుంగు నయంబు.*** సంస్కృతాంధ్ర శబ్దములలో నాంధ్రశబ్దము తీయనిది మృదువైనది అనిరి.

***అచ్చతెలుఁగువార లచ్చ తెనుంగు / తెలియనియెడ వారి తెల్వి దొసంగు.*** తెలుఁగువాడఁడైపుట్టి తెలుఁగును దెలియక పోవుటేమిటి?

***తేఁట తీయని యచ్చ తెలుఁగు రాకున్న / తెలుఁగువారి కిఁ కెద్ది తెలియుట సున్న.*** తేట తెలుఁగునే తెలిసికోలేనివాఁడు మఱి దేనిం దెలిసికో లేఁడు. ***'వేల్పుబాసాడిన వెలయునా? మెప్పు'***

***'వేల్పులకే చెల్లు వేలుపు పల్కు./మానిసికిన్దగు మానిసికుల్కు'*** సంస్కృతము దేవభాష, తెలుఁగు మనుష్యభాష.

***'దయ్యపు పలవింత తగదు మానిసికి'***
***'మనుగడకు న్నాటు మాటలే చాలు'***
***'బ్రతికున్న తల్లి యిప్పటి నాటబాస'***
***'ఎల్లపల్కులఁ దెలుఁగే మేలుబంతి / ప్రజలలో నన్దెల్గువాఁ డే వలంతి / తెన్గునాడే నలుదెసల నాడెమ్ము'***

అన్ని భాషలలోఁ దెలుఁగే శ్రేష్ఠము. అందఱిలో తెలుఁగువాఁడే మేటి. అన్ని దేశములలో తెలుఁగు దేశమే యుత్తమము, సంగీ తము భరత నాట్యము తెనుఁగువారి సొమ్ము అని ఆంధ్రాభిమానము చూపిరి.

***'తేటతీయని యచ్చ తెనుఁగనువాఁడు / వాసికెక్కిన చెదువరి మొనగాఁడు./ అని గ్రంథాంతమున మంగళము పాడిరి'***

మీసము మెలిపెట్టి, తిప్పలుపైకెత్తి, తొమ్ము విఱిచి గుండెనందు చెయిపెట్టుకొనియే తోడొక్కఁటలేని తల్లి బాసగల తెలుఁగు బిడ్డను నేనని అంకె వేయగల మొనగాఁడజ్జాడాదిభట్ల నారాయణదాసు.

దాసుగారీ తొమ్మిది గ్రంథములనేగాదు పదియవదానిని "ఉమర్‌ఖయా" మను గ్రంథమునుగూడ నాటు తెనుఁగు పద్దెముల లోను సంస్కృత శ్లోకములలోను వ్రాసిరి, దానినిందే మఱొకచో చూడఁగలరు. ఇప్పటికే నావని పెరిగినదిగదా! పెద్దలనూట మీఱ లేకనేగాదు నేనిది వ్రాయుట. చూడుఁడు. సంగీతము త్యాగరాజు స్వాములందు, నాట్యము నాగరాజు సుబ్బారావుగారియందు, వ్యాక రణము రాయుడు శాస్త్రులవారియందు, వేదాంతము బెల్లముకొండ రామదాసు మిత్రులందు, ఆశుకవిత్వము కొప్పరపు సోదర కవులయందు, అచ్చ తెనుఁగు కూచిమంచి తిమ్మకవియందు, పాండి త్యము వేదము వేంకట రాయశాస్త్రులవారియందు ముఖ్యముగా నున్నవి. మఱి యవియన్నియు నొక్క నారాయణదాసుగారియందే కలవే! వారెంత పుణ్యపురుషులన వలయు! అట్టి పుణ్య పురుష సంస్మరణ భాగ్యము లభించుచుండ దానిం బోఁగొట్టుకొనవచ్చునా? అందువలన డెబ్బదియేడవపడి పై బడినను ఈ పనికి సాహసించితి, ఎందువలన?

***మొలక లేఁతదనము, తలిరుల నవకము/ మొగ్గ సోగతనము, పూవు తావి / తేనె తీయఁదనము తెనుఁగునకేగాని/ మోటు లాఁతి నాటు మాటకేది?***

*("శ్రీ ఆదిభట్ల నారాయణదాస- సారస్వత నీరాజనము : దాసుగారి తెనుఁగు వహుల తీరులు"నుండి...)*

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
9441427977

# తెలుగునాట గిరిజనుల స్థానం-ప్రస్థానం



కొండరెడ్ల ఆటపాటలు

ఈ కనుమలతో తెలుగుజాతి చిరంతనమైన అనుబంధంలో వివిధ పార్శ్వాలను, దక్షిణాన చెంచులక్ష్మి, ఎరుకలసాని, హాథీరామ్ బావా, సేవాలాల్, భక్త కన్నప్ప ఉత్తరాన గోదావరి లోయల్లో గంగా లమ్మ, పోకల దమ్మక్క / శబరి, విశాఖ మన్యం పాడేరు బయ ళ్ళలో మోదకొండమ్మ, మత్స్య కంబేరమ్మ, శ్రీముఖలింగం, పూరి క్షేత్రాల స్థలపురాణాలు వారి ప్రస్థానంలో గతి శీలాన్ని చాటి చెపు తాయి.

*'ఆటా మనదే, పాటా మనదే అన్నీ విద్యలు గల్లవారమ*
*వేట మనదే, వెట్టి మనదే వేయి విద్యలు గల్లవారము*
*కొలువు మనదే, కొలత మనదే కోటివిద్యలు గల్లవారము*
*ఆడవాలె పాడవలె, వేడుకలు చేయవాలె*
*జంగం కాము, జోగుకాము జోటాలుండే బాలలము*
*వీల్లం కాము విద్దెలం కాము వేడుకల బాలలము*
*అమ్మవారు ఉన్నప్పుడు ఆడే పాడే బాలలము*
*మనసుకు మంచివారము మాపటికి దొంగవారము'*

*అచ్చుకోడ లయ్యోకోడ, లాలచ్చిరి బాల కోడలా*

అడవులు లోయలు, బయళ్ళు. కులపర్వతాలు. తూర్పు కనుమలు నల్లమల అడవులు, గోదావరి లోయలు, ఉత్తరాంధ్రంలో బయళ్ళుగా తూర్పుకనుమల ప్రకృతిలో వైవిధ్యాన్ని మనం పిలుచుకుంటాం. ఈ కనుమలలో ఉన్నత శిఖరం మహేంద్ర గిరి కుల పర్వతాలలో ఒకటి. ఈ కనుమలన్నిటిని మరో కులపర్వత శ్రేణి మలయపర్వతాలుగా కొంధమల్, మాల్యవంతం, నల్లమల, తిరుమల, అన్నామలలుగా ఆయా ప్రాంతాలలో పేర్కొంటారు.

దండకారణ్యంలో రంప-జాడి-దంతెవాడ-మన్నెకొట్టాలు

వీటిలో మల/మాల్యవంతం అంటే తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో పాపికొండలనుండి ఏలేశ్వరంలో నాగుల కొండదాకా, విశాఖ జిల్లా సరిహద్దులోగల సీలేరు/డొంకరాయి అంటే జాడిదేశం, అనగా ఝూడ్/ చెట్లదేశందాకా విస్తరించిన లోయల్లోగల రంపరాజ్యంలోని, కొండరెడ్డి తెగవారు మువ్వలదుద్దు వేస్తూ కదంతొక్కుతూ, పండుగ, పెళ్లి బసలలో స్వతంత్రమైన తమ జీవన విధానాన్ని వివరిస్తూ,తమను లోకువగా చూసే దిగువవారి బతుకులను ఎండగడుతూ పాడుకునే యువగీతం ఇది.

'దండకారణ్యా మధ్య పుళింద రంభాహి వంశజులకు అభయ మొసగి'నారని భీమేశ్వర పురాణంలో రాజమహేంద్రవరం రెడ్డి రాజులను శ్రీనాధుడు ప్రస్తుతిస్తూ, వారు 'ఝూదేశ వన, సప్త మాడె. బారహ, దొంతివంతు నాది క్షితీశ్వరులను గెలిచి'నారని పేర్కొంటారు. సప్తమాడేములు 'మాడ్గుల ఆదిగా గల మన్నెకొట్టములు' దొంతి నేటి ఛత్తీస్ఘర్‌లో దంతెవాడ. 'మాడుగుల గెల్చె-వడ్డాది మసి యొనర్చె' నని అల్లసాని పెద్దన కృష్ణదేవరాయల కళింగ దండ యాత్రలో వర్ణిస్తాడు.

## తూర్పు కనుమలు స్థల పురాణాలు

ఈ కనుమలతో తెలుగుజాతి చిరంతనమైన అనుబంధంలో వివిధ పార్శ్వాలను, దక్షిణాన చెంచులక్ష్మి, ఎరుకలసాని, హాథీరామ్ బావా, సేవాలాల్, భక్త కన్నప్ప ఉత్తరాన గోదావరి లోయల్లో గంగాలమ్మ, పోకల దమ్మక్క / శబరి, విశాఖ మన్యం పాడేరు బయళ్ళలో మోదకొండమ్మ, మత్స్య కంబేరమ్మ, శ్రీముఖలింగం, పూరి క్షేత్రాల స్థలపురాణాలు వారి ప్రస్థానంలో గతి శీలాన్ని చాటి చెపుతాయి. ఆచార్య బిరుదురాజు రామరాజు పేర్కొన్నట్లు 'వీరందరి వారసులం మనం'.

## గణ రాజ్యాలు - రాజ్యాలు

కుల పర్వతాలు పేర్కొన్న తూర్పు, పశ్చిమ తీరం మధ్యనున్న కనుమలు, వింధ్య, సహ్యాద్రి పర్వత శ్రేణులు, హిమాలయాలు, ఈశాన్య, వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో వస్తుమార్పిడి, సంప్రదాయ సరిహద్దులు, ఉమ్మడి కట్లుబాట్లు, వాటిని అమలు చేసే సదురు, గొట్టుబస, నసాబు మొదలైన గ్రామసభల సమాఖ్యలు, ఆటపాటలతో నిండిన గణరాజ్యాలు ఈ కొండప్రాంతాలవికాగా, కోశం, దండం, కవి గాయక వైతాళిక పురోహిత వర్గాలు, శాసనాలతో దిగువ ప్రాంతాల్లో రాజ్యాలు పరిపాలిస్తుంటాయి. వ్యాపారవర్గం, సైనిక బలంతో, రాజ్యాలు, గణ రాజ్యాలలోకి చొచ్చుకు పోయినప్పుడల్లా, ఆ జన్మ ధనుర్ధరులైన గిరిజనులు వారిమీద తిరుగుబాటు చేస్తున్నారు.

మహేంద్రగిరిలో శివాలయాలను పాండవులు నిర్మించారట. విశాఖ జిల్లాలో వద్దాది రాజధానిగా మత్స్యరాజులు పాలించారు. మత్స్యదేశంలో తలదాచుకున్న పాండవులుగా తమను భావిస్తూ

*'విరాటరాజు దేశం విటిం పండుగలు -*
*కాశివారిదేశం గంగ పండుగలు,*
*కొండవారిదేశం కొలువు పండుగలు'*

అంటూ నంది కొలువు పండుగలలో భారత గాథను తమకు అనువుగా మార్చుకుని పాడుకుంటారు. పిట్టగడ్డ జాలంపల్లి పట్టపు కోలన్న' అని గ్రామనౌకరు వర్గానికి చెందిన కోలన్న అంటే కర్ణుడిని ఆహ్వానిస్తారు. కర్ణుడు పాండవుల వ్యవసాయాభివృద్ధికి తోడ్పడతాడు.

ఈ పాటలో 'కొండవారిపంట- దిగువవారి వంట పంచ పాండవుల పంట - దుర్యోధనుడి వంట' 'కోదోడి పంట - కోమటోడి సంచి' అంటూ దోపిడీని నిరసిస్తున్నారు.

*'ఓ...ఎద్దుమీదర సజ్జు గట్టి ఎంతోదవ్వుర బేరగాడు*
*దవ్వు కాదోయ్ దారకొండ దారకొండర బేరగాడు*
*తూరుపుకుంచముతో తూరగొలచినబేరగాడు*
*పడమర కుంచముతొ పారగొలిచిన బేరగాడు*
*చిగురుల చింతలలోన చిత్తులాటలో పొద్దుపోయె*
*పొద్దు పొతే పోయిది గాని పొద్దు వెంటర ఎద్దుపోయె*
*ఎద్దు పొతే పోయిది గాని ఎద్దు వెంటర సజ్జు పోయె*
*సజ్జు పొతే పోయిది గాని సజ్జు వెంట డబ్బుపోయె*
*డబ్బు పొతే పోయింది గాని డబ్బు వెంట ఇల్లు పోయె*
*ఇల్లు పొతే పోయిది కాని ఇల్లు వెంట ఇల్లాలు పోయె'*

పండించకుండా, వేటాడకుండా, పెంచకుండా రూపాయలతో కొనుక్కునే రాజ్యంలో మార్కెట్ వ్యవస్థను 'దుకాణం మీద బియ్యం - దుక్కమీద ముక్క'గా దుయ్యబడుతున్నారు.

రాజ రాజము - రంప రాజము
రాజు వచ్చి చేయి వేయ
రాజమంతా తొనుకు తొణికే

ఈ విధంగా, సోకులతో, బంగారంతో నాణేలతో అధికారంతో రాజు చేయి వేసే సరికి తొణికి వెలితి పడసాగింది. రకాల వికారాలు ప్రవేశించాయి.

*'నయ్యకేసి రంగులవాడు,రంగు పూసల బేరగాడు'.*
*'గుమస్తా వాడితో గుద్దుకున్న లంజ',*
*'గూడెము సంతకు వెళ్లి గుట్టు చక్కగాడుక రావో'.*

తూర్పు గోదావరి గిరిజనుల సంప్రదాయం ప్రకారం, రాజు బలవంతం చేస్తే గంగాలమ్మ ప్రాణత్యాగం చేసుకుంటుంది. అయితే విశాఖ మన్యంలో పెద్దలే రాజు ప్రేమించిన గంగతో పెళ్లి చేస్తారు.

ఈ విధంగా గణరాజ్యాలతో ఇచ్చిపుచ్చుకుని సంధి చేసుకుంటూ సంబంధాలు పెంచుకుంటున్న వైనాన్ని చెంచులక్ష్మి, మోదకొండమ్మ, సమ్మక్క సారక్క ఐతిహ్యాలు తెలియచేస్తాయి' తెలుగు రాష్ట్రాల మధ్యలోగల నల్లమలఅడవులలోలో ఓడిపోయిన రాజులు తల దాచుకునేవారు. వారిని వెంటాడే క్రమంలో ఈ అడవులమీద పట్టు సాధించటానికి నాగార్జున కొండ కేంద్రంగా బౌద్ధం, శ్రీశైలానికి దారులు తెరచి శైవం, 'చెంచుల అహోబల శ్రీ నారసింహుము' అని కీర్తిస్తూ వైష్ణవం పోటీ పడ్డాయి.

'ఇటు పక్క లక్ష్మమ్మ, అటు పక్క చెంచురాలు - ఇద్దరికీ నట్టనడుమ దేవుడు పెన్నోబలేశు' అని జాతుల సహజీవనాన్ని మెచ్చుకుంటూ, 'అందమైన ఆడపడుచులు చెంచు వారి కెందుకు - పొంచి పొంచి ఓబులేశుడు ఎత్తుకు పోయేటందుకా' అంటూ లైంగిక దోపిడీని గిరిజనులు, జానపదులు ఎత్తిపొడుస్తారు.

విశాఖ మన్యంలో కొండదిగువన ఉన్న వద్దాది వారు - కొండ రాజ్యం జైపూర్ నందపురం వారు బంధుత్వం కలుపుకున్నారు. విభిన్నమైన విలువలు పాటించే ఎగువ - దిగువ వివాహ సంబంధాలలో అపశ్రుతులను, దిగువ ధోరణిలో అంటరానితనం పాటిస్తున్న కొండ జాతులలో వివక్షవల్ల జరుగుతున్న నష్టాన్ని, వివరించి వారి మధ్య ఇచ్చి పుచ్చుకోడానికి అనాది పునాది, వివాహ సంబధాన్ని ఆదర్శంగా నిలుపుతూ, మోదకొండమ్మ పదంలో

*'శరణు శరణు దుర్గాలమ్మలు మీచరణాలు తప్పలేను*
*మీ చరణాలు తప్పినగాని మీ కరుణలు తప్పలేము*

**భాష నశిస్తే జాతి నశిస్తుంది. వాడని భాష వాడిపోతుంది**

*మీలాటి కాలము లాగా మిమ్ము తలచి పాడుతాము'*

దిగువ రాకుమారితలు మోదమ్మలను దుర్గలుగా పేర్కొంటూ, వారి కుమారుడు సంజీవరాజు 'మన్నెఇంటి రాజైనా మాల యింటి పడుచు గంగను' పెండ్లి చేసుకున్న తీరును పాడుకొంటారు.

మోదకొండమ్మ, సమ్మక్క సారక్క పండుగలను ప్రభుత్వ గిరిజనోత్సవాలుగా ఇరు తెలుగు రాష్ట్రాలు జరుపుతున్నాయి.

**అభివృద్ధిలో పోటీపడిన దొరలు-రాజులు**

రాయల కళింగ దండయాత్రలో ఓడిపోయిన తూర్పుతీరంలో గజపతుల సామంతులైన కొందరు రాజులు , నందపురం కొలువులో చేరారు.

కొండదిగువన ముఖాసాలు పొందారు. నందపురం వారసత్వ కలహాల్లో ఒక వర్గాన్ని సమర్థించారు.అందుకు బదులుగా నందపురం దాని బంధు సామంత రాజ్యాలను తమ సామంతులుగా ప్రకటించుకున్నారు. కొండదొరలందరూ రాజులమీద తిరుగుబాటు చేసారు. బ్రిటిష్ ప్రభుత్వం వారందరిని స్వతంత్ర సంస్థానాలుగా గుర్తించారు.

విజయనగరాన్ని విద్యలనగరంగా రాజులు అభివృద్ధిచేస్తే, విశాఖపట్టణాన్ని తూర్పుకనుమలను పాలించిన కొండదొరలు అభివృద్ధి చేసారు.తూర్పుకనుమలలో ప్రాచీనరాజధాని నందపురం/ జైపూర్ రాజా విక్రమదేవ వర్మ ఆంధ్రవిశ్వవిద్యాలయం కులపతి. హవామహల్, దసపల్లా, విశాఖ తాజ్ మహల్ ,కురుపాం మార్కెట్, రాణి చంద్రమతి దేవి ఆసుపత్రి ఇవన్నీ గిరిజనుల వితరణకు తార్కాణాలు. 17వ శతాబ్దంలోనే నందపురం నుండి జైపూర్ కు రాజధాని మారింది.

అయినా ఇప్పటికీ గిరిజనులు

*'అందమైన నందపురము నంది ఆటలు అడివద్దాం-*
*తియ్య గుమ్మడి తీసి వద్దాం, మళ్ళు గుమ్మడి మరలి వద్దాం'*

అని పాడుతుంటారు. హంపీ విజయనగరాన్ని చరిత్రకారులు forgoten kingdom గా, ఈ వదిలేసిన నందపురాన్ని forsaken kingdom గా వర్ణించారు.

**గిరిజనుల భాషా సాహిత్యాలు**

తమిళంనుంచి తుళు దాకా గలవి దక్షిణ ద్రావిడ భాషలుకాగా, తెలుగునుంచి కువి దాకా ఉన్నవి మధ్య ద్రావిడ భాషలు. (ద్రావిడ భాషలు. పి.యస్.సుబ్రహ్మణ్యం. తెలుగు విశ్వవిద్యాలయం 1997) మధ్య ద్రావిడ భాషల్లో ఉత్తరాది కనుమలలో కొండరెడ్లు, బగతలు, వాల్మీకులు, కొండదొరలు, నాయక పోడు వగైరాలు, దక్షిణాదిన ఉన్న చెంచులు యానాదులు, మొదలైన తెగలది తెలుగు గిరిజన భాషా మాండలికం.

వివిధ ప్రాంతాలు, తెగలు, జాతులు, వారిజ్ఞానం తరతరాలకు అందించుకునే భాషలు,నుడికారపు తీరులు ఒక క్రమ పద్ధతిలో సేకరించి, పాఠాలుగా పెట్టడం, వాటిని ఉన్నత విద్య పరిభాషతో జోడించడానికి ప్రత్యేకంగా కృషి చేయాలి.పాలకుల పాలనపద్ధతులు, లెక్కలు, కొలతలు తెలియని పాలితులు మోసపోతారు.

ఈ అవసరాన్ని గుర్తించడమే కాదు, 1890 లోనే ఆ పనికి పూనుకున్న బడి పంతులు గిడుగు రామమూర్తి పంతులు. సవరల జంతువిజ్ఞానం తెలియజేసే కథలు, వారికి తెలిసిన నాటి తిరుగుబాటు చరిత్ర, వారి కట్టుబాట్ల ప్రకారం నేరము- శిక్ష న్యాయస్థానాల్లో వారు పడే తబ్బిబ్బులు - వీటితో అయన పుస్తకాలు తయారు చేశారు (సవర కథలు. ఎమెస్కో). ఒక సంస్కృతిని అర్థం చేసుకునే పద్ధతికి, పునాది వేశారు. కానీ ఆ దారిలో బుద్ధిజీవులు ముందుకు పోలేకయారు.

**గుర్తింపుకు నోచుకోని తెలుగు గిరిజన మాండలికం**

కొత్త భాషలను కనుక్కోవాలనే ధ్యాసలో పడిన మన భాషాశాస్త్రవేత్తలు, ఈ కనుమలలో ఇరుగు పొరుగు రాష్ట్రాలలో గల ద్రావిడ భాషలు గోండి, మండ, పెంగో, కూయి, కొలామి, నాయకీ మొదలైన భాషలను అధ్యయనం చేసారు కానీ గిరిజన భాషా మాండలికాన్ని పట్టించుకోలేదు. వారి గురువు ఎమనోవ్ తోడా తెగవారి పాటలు పోగుచేసాడు కాని, వీరు భాషను తప్ప సాహిత్యాన్ని సేకరించలేదు.

వృత్తిపదకోశాల తయారీలో కూడా తూర్పుకనుమలలో గల తెలుగు మాండలికాన్ని పట్టించుకోలేదు.

పరిశోధక విద్యార్థిగా నన్ను స్వీకరించి ఈ తెలుగు తెగల సాహిత్య సేకరణ విశ్లేషణకు 1976లో నాందిపలికినవారు రామరాజు గారు ('తెలుగు గిరిజన గీతాలు' 1991. పరివర్ధిత ముద్రణ 'కొండ కోనలలో తెలుగు గిరిజనులు' 2007, శక్తి ప్రచురణ). దీని సంక్షిప్త రూపం 'గిరిజనుల కళలు,సాహిత్యం' లో(అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయం తెలుగు జానపద విజ్ఞానం) స్థల పురాణాలలో గతిశీలతలో వివిధ దశలను విశ్లేషించింది(2010). తెలుగు విశ్వవిద్యాలయం జానపద విజ్ఞానశాఖలో ఈ కృషిని వ్యాప్తి చేసినవారు ఆచార్య భక్త వత్సలరెడ్డి( కొర్రరాజుల కథలు పద్మనాయకుల వృత్తాంతం, కొండరెడ్డి గిరిజనుల పాటలు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు). గిరిజన మాలికలో ద్రవిడవిశ్వవిద్యాలయం తెగల వారీగా మొదలుపెట్టిన ప్రచురణలలో చెంచు, బంజారా, తెలుగు కదా సాహిత్యం గిరిజన జీవితం వచ్చాయి. గోండ్ కోలమిల సంప్రదాయ సాహిత్యాన్ని పాశ్చాత్య మానవ శాస్త్రజ్ఞులు హైమెండర్ఫ్, మైఖేల్ యార్క్ లు రికార్డ్ చేశారు. ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రంలో, సుమనస్పతి, అక్కడి తెగల సాహిత్యాన్ని గూర్చి రాస్తూ, రికార్డు చేస్తున్నారు. బంజారాల సాహిత్య సేకరణలో జనపాల శంకరయ్య (తెలుగు లంబాడీల గేయ సాహిత్యం 2001. జనపాల వారి ప్రచురణలు) కృషి చెప్పుకోదగినది. సూర్య ధనుంజయ్, గోనానాయక్ విశేషంగా కృషిచేసారు.

నేను స్థాపించిన శక్తి స్వచ్ఛంద సంస్థ గిరిజనుల సాధికారితకు తోడ్పడుతూ, చెంచు, కొండరెడ్డి యువకులను ప్రోత్సహించి,వారు సేకరించిన సంప్రదాయ సాహిత్యం ప్రచురిస్తున్నది(నల్లమలలో చెంచు ప్రపంచం,) అమ్మనుడి పత్రికలో 'గోదావరి లోయలో కొండరెడ్ల బతుకు కథలు' ధారావాహికంగా (2015) వచ్చాయి.

1,2,3 తరగతుల వాచకాలను తెలుగేతర తెగలభాషలలోకి మాతృభాషలో విద్యాబోధనకోసం ప్రభుత్వం అనువదింప చేసింది. ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ (ట్రైబల్ కల్చరల్ మిషన్ విశాఖ పట్నం) రాయించిన విశాఖ గిరిజన సంస్కృతి సాహిత్యాలు, కొండ

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాజా విక్రమదేవ వర్మ విగ్రహం




రెడ్ల సంస్కృతి సాహిత్యాలు,ప్రధానోపాధ్యాయులకు కరదీపిక – గిరిజన సంస్కృతి(2018), అచ్చులోకి రావాలి, ఈ శాఖలో ఎందరో రచయితలున్నారు కానీ వారిలో గిరిజనవారసత్వాన్ని, సాహిత్యాన్ని గూర్చిన ఆసక్తి, అవగాహన కనిపించదు.

**చట్టాలు, లెక్కలు చెప్పని చదువులు**

గిరిజనులది మౌఖిక సంప్రదాయం.తెల్లవారు ప్రవేశపెట్టిన రాతకోతలు – మ్యాప్ లు, రికార్డులు, లెక్కలు గిరిజనులకు అంతు బట్టలేదు. వారు ప్రవేశ పెట్టిన సార్వత్రిక విద్య నేటికీ వీటిని బోధించదు. తమపాలనపై గంజాం, గుణుపూరు, గూడెం, రంపలలో గిరిజనులు చేసిన తిరుగుబాట్లను అణిచివేసారు. ఈ తిరుగుబాటులకు స్పందిస్తూ ఒక నాడు గణరాజ్యాలున్నప్రాంతాలను ఆనుసూచిత ప్రాంతాలుగా ప్రకటించి ప్రభుత్వం చట్టాలు చేస్తున్నా, అమలు చేసే అధికారులు, చొచ్చుకువస్తున్న దిగువవారితో కుమ్మక్కై సహజవనరులు వారికి కట్టబెట్టసాగారు. ఆ ప్రాంతాలలో 'తృణ కాష్ఠ జలసమృద్ధి' సంప్రదాయ విధానంకాగా కింది ప్రాంతాలకు అనువైన వ్యవసాయ ప్రధానమైన అభివృద్ధి పథకాలను గిరిజనులనెత్తిన రుద్దారు. కాలనీల లోకి నెట్టారు. ఇలా అందరూ కలసి గిరిజనులను దోచుకోసాగారు. సాయుధపోరాటం కొనసాగించటం వారికి తప్పని సరి అయింది. దిగువ ప్రాంతాల వారు కొందరు విముక్తి పోరాటాలు చేసారు.అమర వీరులైనారు.

**ప్రశ్నించటం నేర్పని చదువులు, శిష్టసాహిత్యం**

ఈ కాలం కథలు అభివృద్ధివల్ల దళితులు ఉన్న అరకొర భూములు కోల్పోవటం భీభత్సంగా చిత్రించాయి.. ఉదాహరణకు కారా మాస్టారి యజ్ఞం కథలో(యజ్ఞంతో తొమ్మిది కదల సంపుటి) ఊరికి బడి , రోడ్డు, కరంటు, తెచ్చిన సర్పంచ్ హరిజనుడు అప్పల రాముడి కొడుకును బడిలో ఎందుకు చేర్చలేదు? ఆ బడిలో దళితుల రుణవిముక్తి చట్టాలు భూమిలెక్కలు ఎందుకు చెప్పలేదు?? అని రచయిత, విమర్శకులు ప్రశ్నించి ఉంటే శ్రీకాకుళం పోరాటం మరో విధంగా ఉండేది. (తమిళనాడులో ఈ భూములను 'పంచమీ' భూములు అంటారు). అదే ధోరణిలో సాహిత్యం నడుస్తున్నది. చదువులోలేనిది మనకు తట్టదు. అందరికీ తట్టాలంటే సాంఘిక శాస్త్రాలు వీటి అవసరాన్ని చాటుతుండాలి. ఆలోచనలు గాలిలోంచి రావు. కుమ్మరావంలో ఇత్తడి ముంతలు దొరకవు. అందుకే కాబోలు ఇటువంటి 'రచనలవల్ల రచయితకు పేరు రావచ్చు కాని సమాజంలో మార్పు రాదు' అని కొడవటిగంటి కుటుంబరావు వ్యాఖ్యానిస్తారు. (కొడవటిగంటి కుటుంబరావు శతజయంతి ప్రత్యేక సంచిక.ప్రజా సాహితి నవంబరు 2009.పుట 96)

రచనలే ఉద్యమంగా భ్రమపెడుతున్న ఈ ధోరణిని 'కథయే పరమార్థంగా, వాహికగా గాక లక్ష్యంగా ,సాహిత్య ప్రక్రియగా గాక ఉద్యమంగా ప్రచారం చేసి,, ఆ ప్రచారమొక సత్యంగా నమ్మే ప్రమాద సూచిక దగ్గరికి ప్రచారకులు చేరిపోయారు' అని వరవరరావు చురక వేస్తారు. (భూమితో మాట్లాడు. వరవరరావు. యుగ ప్రచురణలు 2005).

**లిఖిత, ఉద్యమ సాహిత్యం ప్రభావం.**

**సంప్రదాయ సృజనకు సాహిత్యానికి మంగళం.**

'చుక్కలు తేలివో, చూసేవారు లేరు
వెన్నెల తేలిదో, ఆడేవారు లేరు
చుక్కల సురిటిపల్లి చూడగల్ల బయలు
వెన్నెల వెదురుపల్లి ఆడగల్ల బయలు'

'పాలకవర్గాలు జానపద సాహిత్యాన్ని ముద్దుపేరో, మొరటు పేరోపెట్టి నిరసిస్తున్నారు'. (సాహిత్యంలో వస్తు శిల్పాలు. త్రిపురనేని మధుసూదనరావు. పుట 109. పెర్‌స్పెక్టివ్స్ ప్రచురణ) ఇటువంటి తరుణంలో గిరిజనులను చైతన్యపరచటానికి వారు(ఉద్యమకారులు, రచయితలు) సృష్టించిన సాహిత్యం ప్రభావాన్ని తన అధ్యయనం 'శ్రీకాకుళోద్యమసాహిత్యం'లో(దృష్టి ప్రచురణ 1993) కె.ముత్యం ఇలా వివరిస్తారు.."ఈ ఉద్యమ కార్యకర్తలు, గిరిజనుల సాంస్కృతిక జీవితం గురించి తెలుసుకోకపోవడంతో, వారిని కదిలించగల మౌఖిక సాహితీప్రక్రియలగూర్చి తెలియకుండా పోయింది.గిరిజనులు ఆశువుగా పాడుకునే పాటల స్థానంలో, కవుల లిఖితశైలి,వారికి పరిచయం లేని బాణీలు, వారిది కాని భాష ఉద్యమవస్తువుతో పాటలు రాయడానికి గిరిజన రైతాంగాన్ని పురికొల్పలేదు.కార్యకర్తలు పాటలను సవరభాషలోకి అనువదించినా, వాటి లిఖితశైలి, భిన్న అభివ్యక్తి నిర్మాణాల వల్ల వాటిని తమ అనుభవాలుగా కవితా బద్ధం చేయడానికి గిరిజనులు పూనుకోలేదు.

కార్యకర్తల ప్రచారలక్ష్యం నెరవేరినా, ప్రజలు తమ అనుభవా లను కవితబద్ధం చేయటానికి,వారు కార్యకర్తలు వినిపించినపాటలను ఆదర్శం గా భావించడంతో, ఆ స్థాయిలో రాసినవే పాటలనీ,తాము ఆ స్థాయిలో రాయలేమని భావించడంతో కూడా వారు తమ అనుభ వానికి రూపాన్నివ్వలేకపోయారు. ఈ పాటలు వారి స్వేచ్ఛా వ్యక్తీకర



వెన్నెలకంటి రాఘవయ్యగారు.

ణకు ఆటంకాలయినాయి' ఇటువంటి వాతావరణంలో ఎదిగిన గిరిజన రచయితలు, తమ ప్రతిభలు, సమిష్టి సాహిత్యం మరచిపోయి సాహిత్యగాళ్ళమీద, వారి కళా బృందాలమీద, సంఘాలమీద, పత్రికల మీద ఆధార పడుతూ అనుకరిస్తూ, పేరుకోసం తాపత్రయ పడసాగారు. ప్రభుత్వాలు వారి వనరులను ఇతరులకు కట్టబెడితే ,ఉద్యమాలు వారి సమష్టి సాహిత్యాన్నికనుమరుగు చేసాయి.

బస్తర్ అడవుల్లో తిరిగిన రచయిత సత్యం 'జంగల్ నామా'లో ఆదివాసీ సంప్రదాయ వీరగాధలను సేకరించ వలసినదిగా కోరతాడు. ముందు మాటలో జానపద బాణిలో గెరిల్లాలు ప్రవేశ పెట్టిన సరిగ్గా నూరేళ్ళ కిందటి గాధలు వినిపించాయికాని, నాయనమ్మ, అమ్మమ్మ కథలు వినిపించలేదు అంటూ తీసి పారేస్తారు(మలుపు ప్రచురణ 2012). జానపద సాహిత్యంలో వర్గ స్పృహ ఉంది. వర్గ చైతన్యం లేదు అంటారు త్రిపురనేని మధుసూదనరావు(సాహిత్యంలో వస్తు శిల్పాలు. పెర్‌స్పెక్టివ్స్ ప్రచురణ 19.పుట109). తమ, దిగువ సామాజిక ఆర్థిక వ్యవస్థ పట్ల వారి సాహిత్యంలో, పోరాటాలలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఆ పోరాటాలకు కాలానుగుణంగా కావలసిన నైపుణ్యాలను అందిచటంలో చదువుకున్నవాళ్ళు విఫలమైనారు.,

**నేరస్థజాతుల చట్టం**

**గాంధేయ ఉద్యమాలు-యానాది రాఘవయ్య**

దిగువ ప్రాంతాలలో ఎరుకల యానాది, నక్కల వంటి తెగలను నేరస్థ జాతులుగా పేర్కొంటూ వారిని హింసిస్తున్నతీరుపై ఉద్యమించినవారు వెన్నెలకంటి రాఘవయ్యగారు.రాఘవయ్యగారు రచయిత, న్యాయవాది. గిరిజన పౌరహక్కుల ఉద్యమ నాయకుడై యానాది రాఘవయ్యగా ప్రసిద్ధులైనారు. నెల్లూరు యానాది గిరిజనాభివృద్ధి సంస్థ పునర్ముద్రించిన రాఘవయ్య గారి 'యానాది' (ఆదిమజాతి సేవక్ సంఘ్ 1974, పునర్ముద్రణ 2016) గిరిజనుల మీద, యానాది సంస్కృతిమీద సునిశితమైన పరిశోధన.అయితే తరువాతి తరం పౌరహక్కుల సంఘాలు వారినుండి స్పూర్తి పొందటం సరే, కనీసం తలచుకోలేదు.

**తెలంగాణాలో ఉద్యమాలు - అధ్యయనాలు**

తెలంగాణాలో గోండు వీరుడు కొమరం భీంపోరాటం తెలంగాణ సాయుధ పోరాటానికి స్పూర్తినిచ్చింది. భీం బలిదానం తరువాత హైదరాబాదు ప్రభుత్వం పనుపున మానవశాస్త్ర వేత్త చెంచు, కొండ రెడ్డి, గోండ్ తెగలను అధ్యయనం చేసారు. నాటిప్రభుత్వ సలహాదారుగా గిరిజనోపాధ్యాయుల శిక్షణాకేంద్రాలను ప్రారంభించారు. ఆయన కూడా భూమి, అడవి, కూలికి సంబంధించిన లెక్కలు పాఠాలుగా పెట్టలేదు. తిరిగి వచ్చి, 1982 లో ప్రచురించిన అధ్యయనంలో (Tribes of India-Struggle for survival .Oxford ప్రచురణ 1982) గిరిజన ఉద్యోగులు ఒక వర్గంగా తయారైనారని, చదువుకున్నవారు ఏవిధంగానూ తోటి వారికి సాయపడలేక పోతున్నారని వాపోతాడు. అది వాళ్ళతప్పుకాదు. వాళ్ళకు మనం నేర్పుతున్న చదువులు అటువంటివి. ఈ చదువులు ఉద్యోగాలకు తప్ప ప్రశ్నించటానికి, హక్కులు పొందటానికి పనికిరావు.

**రైతుకూలీ సంఘాలు - పౌరహక్కుల ఉద్యమాలు**

**గిరిజన సాహిత్యం**

1976 లో వరంగల్ పౌరహక్కుల సంఘాలకు కేంద్రంగా ఉండేది. అరుణతార, సృజన పత్రికలలో కథలు రాసే అల్లం సాహు, పెద్ది శంకర్ వంటి ఉద్యమనాయకులు గ్రామస్థాయిలో రివిన్యు, ఫారెస్ట్, అధికారులు చేస్తున్న మోసాలు, కూలి లెక్కలలో తకరారులు కళ్ళకు కట్టినట్లు చిత్రించేవారు. వాటిని ప్రశ్నిస్తే పోలీసులు మక్కెలిరగ తన్నేవారు.సంఘాలలో చేరి సాయుధపోరాటం బాట పట్టమంటూ ఈ కథలు ప్రబోధించేవి. ఈ కథలు, తరువాత బాలగోపాల్ ముందు మాటతో (కరీంనగర్ బుక్ ట్రస్ట్) 1985 లో 'అడవిలో వెన్నెల' సంకలనంగా వచ్చాయి.

రెవిన్యూ వగైరా సమస్యల జ్ఞానంతీరుతెన్నుల జోలికి పోకుండా, గిరిజనులు పిచ్చినమ్మకాలతో న్యూనతాభావంతో కుంగి పోతున్నారని వారికి విజ్ఞానం అందాలని ముందు మాటలో ఆయన వ్యాఖ్యానిస్తారు. తరువాతి కాలంలో(2000) 'చట్టం సాధికారి తను ప్రశ్నించకుండా దానిచుట్టూ ఉన్న మిధ్యను తొలగిం చటం అనే లక్ష్యాన్ని పౌరహక్కుల ఉద్యమం స్వీకరించాలి' అని పిలుపు నిస్తాడు, సలహా సంస్థతో కలసి గాంధేయ పద్ధతిలో పనిచేసిన గొర్రె పాటి నరేంద్రనాథ్ కృషికి నివాళి సమర్పిస్తాడు. (హక్కుల ఉద్యమం - తాత్విక దృక్పధం 2010 పేజి 82.245. మానవహక్కుల వేదిక ప్రచురణ)... మొత్తానికి బహుళప్రచారం తెచ్చుకున్న పౌరహక్కుల సంఘాలు, వామపక్షాలు, వారి సాహిత్యం, గిరిజన సంప్రదాయ సాహిత్యాన్ని పట్టించుకోలేదు.ఉత్పత్తి సాధనాలైన భూమి, అడవి, నీరు, కూలిలెక్కలు ప్రజలకు నేర్పటానికి పూనుకోలేదు. జ్ఞానం లేని చైతన్యం గుడ్డిది. చైతన్యం లేని జ్ఞానం కుంటిది.

**సంప్రదాయ సాహిత్యం-సాధికారిత**

'శక్తి' గిరిజనుల సంప్రదాయసాహిత్యం సేకరణకు గిరిజనులను ప్రోత్సస్తూ, ప్రభుత్వం, భూమి రికార్డులు వారికి పంచిపెట్టేటట్లు ఉద్యమాలు చేసింది. వాటిలెక్కలు, నేర్పటంలో, అటవీ హక్కుల గుర్తింపు కోసం పటాలు గీయించటంలో శక్తి ద్వారా, ప్రభుత్వం



శిక్షణ నిప్పించింది. కానీ ఈ లెక్కలు, పటాలు సార్వత్రిక విద్యలో భాగమైనపుడే, జనానికి హక్కులు దక్కే దారి దొరుకుతుంది.

## తమిళనాడు, కేరళల మార్గదర్శనం

గిరిజనుల జ్ఞానాన్ని గుర్తించటం, నైపుణ్యాలు పెంచటంలో, హక్కులు ఇప్పించటంలో ప్రపంచ ప్రసిద్ధమైన ఉదాహరణలు తమిళనాడు, కేరళకు చెందినవే.

ఇస్రో, ప్రళయకావేరిలోని శ్రీహరికోటలో యానాదులను, మత్స్యకారులను తొలగించి రాకెట్ ప్రయోగ కేంద్రం నెలకొల్పింది. యానాదులకు మొక్కుబడిగా సంక్షేమ కార్యక్రమాలను నడుపుతుంది. కానీ, పక్కనే ఉన్న చెన్నైలో యానాదులను ఇరులవారుగా పిలుస్తారు. పాములవిషంపిండి తోలుతీసి అమ్మటం, ఎలుకలు పట్టటం ఇదీ వారి జీవన విధానం. పాము తరచు విషం పెడుతుంది, తోలుతీసి చంపేస్తే ఒకసారి మాత్రమే ఆదాయం వస్తుంది, కాబట్టి చంపకుండా విషం తీయడం నేర్చుకోండి అని నచ్చచెప్పి ఉద్యోగ రీత్యా చెన్నైలో స్థిర పడిన విదేశీయుడు జాన్ వారికి నచ్చచెప్పి శిక్షణ ఇచ్చాడు. వారిని సహకార సంఘంగా ఏర్పరచాడు. అతని కొడుకు రాములస్ విటేకర్ కూడా ఇదేకృషి కొనసాగించి డిగ్రీలు లేని సర్పశాస్త్రవేత్తగా పేరుపొందాడు.

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం సరస్సులలో పాముల సంతతి పెరిగి పోయింది.వాటిని అదుపులో పెట్టటానికి అక్కడి శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. వారు రామ్‌ను సంప్రదించారు. అయన ఇరుల బృందంతో వెళ్ళాడు. వాళ్ళు పాములతో ఆటాడుతూ వేటాడుతూ పాముల సంఖ్యను అదుపులోకి తెచ్చిన వార్త ప్రపంచ మంతా మారుమోగి పోయింది. స్ఫూర్తిదాయకమైన ఈ కృషి రాకెట్ కేంద్రం శాస్త్రవేత్తల దృష్టికి రాలేదు. నెల్లూరు చెన్నైలలో ఉండే ప్రముఖులు ఈ కేంద్రానికి వచ్చే ప్రధాన మంత్రుల దృష్టికి ఈ విషయం తేలేదు.

బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, కోయంబత్తూర్ శాఖ ద్వారా 'ఎథ్నో బాటనీ ఆఫ్ ఈస్టరన్ ఘాట్స్' ప్రచురించిన పుష్పాంగదన్ కేరళలో కాని తెగవారి మందుకు పేటెంట్ హక్కు ఇప్పించాడు.

## ఆదివాసీ సాహిత్యం- ఆదివాసుల పరిస్థితి

వర్ధమాన సవర గిరిజనరచయిత మల్లిపురం జగదీష్ నేటి గిరిజనుల పరిస్థితి, వారి మీద వస్తున్న సాహిత్యంపై చేసిన వ్యాఖ్యలు గమనించదగినవి.

'ఆదివాసీ కథ అనగానే ఉద్యమకథ అనే అభిప్రాయం స్థిరపడి పోయింది'. 'తనకు తాను పరాయిగా మారేక్రమం గతం కంటే రెట్టింపయ్యింది, ఆదివాసీలు ఇప్పుడు వాటిముందు దరఖాస్తు దారు లుగా క్యూకట్టి నిలబడి ఉన్న సందర్భ మొకటి ఆవిష్కృత మౌతుంది. దీని ఫలితంగా శ్రమకి పనిముట్టుకి దూరమయ్యాడు ఆదివాసీ. ఆది వాసీ చట్టాలు వాటి అమలులో వస్తున్న ఇబ్బందులు ఆదివాసీ సమాజం ముందు కొత్త దృశ్యాలను అవిష్కరిస్తున్నాయి. ఈ దృశ్యాలన్నీ సాహిత్యంలోకి తీసుకు రావలసి ఉంది'. (బహుళ... పెర్‌స్పెక్టివ్ ప్రచురణ 2018. పుట 301) అతని కథాసంకలనం 'శిలకోల' (2018)లో ఆశీస్సులందిస్తూ అతని గురువు, ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు, జగదీశ్ తన జాతి మూలాలు తెలుసుకుని రాయాలని సూచించారు.

'బహుళ'లో అతని వ్యాసం చదివితే చెంచుల పాటల సంక లనం 'గిరిగింజ గిరిమల్లెలు' (2006 నల్లమల ఫౌండేషన్ ప్రచురణ) తప్ప మరే సంప్రదాయ గిరిజన సంకలనం చూసినట్లు కనిపించదు. ఆ సాహిత్యాన్ని అతని / గిరిజన రచయితల దృష్టికి తేవకపోవటం మన తప్పు.

'నాను చదువుకుంతాను' కథాసంకలనంలో వచ్చిన అతని మొదటికథలో, బడిలో ఇమడలేని సవర పిల్లడు డ్రాయింగ్ మాస్టారికి దగ్గరౌతాడు. బడి మానేసిన పిల్లాడిని వెతుక్కుంటూ మాస్టారు వాళ్ళ గూడెం వెళతాడు. తిరిగి వస్తుండగా గురిచూసి చెట్టుమీద ఉన్న మామిడి కాయను కొట్టి మాస్టారికిస్తాడు. 'కొమ్మలు రెమ్మలు ఎన్ని అడ్డున్నా గురిపెట్టి కొట్టావు చూడు!, అలాగే బడిలో ఎన్ని ఇబ్బందు లున్నా, చదువునుంచి గురి తప్పకూడదు' అని మాస్టారు ఉపదేశిస్తాడు.

సవరలు గొప్ప చిత్రకారులు. పండుగలలో దేవతలను ఆహ్వా నిస్తూ ఇంటి గోడలమీద బొమ్మలుగీస్తారు. అనేపధ్యం నుండి వచ్చిన పిల్లాడు ఆ మాస్టారికి దగ్గరౌతాడు. వాళ్ళ గూడెం వెళ్లినపుడు మాస్టారు గోడలమీద బొమ్మలు చూసి ఉత్తేజితు డౌతాడు. మాస్టారు ఆ పిల్లాడిని, మరో పికాసోగా తీర్చి దిద్దటానికి పూనుకుంటాడు అని కథను మలుపు తిప్పితే బాగుండేదని రచయితలో, విమర్శకులో అతనికి సలహా ఇచ్చి ఉంటే బాగుండేది.

'అంగట్లో అన్నీఉన్నాయి అల్లుడి నోట్లో శని ఉంది' అన్నట్లు గిరిజనులకు గొప్ప వారసత్వముంది. రక్షణకు చట్టాలున్నాయి. అధ్యయనాలున్నాయి. వాటిని ఇటువంటి సదస్సులలో చర్చిస్తుంటే, వారి స్థితి గతులు, మనచదువులు, రచనలు మెరుగౌ తాయి. కీలకోన్యాసం ద్వారా అటువంటి సమీక్షకు అవకాశమిచ్చిన మద్రాస్ క్రైస్తవ కళాశాల తెలుగు శాఖకు, నన్ను వారి దృష్టికి తెచ్చిన శ్రీ భక్త వత్సల రెడ్డిగారికి ధన్యవాదాలు.

---

(మద్రాసు క్రైస్తవ కళాశాలలో 'గిరిజన సంస్కృతి సాహిత్యం : సదస్సు' లో కీలకోపన్యాసం-2019 సెప్టెంబరు 25, 26 తేదీలు)

నవల


డి.పి. అనూరాధ
9010016555





*(జరిగిన కథ)*

*ఆస్ట్రేలియాలో స్థిరపడాలని కోటి ఆశలతో విమానమెక్కుతాడు సూర్యవర్మ. ఓ అపరిచితుడితో పరిచయం అతడి గమ్యాన్ని మారుస్తుంది. ఆశ్చర్యం కలిగించేలా విమానానికి బదులుగా ఓడలో తేలుతాడు. కాలచక్రంలో వేల ఏళ్ల వెనక్కి వెళతాడు. అనూహ్య మలుపులు తిరిగిన ఆ ప్రయాణం అతడిని ఎక్కడికి చేర్చింది?*

సూర్యుడి కిరణాలకి బంగారు కొండలా మెరిసిపోతోంది నా ఎదురుగా ఉన్న కట్టడం... శిఖరం ఆకాశాన్ని తాకుతున్నట్లుగా ఉంది...

ఈ కట్టడం పేరేమిటి... నేను ఎక్కడున్నానో అర్థం కాలేదు...

చుట్టూ ఎన్నో ఆలయాలు... అన్నీ బంగారు పూత లోనే. గుంపులుగుంపులుగా జనాలు...

ఏవో మాటలు వినిపించి అటు చూశాను.

'ఇది ష్వేడగాన్ పగోడా... మయన్మార్ దేశంలో అత్యంత పవిత్రమైంది..

యాంగాన్ నగర పర్యాటక ప్రదేశాల్లో ఎంతో ప్రసిద్ధి చెందింది. స్వదేశీ, విదేశీ టూరిస్టులు తప్పకుండా ఇక్కడికి వస్తారు. ఇతర దేశాల అధ్యక్షులు ఈ దేశం వచ్చినప్పుడు తప్పకుండా సందర్శించి పూజించే ప్రదేశమిది. బుద్ధభగవానుడి కేశాలను ఇక్కడ భద్రపరచడం వల్ల ఈ పగోడాను ఎంతో పవిత్రమైందిగా భావిస్తారు. ఈ పగోడా ఎత్తు 325 అడుగులు... వందల కిలోల బంగారంతో తాపడం చేయించారు. శిఖరాగ్రంలో రత్నాలను పొదిగారు. ప్రతి పున్నమి సాయంత్రం ఇక్కడ ప్రత్యేక పూజలు చేయడానికి వేలాది మంది తరలి వస్తారు.

క్రీస్తుశకం అయిదో శతాబ్దిలో ఒక్కలప్ప అనే మన్ రాజు ఈ స్థూపాన్ని నిర్మించాడు. ఆ తరువాత ఎంతో మంది రాజులు దీన్ని అభివృద్ధి చేశారు' అని గైడ్ వివరిస్తున్నాడు.

పరికించి చూస్తే అర్థమైంది 20 మంది టూరిస్టుల గుంపులో నేనూ ఉన్నా..

ఎత్తయిన కొండ మీద కట్టిన పగోడా విశేషాలు చూపిస్తూ ఆ నిర్మాణం విశిష్టతను వివరిస్తున్నాడు గైడ్. చుట్టూ వారాల పేర్లతో బుద్ధ విగ్రహాలు ఉన్నాయి.. ఎదురుగా నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. ఏ వారంలో పుట్టిన వారు ఆ వారం బుద్ధ విగ్రహం దగ్గర మూడు చెంబులతో అభిషేకం చేయాలట... వింతైన ఆచారానికి ఆశ్చర్యం వేసింది. గైడ్ చెప్పిన దాంట్లో ఒక్కలప్ప..అయిదో శతాబ్దం అన్నది నాకు విశేషంగా అనిపించింది. అంటే నేను ఇంతకుముందు టైం మిషన్‌లో 5వ శతాబ్దానికి వెళ్లి వచ్చానన్నమాట. ఒక్కలప్ప ఆనాడు 50 అడుగుల ఎత్తులో మట్టితో నిర్మించిన స్థూపం నేడు 300 అడుగుల ఎత్తుకు చేరింది. కానీ మనది తలైంగుల జాతి అని జేజమ్మ చెప్పింది. మరి, మన్ జాతి రాజు దీన్ని నిర్మించాడని గైడ్ చెబుతున్నాడు.

ఈ మన్ జాతి వారు ఎవరు? గైడ్ దగ్గరకు వెళ్లి నాకు వారి గురించి మరిన్ని వివరాలు కావాలని అడిగాను.

'ఆ వివరాలు నాకంతగా తెలియదు.. మా తాత కూడా ఒకప్పుడు గైడ్.. మీకు వారి గురించి కచ్చితంగా మరింత సమాచారం తెలుసుకోవాలంటే అతని దగ్గరికి తీసుకు వెళతాను' అన్నాడు.

'తప్పకుండా మీ తాతగారిని కలుసుకోవాలి' తేల్చిచెప్పాను.

ఎప్పటినుంచో నన్నే చూస్తూ నా వెంటే తిరుగుతోంది ఓ యువతి... పాతిక లోపు వయసు ఉంటుంది.. థాయిలాండ్ దేశస్థురాలిగా ఉంది. పాలమీగడ కన్నా తెల్లని మేని ఛాయ. తెల్ల టీ షర్టు, రెడ్ కలర్ స్కర్టు వేసుకుని, ఎండకు గొడుగు పట్టుకుని ఉంది.. అప్పుడప్పుడూ నన్ను చూసి నవ్వుతోంది. నాకు ఆమె పోకడ అర్థం కాలేదు.

గైడ్ తో మాట్లాడుతుంటే..

'నేను నీతో వస్తా' .. అంది.

అసలే దేశం కాని దేశం... ఏ క్షణంలో ఎక్కడ ఉంటానో తెలియకుండా తిరుగుతున్నా. నాకు ఓ డోలులా తయారైంది.

'ఎవరు నువ్వు..'

'నా పేరు చిమ్మయి.. మాది థాయిలాండ్.. ఏన్షియంట్ హిస్టరీ పై రీసెర్చ్ చేస్తున్నా..' అని చెప్పుకొచ్చింది.

'అపరిచితులతో తిరగడం నాకు ఇష్టం ఉండదు' తేల్చిచెప్పా.

'ప్లీజ్... 'అంటూ నా చెయ్యి పట్టుకుంది.

ఆ స్పర్శ లో ఏదో మ్యాజిక్ ఉంది. కాదనలేక పోయాను. ఇద్దరం కలిసి గైడ్‌తో టాక్సీలో బయలుదేరాం. అతడు లుంగీ ధరించి; భుజానికి సంచి వేసుకుని ఉన్నాడు. తనని చూస్తే ఒక్కలప్ప గుర్తుకొస్తున్నాడు.

యాంగాన్ సిటీ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. సైకిల్ లాంటి రిక్షాలు.. రోడ్ సైడ్ చిన్న చిన్న టీ షాపులు.. పిచ్చాపాటిగా మాట్లాడుతూ టీ తాగుతూ జనాలు...రక రకాల జాతులు వారు...అన్నే రకాల కార్లు...

అంతలో వాళ్ళ ఇల్లు వచ్చింది. ఇరుకు రోడ్లే కానీ కార్లన్నీ ఓ సైడ్లో పద్ధతిగా పార్క్ చేసి ఉన్నాయి.

40 అడుగుల పొడవు ... పది అడుగుల వెడల్పు.. ఎనిమిది అడుగుల ఎత్తుతో .. చెక్క ఇల్లు వారిది. లోపలి నుంచే పై అంతస్తుకి వెళ్లేందుకు చెక్క మెట్లు ఉన్నాయి. నిటారైన ఆ మెట్లెక్కి పైకి వెళితే.. అక్కడే ఓ గదిలో ఉన్నారు గైడ్ వాళ్ల తాతయ్య.

90 ఏళ్ల పండు వయసు... రుషిలా కన్పిస్తున్నారు. తెల్లని చొక్కా.. ఎర్ర లుంగీ ధరించారు.

'నేను భారతదేశం నుంచి వచ్చానని తలైంగుల గురించి తెలుసుకోవాలని ఉంద'ని అడిగాను.

నన్ను చూడగానే ఆయన ముఖం విప్పారింది.... కాస్త లోగొంతుకలో...

'ప్రస్తుతం మన్ జాతీయులే ఉన్నారు. తలైంగులు అనే మాట నిషేధించబడింది.

కాలగతిలో ఆ పదానికి అర్థం మార్చేశారు బర్మీయులు. తండ్రి లేని పిల్లలు అని ఆ పదానికి అర్థం వ్యవహారంలో పడిపోయింది. ఎక్కడా ఆ మాట ఎత్తకు.. నీ ప్రాణాలకే ప్రమాదం' అని హెచ్చరించారు.

దీర్ఘంగా ఆలోచిస్తూ.. బర్మాలో తొలి వలస రాజ్యాలను స్థాపించింది మన్ జాతీయులు. వీరి తొలి రాజ్యం సుధర్మపురం. ఆ రాజ్యాన్ని 56 మంది రాజులు పరిపాలించారు. అదే నేటి తటోను. 6వ శతాబ్దిలో రాకుమారులు విమల, సామల తల్లితో గొడవ పడి తమ రాజ్యాన్ని విడిచిపెట్టారు. కొంత సైన్యాన్ని తీసుకొని ఉత్తరంగా ఉన్న ప్రదేశంలో ఓ రాజ్యాన్ని స్థాపించారు. ఇదే హంసావతి రాజ్యం గా పేరు తెచ్చుకుంది. వీరి రాజధాని నేటి బెగో. అయితే 11వ శతాబ్దిలో గాన్ కు చెందిన అనిరుద్ధ అనే రాజు మన్ జాతీయుల త్రిపీఠకాలపై ఆశపడ్డాడు. వాటిని తనకు అప్పగించవలసిందిగా తటోను రాజును అడిగాడు. అతడు కాదనడంతో పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చి యుద్ధంచేసి రాజును బందీగా చేసుకుని 30 వేల మంది మన్ జాతీయులను బానిసలుగా తనతో తీసుకు వెళ్ళాడు. తటోనులో మన్ కోటలను ధ్వంసం చేశాడు. ఆనాటి రాజ్యానికి సంబంధించి ఏ ఆనవాలు అక్కడ కనబడదు' అని భారంగా నిట్టూర్చాడు.

మన పూర్వీకులకు చెందిన ఆ తటోనును, బగోను సందర్శించాలని అనుకున్నాను. అదే మాట ఆ పెద్దాయనతో అంటే ఆ రెండు నగరాలతోపాటు మన్ రాష్ట్ర రాజధాని మౌల్మీన్ కు కూడా వెళ్లి అక్కడ నేటి మన్ జాతి వారిని కలుసుకోమని సలహా ఇచ్చాడు.

చిమ్మయి వంక చూశా ప్రశ్నార్థకంగా..

'నేను నీతో పాటే..' అంది.

'నీకు వేరే పని లేదా?'

'నువ్వు తిరిగే ఏన్షియంట్ ప్లేసెస్ పై థీసిస్ రాస్తా' అంది.

ఆమె కళ్ళతో మెస్మరైజ్ చేస్తూ.. నన్ను కట్టడి చేస్తోంది.

యాంగాన్ నుంచి మౌల్మీన్ కు సుమారు 300 కిలోమీటర్ల దూరం అట. దారిలో బెగో, తటోను వస్తాయట. ఏదైనా టాక్సీ ఏర్పాటు చేయమని గైడ్‌కు చెప్పాను. వాళ్ల తాతయ్యతో మాట్లాడిన దంతా విన్నట్టున్నాడు. ఇండియాకు చెందిన టాక్సీ డ్రైవర్‌ను తీసుకు వచ్చాడు.

'నీ పేరేమిటి 'అని అడిగా. ఆ డ్రైవర్ 'రావు'అన్నాడు.

'మీరు తెలుగా' అనగానే 'అవును' అని తల ఊపాడు.

కానీ 'కొంజెం కొంజెం' అని తమిళ తెలుగు మాట్లాడు



తున్నాడు.

ఎప్పుడో 200 ఏళ్ళ క్రితం బ్రిటిష్ కాలంలో చెరుకుతోటలో కూలీలుగా పని చేయడానికి వీళ్ళ తాతలు ఇక్కడికి వచ్చారట. ఇతడు నాలుగో తరానికి చెందిన వాడు. వాస్తవానికి ఇతడు డ్రైవర్ మాత్రమే కాదు, టాక్సీ ఓనర్. తన దగ్గర మూడు కార్లు ఉన్నాయట. అన్నింటిని టాక్సీగా నడుపుతున్నాడు. ఇండియా టూరిస్టులు అని తెలిసి తనే వచ్చాడట. మౌల్మీన్‌లో వాళ్ళ బంధువులు ఉన్నారట. వాళ్ళ ఇంటికి తీసుకు వెళతాను అన్నాడు.

ఎనిమిది దారుల హైవే పై మా ప్రయాణం సాగుతోంది. ఏదో పుస్తకంలో మునిగిపోయింది చిమ్మయి. జంట హంస ప్రతిమలతో బెగో..అలనాటి పెగు స్వాగతం పలికింది. ష్వేమావ్డా పగోడా ఇక్కడ ఎంతో ప్రసిద్ధిచెందింది. ఎందరో పూజలు చేస్తూ కనిపించారు. పక్కనే ఉన్న మందిరం గోడలపై కొన్ని చిత్రాలు ఉన్నాయి. అందులో సముద్రదారుల్లో మూడు తెగల వారు ఈ ప్రాంతానికి వచ్చారని ఈ నేల మాది మాదని, తగువు లాడుతుంటే ఓ భిక్షువు వచ్చి ఆ తెగల్లో మొదట వచ్చింది మన్ జాతీయులు అని తేల్చి చెప్పారని ఆ పెయింటింగ్స్ తెలియజేస్తున్నాయి. అంతకు మించిన సమాచారం దొరకలేదు.

విమల, సామల కోటలు లేవు. ఓ కూడలిలో బంగారు వర్ణంలో ఓ రాజు విగ్రహం కనిపించింది. 6 అడుగుల ఎత్తున్న ఆ విగ్రహం దగ్గర కాసేపు ఆగిపోయాను. **ఆ రాజుకు దట్టమైన మీసాలు ఉన్నాయి. బర్మీయులకు, చైనీయులకు ఎవరికీ మీసాలు ఉండవు. ఇది ఎవరి విగ్రహం అని ఆరా తీస్తే.. అతడు 14వ శతాబ్దికి చెందిన మన్ చక్రవర్తి రాజాదరిత్ అని చెప్పారు. మన్ జాతి వారినందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన గొప్ప రాజట!**

మా తదుపరి మజిలీ తటోను. ఇక్కడైనా ఏవైనా కట్టడాలు కనిపిస్తాయని ఆ నగరంలో ఎంతో ఆశతో అడుగు పెట్టాను. కానీ నిరాశే.. అయితే రావు ముందుగా తెలియచేయటం వల్ల అక్కడున్న కొంతమంది తెలుగుజాతి యువకులు మమ్మల్ని కలుసుకోవడానికి వచ్చారు. వాళ్ళందరూ రావు తోటివాళ్లే.

ఆ నగరంలో ఉన్న కొన్ని తెలుగువారి గుళ్లకు తీసుకువెళ్లారు. ప్రతి గుడి గోడలపై తెలుగు అక్షరాలు పలకరిస్తుంటే మనసు పులకించింది. తరాలు మారినా తమ జాతి మూలాలను పరాయి గడ్డపై ఇంకా పరిరక్షించుకుంటున్నారు. హారతి ఇస్తుంటే అందరూ పళ్లెంలో డబ్బులు వేస్తున్నారు... నేను మాత్రం హారతి కళ్ళకద్దుకుని ఉండిపోయాను. ఓ యువకుడు నా చేతిలో బర్మీస్ వెయ్యి రూపాయల నోటు పెట్టి...

'అన్నా, ఈ డబ్బు హారతి పళ్ళెంలో వేసి మొక్కుకో. అంతా మంచిగా జరుగుతుంది' అని అన్నాడు.

వద్దని వారిస్తున్నా వినలేదు. మయన్మార్లో తెలుగుజాతి వారికి భక్తి, దానగుణం ఎక్కువ అని చెప్పాడు.

తటోనులో ఉంది ష్వేసాయాన్ పగోడా. విశాలమైన ఆ ప్రాంగణంలో ఎన్నో శిలాఫలకాలను భద్రపరిచారు. నిట్టనిలువుగా ఎండ పడుతోంది. నాకు, చిమ్మయికి గొడుగులు పట్టారు ఆ



యువకులు. వద్దని వారిస్తున్నా వారి ధ్యాస వారిదే.

మయన్మార్లో ఆనాడు ఎవరొచ్చినా సముద్ర దారుల్లో మొదట తటోనుకే వచ్చేవారట. కానీ నేడు సముద్రం ఈ నగరం నుంచి 16 కిలోమీటర్ల దూరం వెళ్ళింది. రాజు అనిరుద్ధ దాడిలో మన్ జాతి కోటలు కట్టడాలు ధ్వంసమయ్యాయి.

అతడు ఆనాడు తనతోపాటు తీసుకువెళ్లిన మన్ జాతీయులు బగాన్ లో వేల సంఖ్యలో పగోడాలను నిర్మించారట. అది నేడు ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ సముదాయంగా పేరు తెచ్చుకుంది. ఈ నగరంలో ప్రతి కూడలిలో బంగారు జంట హంస బొమ్మలు కనిపించడం విశేషం. చారిత్రక ఆనవాళ్ళు కనిపించలేదన్న అశాంతి మనసులో నిండింది. అయితే **బీరకాయ పీచు చుట్టరికం కూడా లేని మాతో తటోను యువకులు రోజంతా తమ పనులన్నీ మానుకుని ఉండడం ఆనందం కలిగించింది. మమ్మల్ని ఒకటిగా చేసింది తెలుగు బంధమే. వాళ్ళకి వీడ్కోలు చెబుతూ ముందుకు సాగాం.**

చిన్న, పెద్ద పగోడాలు దారి పొడవునా కనిపిస్తున్నాయి. అన్నీ బంగారు వర్ణంలోనే. ప్రముఖమైన వాటికి మాత్రమే బంగారు తాపడం చేస్తారు. మిగిలిన వాటికి ఆ రంగు పెయింట్ వేస్తారు అని రావు చెప్పాడు.

సాల్వీన్ నది ముఖద్వారం లో మౌల్మీన్ నగరం ఉంది. పొడవైన వంతెన దాటి వెళుతుంటే సముద్రంలా తలపిస్తోంది ఆ నది. బ్రిటిష్ కాలంలో మినీ ఇంగ్లాండ్ అని ఈ నగరాన్ని పిలిచేవారట. చూడచక్కటి భవనాలు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. థాయిలాండ్ బోర్డర్ కావడంతో మిశ్రమ సంస్కృతి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

'ముందుగా మా పెద్దాయన కర్రి అప్పారావు ఇంటికి వెళదాం అంటూ' రావు నేరుగా అక్కడికి తీసుకు వెళ్ళాడు.



మౌల్మీన్‌లో మొట్టమొదటి మూడంతస్థుల భవనం అప్పారావుగారిదేనట. ఆ నగర పెద్దల్లో ఆయనొకరు. డెబ్బై ఏళ్ల వయసుంటుంది. వారిది ప్రేమవివాహం. ఆయన భార్య బర్మీస్ ముస్లిం స్త్రీ. వారికి ముగ్గురు కొడుకులు. రెండో కొడుకు మన్ జాతి యువతిని పెళ్లిచేసుకున్నాడట. వీటన్నిటి వల్ల ఆ ఇంట్లో నాకు చాలా సమాచారం తెలుస్తుందని రూఢి అయింది.

అప్పారావు గారి జంట మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. ఆయన భార్య నుదుటిన కుంకుమ బొట్టు ధరించడం నాకు ఆశ్చర్యం కలిగించింది. మా కోసం ముద్ద పప్పు, రసం, పెరుగుతో భోజనం ఏర్పాటు చేశారు. రాత్రి కావడంతో విశ్రాంతి తీసుకోమన్నారు. వారి ఇల్లు బర్మీస్ టేకుతో నిర్మించారు. ఇళ్లంతా పొడుగ్గా, వరుస గదులతో ఉంది. గదుల మధ్య గోడలుగా కూడా టేకు చెక్క పలకలే. కింద, పై పోర్షన్లలో కొడుకులు ఉంటారట. రావుకూ, నాకూ ఓ గదిలో బస ఏర్పాటు చేశారు. మా ఎదురుగా చిమ్మయి వసతి గది. మాకు గుడ్ నైట్ చెప్పేసి తను వెళ్లిపోయింది.

ఈ అమ్మాయి ఎవరు? ఎందుకు నన్ను ఫాలో అవుతోంది? ఒక్కలప్పులా ఈమె కూడా నాకేదయినా చెప్పదలచుకుందా? ఎంత కాలం ఇలా ఏమీ చెప్పకుండా తిరుగుతుంది .... రకరకాల ఆలోచనల మధ్య నిద్ర కమ్మేసింది.

...

వెంకటేశ్వర స్వామి సుప్రభాత రికార్డుతో మెలకువ వచ్చింది. అప్పటికే తెల్లారింది.

కానీ ఇంకా సూర్యుడు రాలేదు. బయట హాలులోకి వచ్చి చూస్తే అప్పారావుగారు మడత కుర్చీలో కూర్చుని ఉన్నారు.

'గుడ్ మార్నింగ్ సర్' అంటూ వెళ్లాను.

అప్పటికే వాళ్లావిడ మార్కెట్ నుంచి ఏదో కొనుక్కొని వచ్చింది. వంట గదిలోకి వెళ్లి పెద్ద పాత్రలో వేడి వేడి అన్నం, మరో గిన్నెలో కూర సర్దుకుని మెట్లుదిగి కిందకి వెళ్లింది. నాకేమీ అర్థం కాక ఆయన్ని చూశా. ఆయన కిటికీలోంచి బయటకు చూడమని చెప్పారు.

కింద రోడ్డు మీద సుమారు 50 మంది బౌద్ధ భిక్షువులు కాషాయ వస్త్రాల్లో చేతిలో భిక్ష పాత్రలతో ఒక వరుసలో నడుస్తూ వస్తున్నారు. కొంత మంది స్త్రీలు తమ ఇంటి ముందుకు రాగానే ఆహార పదార్థాలను వారి పాత్రల్లో వేస్తున్నారు. రావుగారి భార్య కూడా అలాగే చేసింది. ఎప్పుడో బుద్ధుడి కాలంలో మొదలైన భిక్షాటన నేటికీ ఈ దేశంలో కొనసాగుతోంది.

'వీళ్లందరూ ఇక్కడ బౌద్ధ విహారాలలో ఉండే భిక్కువులు. ప్రతి రోజూ సూర్యోదయానికి ముందే ఇలా వస్తారు. వాళ్లు కావాలని ఏదీ అడగరు. ఎవరైనా ఏదైనా వేస్తుంటే జోలెపడతారు. వారిలో ఎనిమిదేళ్ల నుంచి డెబ్బై ఏళ్ల వయసున్న భిక్కువులూ ఉన్నారు. అంత చిన్నపిల్లలు అనాథలేమోనని నీకు అన్పించొచ్చు. కానీ కొంత మంది కుటింబీకులు తమ పిల్లల్లో ఒకరిని బౌద్ధాశ్రమానికి కానుకగా ఇవ్వడం బర్మీయులలో ఆనవాయితీ..' ఈ వ్యవహారమంతా రావు గారు వివరిస్తుంటే ఎంతో విస్మయం కలిగింది.

రావుగారి పక్కన కూర్చుంటూ... 'మీరు ఈ దేశానికి ఎప్పుడు,



ఎలా వచ్చారు..' అని ప్రశ్నించా.

'మా తాత, ఆయన మిత్రులు ఆంధ్రలోని విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి చెరుకు తోటల్లో పనుల కోసం బ్రిటీష్ కాలంలో నౌకల్లో ఇక్కడికి వచ్చారు.

ఇప్పటికీ ఆంధ్ర దేశంలో మా బంధువులు ఉన్నారు. వాళ్లకూ మాకూ ఉత్తరాలు నడుస్తుంటాయి. నేను ఇప్పటికి రెండు, మూడు సార్లు భారతదేశం వెళ్లొచ్చా. మేం మొదటి నుంచీ చైనీయులతో కలిసి ఎగుమతి వ్యాపారం చేస్తున్నాం. ఇప్పటికీ అదే వ్యాపారం కొనసాగుతోంది. అయితే ఈ నేలతో పూర్తిగా కలిసిపోయాం. కానీ ఆచారాలు, పద్ధతులు అన్నీ అక్కడివే. పేర్లు మాత్రం రెండు పెట్టుకుంటాం. ఇంట్లో తెలుగు పేరుతో పిలుచుకుంటాం. బయట బర్మీస్ పేరుతో చలామణి అవుతాం.

సంక్రాంతి, దీపావళి, దసరా పండుగలే మాకు పెద్ద పండుగలు. అయితే ఇక్కడ చైనీస్, బర్మీస్, ఇండియన్ ఇలా అన్ని జాతుల వారమూ కలిసి బతుకుతాం.

జాతులు వేరైనా మా అందరిలో సఖ్యత ఎక్కువ. మా పిల్లలూ తెలుగు మాట్లాడతారు, కానీ అక్షరాలు రావు, మా మనవళ్లు తెలుగు అంతంతే మాట్లాడగలరు. మా తరం తరవాత ఇక్కడ తెలుగు పూర్తిగా మాయమవుతుందేమోనని ఒక్కోసారి భయమేస్తుంటుంది. కానీ ఏం చేయగలం, కాలగతిలో కలిసిపోవాలిగా " అంటూ నిట్టూర్చారు.

ఆయన రెండు వందల ఏళ్ల నాటి వలసల గురించి ఆలోచిస్తున్నారు. నేను 1500 వందల ఏళ్ల నాటి తెలుగు వలసల గురించి ఆలోచిస్తూ... 'మన్ జాతి వారి గురించి మీకేమైనా తెలుసా' అని అడిగాను.

'రామెన్.. మో.. మన్ గా.. వాళ్లని పలురకాలుగా పిలుస్తారు. కృష్ణ, గోదావరి ముఖద్వారాల నుంచి వలస వచ్చి ఇక్కడ అనేక సామ్రాజ్యాన్ని స్థాపించారని, వారి ముఖ్య రాజధాని తటోను అని మేం చిన్నప్పుడు పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నాం.

దక్షిణ బర్మా, థాయిలాండ్ లలోని ద్వారావతి, హంసావతి, హరిపుంజాయి లాంటి రాజ్యాలన్నీ వారు స్థాపించినవే. వారి వల్లే ఈ నేలకంతా 'సువర్ణభూమి' అనే పేరొచ్చిందనీ అంటారు. అయితే

వీరికి తలైంగులు అని మరో పేరు కూడా ఉంది.

తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చినందునే ఆపేరు స్థిరపడిం దని చైనీయుల గ్రంథాలలో రాశారు. కానీ ఇప్పుడు ఆ పేరు వాడుకలో లేదు. ఆ మాటను పలికితేనే భగ్గున లేస్తారు. మా రెండో కోడలు మన్ జాతీయురాలే. కానీ ఆమెకు ఇవేవీ తెలియదు. తెలంగాణ మూలాల గురించి అసలే తెలియదు. **మరో యాభై ఏళ్ల తరవాత నువ్వు బర్మా వచ్చి నా మునిమనవడిని 'మీరు తెలుగు వాళ్లు కదా అని అడిగితే, వాళ్లెవరు' అని ఎదురు ప్రశ్నించవచ్చు. అంతగా మన తెలుగు వాళ్ల మధ్య దూరం పెరుగుతోంది. అంటూ ఆవేదన చెందారు.** కాసేపటికి ఆయన ముఖం కాస్త కుదుటపడింది.

'సూర్యా, మన్ రాజులలో ఓ అద్భుత వ్యక్తి గురించి నీకు చెబుతాను.

వాళ్లలో ఓ రాజు పేరు 'మగాడు'. ఈ పేరును బట్టే తెలుసు కోవచ్చు వాళ్లతో మనకు ఎంతటి అనుబంధం ఉందో. ఆయనకు బర్మీస్ లో 'వరారో' అని మరో పేరు ఉంది. ఈయన కథ చాలా ఆసక్తిదాయకంగా ఉంటుంది. సియాం (నేటి థాయిలాండ్) లోని సుఖతాయి అనే ప్రాంతంలో వ్యాపారం చేస్తుండేవాడు.

అక్కడి సియాం రాజుతో సాన్నిహిత్యం పెరిగి, కోటలో పాగా వేశాడు.

యువరాణితో ప్రేమలో పడ్డాడు. వాళ్లిద్దరూ ఎవరికీ చెప్పకుండా ఆ రాజ్యం నుంచి పారిపోయి మగాడు సొంతూరు బర్మాలోని మర్తబన్ చేరుకుని పెళ్లిచేసుకున్నారు.

మగాడు అక్కడి సామంత రాజుపై దండయాత్ర ప్రకటించాడు. దానికి ఆ సామంతరాజు భయపడి పారిపోయాడు. మగాడు మర్తబాన్ రాజ్యానికి తానే రాజుగా ప్రకటించుకున్నాడు. ఆ విషయాన్ని సియాం రాజుకు సందేశం పంపాడు.

ఆ రాజు ఎంతో సంతోషించి..

'రాజవంశంలో పుట్టకపోయినా, ఆకాశం నుంచి నేరుగా రాజుగా తన అల్లుడు జారిపడ్డాడని' ప్రకటించాడు.

అలా 13 వ శతాబ్దిలో రామన్నదేశ పగ్గాలు మళ్లీ మన్ జాతీయుల చేతిలోకి వచ్చాయి. మర్తబన్ రాజధానిగా ఉండింది. తన పరిపాలన మూడో సంవత్సరంలో బౌద్ధగురువులు, పండితులను సంప్రదించి 'మగాడు ధర్మనీతి'ని రూపొందించాడు. బర్మాలో తొలి రాజనీతి గ్రంథం అదే. అతడు అలా ఇరవై ఏళ్లు పరిపాలించాడట. ఇక్కడి మ్యూజియంలో మగాడి శిల్పాన్ని నువ్వు తప్పకుండా చూడాలి."

'మరి రాజాదిరత్ ఎవరు? అని అడిగా.

'అతడూ మన్ రాజే. మగాడి తరవాతి కాలం వాడు. రాజాదిరత్ తరవాత చెప్పుకోదగ్గ మన్ రాజులు లేరు. యూరోపియన్ల పాలనలో వీరు తమ ప్రభను కోల్పోయారు. స్వాతంత్ర్యానంతరం మిలిటరీ పాలనలో వీరి పరిస్థితి మరీ దిగజారింది. ప్రత్యేక ప్రతిపత్తి కోసం ఎన్నో ఏళ్లు గెరిల్లా పోరాటం చేశారు. ఆ యోధులందరూ ఇప్పుడు కురువృద్ధులయ్యారు. మయన్మార్ మూలతెగల్లో మన్ వారు ఒకరిగా నేడు మిగిలారు. 'మన్' జాతీయులు తెలంగాణ ప్రాంతాల నుంచి వలస వచ్చారని- బర్మా చరిత్ర రాసిన సర్ ఆర్థర్ ఫెయిరీ స్పష్టపరచారు.

బర్మా, థాయిలాండ్లలోని మన్ జాతీయులను అధ్యయనం చేసిన యూరోపియన్ చరిత్రకారుడు రాబర్ట్ హల్లిడే 'ది తలైంగ్స్' అనే గ్రంథం రాశారు. తెలంగాణ ప్రాంతం వారేనని ఆయనా వక్కాణించారు. మా కోడలి వాళ్ల గ్రామం ఇక్కడికి దగ్గర్లోనే ఉంది. ఓ గంట ప్రయాణం. వాళ్ల తండ్రి మన్ నేషనల్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయనతో మాట్లాడి మరింత సమాచారం తెలుసుకోవచ్చు. అలాగే వారి గ్రామానికి వెళ్లి నేటి మన్ వారి జీవనం తెలుసుకో...' అంటూ రావుకు అక్కడికి ఎలా వెళ్లాలో వివరంగా చెప్పారు.

బ్రేక్ ఫాస్ట్ చేసిన తరవాత ముగ్గురం బయల్దేరాం.

నా మనసు పరిపరి విధాల పరుగులు తీస్తోంది. 1500 ఏళ్ల నాటి మన తెలుగు వారిని కలుసుకుంటున్నానన్న ఆనందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆనాటి 'మన నేల తెలంగాణ' అనే జోల పాట ఈనాటికీ పాడుకుంటున్నారా? నేను తెలంగాణ నుంచి వచ్చానని అంటే ఎలా స్పందిస్తారు? వాళ్లు తమ మూలాలను నాలో చూసుకుంటారా? నాతో పాటే తెలంగాణ వచ్చి తమ తల్లి నేలను చూస్తాం అంటారా? అన్నీ ప్రశ్నలే... మరో గంటలో నా ఈ ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది. అంతవరకూ వేచి చూడాలి.

(తరువాయి నవంబరు సంచికలో...)

**ఈ క్రింది పుస్తకాలు మా వద్ద లభిస్తాయి.**

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**
వెల :రు. 100/-



**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**
వెల : రు.350/-

పుస్తకాల ధరను ఎం.ఒ.గా ఈ క్రింది చిరునామాకు పంపిస్తే పుస్తకాలను కొరియర్‌లోగాని, స్పీడ్ పోస్టులో గాని పంపిస్తాము.

'అమ్మనుడి' పత్రిక, 8-386, జీవక భవనం
అంగల కుదురు (పోస్టు) తెనాలి, గుంటూరు -522210
డా॥ సామల లక్ష్మణబాబు (9440448244) ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చలసాని నరేంద్ర
9849569050

# హిందీ భాషా దురభిమానం ప్రమాదకరం!

హిందీని అనుసంధాన భాషగా దేశ ప్రజలు అందరు నేర్చుకోవాలి అన్నట్లు బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా హిందీ దివస్ సందర్భంగా ఒక పిలుపు ఇవ్వడం దేశంలో, ముఖ్యంగా దక్షిణ భారతావనిలో రాజకీయ దుమారం రేగింది. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటకలలో నిరసనలు కూడా వ్యక్తం అయ్యాయి. కేరళ, పుదుచ్చేరి, కర్ణాటక ముఖ్యమంత్రులతోపాటు అనేకమంది రాజకీయ, సామాజిక నేతలు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రకటనలు ఇచ్చారు.

దక్షిణాదిన బలం పుంజుకోవడం కోసం విఫల యత్నాలు చేస్తున్న బిజెపికి యిటువంటి ప్రతికూల స్పందన విస్మయం కలిగించింది. దానితో స్వయంగా అమిత్‌షా తన ప్రకటనను వెనుకకు తీసుకున్నారు. తన మాతృభాష హిందీ కాదని, గుజరాతీ అని.. హిందీని ద్వితీయ భాషగా మాత్రమే నేర్చుకోవాలని చెప్పానని వివరణ ఇచ్చుకున్నారు.

ఆ తర్వాత అమెరికా పర్యటన సందర్భంగా హోస్టన్‌లో జరిగిన హౌడీ మోదీ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహితం స్వయంగా వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. భారతదేశ ప్రజాస్వామ్యంకు వైవిధ్యమే పునాది అని, దేశంలోని అనేక భాషలు ఉదారవాదానికి, ప్రజాస్వామ్యయుత సమాజానికి సూచికలని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్లల్లో మరే విషయంలో కూడా ఈ విధంగా ప్రధాని తత్తరపాటు పడిన సందర్భం లేదు.

ప్రపంచం మొత్తం మీద భాషకు సంబంధించిన ప్రకటనలు భావోద్వేగాలను రేకెత్తిస్తున్నాయి. ఒక భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలు తీవ్ర ప్రతిఘటనలు ఎదుర్కొంటూనే ఉన్నాయి. భాషలు ప్రజలలో తమ ప్రాంతం పట్ల ఒక అనుబంధాన్ని కలిగిస్తున్నాయి. వారిలో ఆత్మగౌరవాన్ని కలిగిస్తున్నాయి. చరిత్రలో భాష పేరుతో హింసకు దిగిన అనేక ఉదంతాలు అన్నిచోట్లా కనిపిస్తుంటాయి.

ఉదాహరణకు అమెరికా ఒక దేశంగా ఏర్పడినప్పుడు ఆ దేశంలో నివసిస్తున్న ప్రజలలో 40 శాతం మందికి మాత్రమే ఆంగ్లం మొదటి భాషగా ఉంటూ వచ్చింది. కానీ ఇప్పుడు 87 శాతం మంది ప్రజలు తమ మొదటి భాషగా ఆంగ్లంలో మాట్లాడుతున్నారు. అమెరికా బాషా వైవిధ్యాన్ని కోల్పోవడానికి, ఇటువంటి ఒక భాష సమైక్యత ఏర్పడడానికి భాష పేరుతో తీసుకు వచ్చిన పలు చట్టాల ద్వారా ఆ దేశం అనుసరించిన హింసాయుత విధానాలే కారణం అని చెప్పవచ్చు. ఆంగ్లంలో మాట్లాడానికి నిరాకరించిన బానిసల నాలుకలు వారి యజమానులు, వ్యాపారులు కోసివేసినటువంటి దుర్భర పరిస్థితులు ఆ దేశంలో జరిగాయి.

ఉదాహరణకు, 1862లో జనరల్ బెంజిమన్ బట్లర్ న్యూ ఓర్వలేన్స్ ను ఆక్రమించడం కోసం యూనియన్ సేనలకు సారధ్యం వహిస్తున్న సమయంలో ఫ్రెంచ్‌లో మాట్లాడడాన్ని నిరుత్సాహ పరచడం కోసం ఆ భాషలో మాట్లాడేవారిని వారించారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు జర్మనీలో మాట్లాడడాన్ని నిషేధిస్తూ తమ దేశంలో ఉన్న 60 లక్షల మంది జర్మన్ వలసదారులపై నిర్బంధం ప్రయోగించాయి.

భాషాపర ఆధిపత్య ధోరణుల కారణంగా ఐరోపాలో సహితం ఆంగ్లం, జెర్మనీ భాషలు మాట్లాడే వారి మధ్య యుద్ధాలు, ఘర్షణలు సహితం ఎన్నో జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఇటువంటి భాషాపర ఆధిపత్య ధోరణులకు భిన్నంగా భారత దేశంలో మాత్రం చిరకాలంగా పలు భాషల ప్రజలు సామరస్యంతో సహజీవనం చేస్తూ వచ్చారు. భాషాపర భిన్నత్వానికి మనదేశం ఒక ఆదర్శంగా ఉంటూ వచ్చింది. ఇక్కడ బలవంతంగా భాషలను రుద్దడం ద్వారా కాకుండా, ఇతర భాషలను ఆత్మీయతతో ఆదరించి, ఇముడ్చుకోవడం జరుగుతూ వచ్చింది.

**అదే సందర్భంగా ప్రపంచం మొత్తం మీద జాతీయ స్థాయిలో ఒక అనుసంధాన భాష లేకుండా ఉన్న దేశం బహుశా భారత్ మాత్రమే.**

బహు భాషల వలన ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతూ వస్తున్నా, మన బలం కూడా అదే అని మరచిపోతున్నాము. 'భిన్నత్వంలో ఏకత్వం' భారత దేశానికి ప్రధాన బలం. ఆ భిన్నత్వాన్ని చెరిపివేసి, అన్నింటా ఒకే విధానాలు తీసుకు రావాలనే ప్రయత్నం చేయడం ప్రమాదకరమని గుర్తించాలి. చరిత్ర తొలి రోజుల నుండి విభిన్న భాషలకు ఈ దేశంలో ఆదరణ ఉంది. వివిధ భాషల ప్రజలు ఎంతో సామరస్యంగా జీవించారు.

అనేకమంది రాజులు విభిన్న భాషలను ఆదరించారు. ఉదాహరణకు దక్షిణాదిన పేరొందిన విజయనగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణ దేవరాయుల వారి ఆస్థానంలో పలు భాషల పండితులు ఉంటూ ఉండేవారు. కన్నడ, తెలుగు, సంస్కృతం, తమిళం వంటి పలు భాషలను ప్రోత్సహించారు. రాజు కనీసం ఎనిమిది భాషలలో ప్రావీణ్య కలిగి ఉండాలని రాయలవారు భావించేవారు. సంస్కృతం, ప్రాకృత, మగధి, చులిక, తెలుగు...వంటి భాషలను పేర్కొన్నారు.

విజయనగర సామ్రాజ్యం తర్వాత సుమారు రెండు శతాబ్దాల పాటు పాలించిన నాయకులు కూడా ఇదే విధమైన బహుభాషా విధానాలను అవలంభించారు. వారి కొలువులో తెలుగు, తమిళం, సంస్కృతం వంటి బహుభాషా పండితులు ఉంటూ ఉండేవారు. వారి కొలువులో ప్రదర్శించిన 'అన్నదాన మహానాటకం' అనే డ్రామాను తెలుగులో వ్రాసినా, తమిళం పదాలు కూడా ఉన్నాయి.

తంజావూర్‌లోని మరాఠా పాలకుల కొలువులో సహితం యక్షగాన, కురవంజి వంటి నృత్య నాటకాలను తమిళ్, మరాఠి, తెలుగు, సంస్కృతం అప్పుడప్పుడు ఇంగ్లీష్‌లో కూడా ప్రదర్శిస్తూ

ఉండేవారని పరిశోధకులు చెబుతున్నారు. పూదూరు సీతారామశాస్త్రి 1832లో ప్రచురించిన పెదబాలశిక్షలో పలు భాషల అక్షరాలు ఉన్నాయి. అంటే ఆ రోజులలో పాఠశాలల్లో బాలలకు ఒక భాషకన్నా ఎక్కువ భాషలను నేర్పుతూ ఉండేవారని తెలుస్తుంది.

మొగలాయి, బ్రిటిష్ పాలకులు సహితం స్థానిక భాషలలో పరిపాలన జరిపే ప్రయత్నం చేస్తుండేవారు. ఉదాహరణకు, మద్రాస్ ప్రెసిడెన్సీలో 1820 నుండి 1854 వరకు పనిచేసిన బ్రిటిష్ అధికారి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగులో వ్రాసిన "మిశ్ర భాష నిఘంటువు" గ్రంథంలో దక్షిణాది రాష్ట్రాలలో ప్రభుత్వ పాలన- ప్రధానంగా హిందువుల భాషలలో జరుగుతూ ఉండెడిదని తెలిపారు.

అంటే తమిళ్, తెలుగు, కన్నడి, మలయాళం, మరాఠ వంటి భాషలలో జరుగుతూ ఉండేదని పేర్కొన్నారు. ముస్లింలు హిందుస్తానీలో మాట్లాడుతూ ఉన్నా, స్థానిక భాషలో కూడా మాట్లాడే వారని చెప్పారు. తెలుగు భాషలో అనేక పెర్షియన్, అరబ్ పదాలు, తర్వాతి కాలంలో ఆంగ్ల పదాలు సహితం చేరాయని చెప్పుకొచ్చారు. అంటే ఇతర భాషలను ఇముడ్చుకోవడంలో భారతీయులు ఎంతో సహృదయులు అనే భావాన్ని వ్యక్తం చేశారు.

అయితే అప్పుడప్పుడు భాషలను బలవంతంగా రుద్దే ప్రయత్నాలు జరిగినా కవులు, రచయితలు తీవ్రంగా ప్రతిఘటిస్తూ వచ్చారు. ఒక సమయంలో సంస్కృతం అంటే ఉన్నత వర్గాల వారి భాష అని, తమిళం వంటి భాషలు 'నీచులు' మాట్లాడే భాష అనే ప్రచారం జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే స్వాతంత్ర్యం అనంతరం రాజకీయ ఆధిపత్యానికి భాషను సాధనంగా చేసుకొనే ప్రయత్నాలు జరుగుతూ ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

మొదటి సారిగా 1937లో రాజగోపాలాచారి మద్రాస్ ప్రెసిడెన్సీలో హిందీని నిర్బంధ భాషగా ప్రవేశ పెడితే పెరియార్, అన్నాదురై తదితరులు 'ఆత్మగౌరవ' పోరాటం జరిపి తీవ్రంగా ప్రతిఘటించారు. దానితో 1940 నాటికి ఆ ఉత్తరువును గవర్నర్ రద్దు చేశారు. 1950 ప్రాంతంలో భాష ప్రాతిపదికన రాష్ట్రం ఏర్పాటుకోసం పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం చెయ్యడం, దేశంలోని మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర ఏర్పడటం తెలిసిందే. ఆ తర్వాత 1960లో పంజాబ్ ఆ విధంగా ఏర్పడిందే.

రాజ్యాంగం తయారు చేసేటప్పుడు సహితం భాషా విధానంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. చివరకు మనం త్రిభాషా సూత్రాన్ని ఆమోదించాము. అయితే స్వతంత్ర పోరాటం సమయం నుండి హిందీని తమపై బలంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయాలు ఇతర బాషా ప్రజలలో బలంగా నాటుకొంటున్నాయి. అందుకు అనేక కారణాలు ఉన్నాయి.

వాస్తవానికి భాషాపరంగా హిందీ కన్నా తమిళ్, తెలుగు, బెంగాలీ వంటి భాషలు ఎంతో సాహిత్యపరంగా, ఇతరత్రా కూడా లోతైనవి. జాతీయ భాష పేరుతో ఇటువంటి చారిత్రక నేపథ్యం గల భాషలను కడతేర్చాలనే కుట్ర దాగి ఉన్నదనే అపోహాలు సహితం వ్యాపించాయి. హిందీ భాషను తమపై రుద్దే ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తున్న దక్షిణాది రాష్ట్రాలలోని హిందీ సినిమాలు విశేష ప్రాచుర్యం పొందుతూ ఉండటం గమనార్హం. అంటే ఇక్కడి ప్రజలకు భాషాభిమానమే గాని, దురభిమానం లేదని స్పష్టం అవుతుంది.



త్రిభాషా విధానానికి తూట్లు పొడిచింది హిందీ రాష్ట్రాలు కావడం గమనార్హం. ఈ విధానం ప్రకారం దక్షిణాది ప్రజలు హిందీని నేర్చుకొంటున్నా, ఉత్తరాది ప్రజలు దక్షిణాది భాషలను నేర్చుకున్న దాఖలాలు లేనేలేవు.

దానితో ఆయా ప్రాంతాల ప్రజలు భాష పేరుతో తమపై రాజకీయంగా, సాహిత్యపరంగా ఆధిపత్యం వహించే ప్రయత్నం చేస్తున్నట్లు అనుమానాలు నెలకొంటున్నాయి. పైగా, హిందీని జాతీయ భాషగా చేయాలని కోరుకొంటున్నవారు హిందీ భాష అభివృద్ధి కోసం చెప్పుకోదగిన కృషి చేయడం లేదని విమర్శలు కూడా నెలకొన్నాయి.

ప్రముఖ పాత్రికేయులు, బిజెపి ఎంపీగా పనిచేసిన కె ఆర్ మల్కాని 1977లో వారణాసిలో ఒక సభలో మాట్లాడుతూ "మీరు ఉత్తరాదివారు హిందీని జాతీయ భాష చేయాలని కోరుతున్నారు. కానీ, మీ భాష వికాసం కోసం మీరేమి చేస్తున్నారు? దక్షిణాదికి వెళ్ళితే హిందీ భాషలో రెండే రెండు చెప్పుకోదగిన గ్రంథాలు ఉన్నాయని ఎద్దేవా చేస్తున్నారు. అవి తులసి రామాయణం ఒకట యితే, రైల్వే టైం టేబుల్ మరొకటి" అంటూ చెప్పుకొచ్చారు.

1972లో పాట్నాలో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషద్ జాతీయ మహాసభలలో విద్యారంగంపై ఆమోదించిన తీర్మానంలో హిందీని జాతీయ భాషగా ప్రకటించాలని పేర్కొనడం పట్ల దక్షిణాది ప్రతినిధులు తీవ్ర నిరసన తెలిపారు. అందుకు తగిన సమయం రాలేదని స్పష్టం చేయడంతో ఆ వాక్యాన్ని ఉపసంహరించారు.

నేడు హిందీ మాట్లాడనిదే జాతీయ రాజకీయాలలో పట్టు సంపాదించలేమనే అభిప్రాయం నెలకొంది. అందుకనే కామరాజ్ నాడార్, ఆచార్య ఎన్జీ రంగా, నిజలింగప్ప వంటి నాయకులు తగు స్థానం పొందలేక పోయారు. వాస్తవానికి మహాత్మా గాంధీ కన్నా మరింత తీవ్రంగా శాసనోల్లంఘన తదితర ఉద్యమాలను దక్షి ణాదిన చేపట్టారు. కానీ వాటికి చరిత్రకారులు సహితం తగు ప్రాధాన్యం ఇవ్వడం లేదు.

ఇతరులతో పోల్చుకొంటే ప్రధానిగా దేవెగౌడ చాల సమర్ధవంతంగా వ్యవహరించారు. కానీ ఆయనను 'ఉత్తరాది' నేతలు సహించలేక పోయారు. పూర్తి బలం లేకపోయినా విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపిన పివి నరసింహారావు సహితం ఉత్తరాది నేతల నుండి ఎన్నో సవాళ్లు ఎదుర్కోవడం తెలిసిందే.

ప్రధాన మంత్రి పదవిపై కన్ను వేసిన నరేంద్ర మోదీ మొదటగా హిందీ ప్రజల విశ్వాసం చూరగొనే ప్రయత్నం చేశారు. అందుకనే వారణాసి నుండి పోటీ చేసారు. అంతేకాదు, 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా స్వతంత్ర దినోత్సవ ప్రసంగాన్ని గుజరాతీ భాషలో కాకుండా హిందీలో చేశారు. పైగా, తనప్రసంగాన్ని ఎనిమిది జాతీయ చానెల్స్‌లో లైవ్‌గా ప్రసారమయ్యేటట్లు చేశారు. ఒక ముఖ్యమంత్రి స్వతంత్ర దినోత్సవ ప్రసంగాన్ని ఎనిమిది జాతీయ టివి చానెల్స్ లైవ్‌లో ప్రసారం చేయడం మరెప్పుడు జరగనేలేదు.

నేడు కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలలో ఉత్తరాది వారే, ముఖ్యంగా హిందీ రాష్ట్రాల నుండి వచ్చిన వారి పెత్తనమే ఎక్కువగా కొనసాగుతూ ఉండటం ఈ సందర్భంగా గమనార్హం. ఢిల్లీలో తమను 'రెండో తరగతి' పౌరులుగా చూస్తుంటారని దక్షిణాదికి చెందిన పలువురు బీజేపీ నేతలు వ్యక్తిగత సంభాషణలలో అంటుంటారు.

భారత రాజ్యాంగం ప్రకారం మొత్తం 22 జాతీయ భాషలు ఉన్నాయి. కానీ హిందీ మినహా మిగిలిన భాషల అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఐ ఏ ఎస్, ఐ పి ఎస్ సర్వీస్‌లలో చేరిన వారు ఆరు నెలలలోగా తమకు పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్రంలోని భాషను నేర్చుకోవలసిందే. లేని పక్షంలో వారికి జీతాల పెంపు, ప్రమోషన్లు ఉండవు. అటువంటి నిబంధన గవర్నర్ వంటి రాజ్యాంగ పదవులకు ఎందుకు ఉండటం లేదు?

గతంలో ఉత్తరాదికి చెందిన రాజకీయ నేతలు ఎవ్వరు దక్షిణాది పర్యటనకు వచ్చినా ఆంగ్లంలో మాట్లాడే వారు. కానీ నేడు నరేంద్ర మోదీ, అమిత్ షా వంటి నేతలు అటువంటి ప్రయత్నం చేయడం లేదు. గతంలో బీజేపీ జాతీయ స్థాయిలో హిందీతోపాటు ఆంగ్లంలో కూడా పత్రికా ప్రకటనలు విడుదల చేస్తూ ఉండేడిది. కానీ ఇప్పుడు ఎక్కువగా హిందీలోనే విడుదల చేస్తున్నారు.

**దేశంలో అత్యధిక ప్రజలకు హిందీ మాతృభాష కాదు. ఒక విధంగా చూస్తే తెలుగుకు అట్టి హోదా లభిస్తుంది. కానీ రాజకీయ కారణాల వలన తెలుగు భాష అణచివేతకు గురవుతున్నది. ఇక్కడి రాజకీయ నేతల నిష్క్రియత కూడా అందుకు తోడవుతున్నది.**

హిందీ అధికార భాషగా ఉన్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో సహితం అక్కడి ప్రజలు మాట్లాడే భాషలు వేరే ఉన్నాయి. అవి–ఖడీబోలి, హర్యాన్వి, కనౌజీ, బుందేలీ, అవధి, ఛత్తీస్ గఢీ, బఘేలీ, సర్గ్యాజీ, మైథిలి, భోజ్‌పురి, మగధి, ఖోర్తా, నాగపురి, కుర్మాలీ, మర్వారీ, మాల్వి, నిమది. లంబాడీ, హరౌతి, గఢ్వాలి, గర్వాలి, బాగ్రీ, కుమౌనీ.

అనుసంధాన భాషగా ఒకదానిని అభివృద్ధి చేయవలసిందే. అందుకు హిందీకి అవకాశం ఉంది. కానీ ఆ విధంగా చేయడం వల్ల హిందీ ప్రాంత నేతలు తమపై రాజకీయంగా, సాంస్కృతికంగా ఆధిపత్యం వహించే ప్రయత్నం చేయరనే విశ్వాసం ముందు కలిగించాలి. తెలుగు రాష్ట్రాల విభజనలో నిర్ణయాత్మక పాత్ర వహించిన బిజెపి, కాంగ్రెస్ –ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాల విభజనకు పూనుకోవడం లేదే? ముందుగా ఉత్తర ప్రదేశ్‌ను నాలుగు రాష్ట్రాలుగా, బీహార్, మహారాష్ట్రాలను రెండు రాష్ట్రాలుగా విభజించి భాష అంశాన్ని తెరపైకి తీసుకు వస్తే నిజాయతి వ్యక్తం కాగలదు.

ప్రజలకు భాష ఆత్మ వంటిది. జాతీయ భాష పేరుతో ఇతర భాషల ప్రాధాన్యత తగ్గించే ప్రయత్నం చేస్తే దేశ సమగ్రత, అభివృద్ధిలకే ముప్పు వాటిల్లుతుందని గ్రహించాలి. **భిన్న భాషల సంస్కృతి మన బలం అని గుర్తించాలి. ఈ బహుభాషా సమ్మిళిత సాంస్కృతిక జీవనాన్ని గౌరవించుకొని, ఆదరించాలి.**

ధారావాహిక

నంద్యాల నారాయణ రెడ్డి
9360514800

# సాతంత్ర్రకాల సదువులు 5

**వన్నెవన్నె[redacted]**

“రేయ్ ఇసకలో రాత నేర్చిన వాళ్లము కదా, దానికనే ఇసకవాళ్లు అయి అనెంక ఇస్కోళ్లు అనే పేరు వచ్చుంటుంది రా”

“మడీ, ఇస్కూలు సరే, ఐస్కూలు అనే పేరు ఎట్లొచ్చెరా?”

“పెద్దపెద్ద అయ్యగార్లు ఉండే తావు కదా, అందుకే అయ్యస్కూలు అయుండచ్చు లేరా”

ఇట్లుండేవి మాటలు. ఎట్లో అదరాబదరా పదరా మొగుడా అన్నెట్ల మేమూ హైస్కూలోళ్లము అయిపోతిమి. ఇంగ్లీషులో మొదటి పాఠము మోహన్ అండ్ లారా వెంటు స్కూల్. చరిత్ర, భూగోళము, గణితము, విజ్ఞాన శాస్త్రము, తెలుగు వాచకాలు. లెక్కలూ డిక్టేషన్లూ రాసేకి పలకాబలపాలు. ఇవన్నీ పట్టేంత పెద్ద బ్యాగు.

పెన్సిలూ రబ్బర్లే కాకుండా కొత్తగా ఒక ఉక్కు కడ్డీ మా చేతికి వచ్చింది. దీన్లో ఒకపక్క సందు ఉంటుంది. ఆ సందులో ఉక్కుముల్లు (నిబ్) ను దూర్చి, సిరాబుడ్డిలో ముల్లును అద్ది అద్ది ఎత్తి రాయాల. అన్నింటినీ బ్యాగులో పెట్టుకొని, సిరాబుడ్డిని చేత పట్టుకొని, పదారు దిక్కులనింకా చిన్నోళ్లు దోవల్లో వస్తావుంటే, చూసేకి వెయ్యి కండ్లు కావాల. అందరూ మమ్మల్నే విచిత్రంగా చూస్తుంటారు. స్కూల్లో మాకు బెంచీలూ దస్కులూ కలిసే ఉంటాయి. ఒకో బెంచిలో నలుగురేసి కూకోవచ్చు.

ఇంకుమరకలు కాని చేతులో చొకాయిలో చడ్డీలో ఉండేవే లేదు. చాలనిదానికి ప్రశ్నల్ని రాసేదానికి రెడ్డింకు బుడ్డీలు అదనం. దానికి వేరేగా ఇంకో ముల్లు. మా బట్టలూ బ్యాగులూ మరకలతో నిండిపోయి, మేమంతా వన్నెవన్నెల సీతాకోక చిలకలంగా మారిపోయి ఉంటాము. బట్టల్ని ఎంత ఉతికినా, ఎలుకతోలు తెచ్చి ఎన్నాళ్లు ఉతికినా, అనే వేమన పద్యాన్ని గేపకం తెస్తా ఉంటాయి. పెద్దోళ్లనడికి కొత్తబట్టలు కొనిపించుకొనేది చానా కష్టం. అట్ల కొంటేనూ, అవి మాత్రం వన్నెవన్నెల పటాలు కాకుండా ఎన్నాళ్లుంటాయి! ఆ బట్టలతో ఊరికిపోతే, నారాయణ్ణారాయణ నక్కతోకా నారాయణ పెండ్లాము కుక్కతోకా' అని ఆడబిడ్డలు పాటపాడతా గేలి చేస్తారు. 'నువ్వేనా ఆ కుక్కతోక' అనేసి, మేము వాళ్ల లంగాల మీదంతా ఇంకు మరకలను చల్లుతుంటాము.

మా తరగతిలో వెంగటేశుడు అని ఒకడుండాడు. సరైన మంకు సాంబ్రాణి. ఇంగ్లీషు మేస్టరు, ఒక పద్యాన్ని ఎంత చెప్పించినా వాడికి రాలేదు. దెబ్బలు తింటా, ఏడుస్తా, గొన్నె (చీమిడి)ని ఉజ్జుకొంటా, 'జాకండు జిల్లు వెంగటపృది ఇల్లు' అనేదే వానిపని. 'అట్లకాదురా, జాక్ అండ్ జిల్ వెంట్ అప్ ది హిల్' అన్రాల్రా అని మేస్టరు నోరు కొట్టుకొన్నా అదేపాట. కడనీకి మేస్టరుకు ముందర వీడే రిటైరయిపోయె. స్కూలుని విడిచి వాళ్లబ్బ వ్యాపారమైన బోండాల అంగట్లో చేరిపోయె.

మాపుసరి నాలుగ్గంటలకు డ్రిల్లు మేస్టరొచ్చి, మమ్మల్నంతా ఆటబయలుకు తోడుకొని పోతారు. ఆ మేస్టరు బలంగా భీముడున్నెట్లు ఉంటారు. మీసాలు కొనలో పురితిరిగి ఉంటాయి. తెల్లచొకాయి పైన కాకీ నిక్కరు, దానిపైన బిగించిన దవాలు (బెల్టు). ఆయన్ని చూస్తేనే అదిరిపోతుంటాము. డ్రిల్లు మేస్టరు చెప్పినాడని పెద్దోళ్లకు చెప్పి, కేన్వాస్ బూట్లను తెప్పించుకొంటిమి. వాటిని తొడుక్కొని నూటయాభైమంది చిన్నోళ్లము రబ్‌రుబ్‌మని బయల్లో నడస్తా ఉంటే, బయలు చుట్టూ జనం మూగి వింతగా చూస్తుంటారు.

“గ్రౌండును నాలుగు రౌండ్లేసి రాండ్రా” అని డ్రిల్లు మేస్టరు అంటే చాలు, మేము దౌడు కొట్టేది. పల్లెలనింకా వచ్చిండే వాళ్లము నాలుగు చుట్లు చుట్టేసి వచ్చి, మేస్టరు ఎదురుగా నిటారుగా నిలబడితే, పేట చిన్నోళ్లు రెండుచుట్లకే సుస్తయిపోతుంటారు.

“రేయ్ చూడండ్రా పల్లెల చిన్నోళ్లని. ఊర్లల్లో కుందేళ్లనీ కుక్కలనీ తరిమి తరిమి, జింకల మాదిర సన్నగా ఉండారు. రాగి సంగటీ ఎర్రబియ్యమన్నమూ తిని గట్టిగా ఉండారు. మీరేమో ఇడ్లీలూ దోసెలూ ఉప్పిండీ తిని, పనిపాటూ లేకుండా గుమ్మడికాయట్లా గూదకాయలట్లా ఉండారు” అని పేట చిన్నోళ్లని తిడతా ఉంటారు మేస్టరు.

ఆటలూ పాఠాలూ వ్యాయామమూ పరీక్షలతో మా ఆరోతరగతి చదువు పూర్తయి, మంచి మార్కులతో ఫస్టుక్లాసులో పాసయిపోతిమి.

**తికమక మకతిక :**

“బిడువుల్లో విచ్చలవిడిగా మజా చేసి చదువుల్ని మరిచిపోతారు. ఒక పద్దినాలు పెట్టుకోని, తిరిగి ఇక్కడికే పంపేయండి, ఏడో తరగతి పాఠాలను ఆరంభం చేసేస్తాను” అని మా పెద్దోళ్లని ఎచ్చరిక చేసి, మమ్మల్ని ఊరికి పంపిరి గురువుగారు.

ఊర్లోకి అజ్జుల పెడతానే ఆశ్చర్యపోతిమి మేము. ఊర్లో అక్కడక్కడా 'వాడా పోడా' అనే అరవ మాటలు వినబడతా ఉండాయి. 'అరవమంటే ఎట్లుంటుంది రా, పేటలో సదవతా ఉండారు కదా మీకు తెలిసుంటుంది' అని మమ్మల్ని అడగతా ఉండిన ఊర్లో ఇప్పుడు అరవం మాటలు. ఆశ్చర్యమే కదా!




బిరబిర ఇంటితట్టుకు నడిచిపోయి, కాళ్లూ చేతులూ మొకమూ కడుక్కొని, ఉడుకుడుగ్గా అంత ముద్ద తింటిమి. అనెంక తెలిసింది ఆ అరవమాటల గుట్టు.

మేము పేటలో ఆరో తరగతి చదవతా ఉన్నెపుడు, మా వూరికి ఒక అరవాయన వచ్చెనంట. ఆయనది మానుల వ్యాపారమంట. మానుల్ని కొని, వాటిని నరికించి, తుండ్లుగా కోయించి, బొగ్గులుగా కాల్చి, ఆ బొగ్గులను పేటలకు తోలి అమ్మేది ఆయన పనంట. ఊరికి వచ్చిన కొత్తల్లో పనిముట్లు కూడా లేకుండా కట్టుబట్టలతో ఒకడే వచ్చెనంట. 'పాపం, ఆయప్పది దిగువ సీమంట (హోసూరు కాక మిగిలిన తమిళనాడు). బతకలేక మనూరికి వచ్చిండాడు' అని మావూరోళ్లు, ఆయప్పకు పనిముట్లిచ్చి, పనిలో సాయంచేసి, పూటకొక ఇంట్లో భోజనం పెట్టి ఆదుకొనిరంట. అనెంక అనెంక బొగ్గులమ్మిన దుడ్లతో పనిముట్లను కొనుక్కొని, వాళ్ల ఊరితావ ఉండిన పెండ్లాం బిడ్డల్ని తోడుకొని వచ్చి, మా వూర్లోనే ఒక ఇల్లు తీసుకొని కాపురముండాడంట. ఇదీ మా పెద్దోళ్లు చెప్పిన సమాచారము.

మా జతగాళ్ల దగ్గరకు పోతే ఇంకింత సమాచారము చిక్కింది.

"రేయ్, ఆయన పేరు సెంగోడన్ అంట. వాళ్ల ఊరు దిగువసీమలో ఉండాదంట. మదుర అని పెద్ద పేటంట. దానిని దాటుకోని ఇంకా దచ్చినంగా పోతే బిరుదునగరమని చిన్నపేట వస్తాదంట. దానికి దగ్గర్లోనే చిన్నమనూరు అనే పెద్ద గ్రామమంట. చిన్నమనూరుకు ఆనుకొనే బురుగుల పట్టి అనే చిన్నపల్లె వాళ్లదంట" ఒకడు చెప్పినాడు.

"ఇంకా ఏడెనిమిది నెలలు కూడా కాలేదు వాళ్లు వచ్చి. వాళ్లకేమో న్యాయముగా తెలుగు వస్తాలేదు. ఊర్లో అందరికీ అంతోయింతో ఆ అరవము వచ్చేసింది" ఇంకొకడి మాట.

"అయ్యో, ఆ ఇద్దరు బిడ్డల ఇస్కూలు కతను చెప్పేదొద్దు. ఆడబిడ్డ నాలు గోతరగతి, చిన్నోడేమో రెండు. ఇస్కూల్లో మేస్టరు మొకము చూసేదే వాళ్లపని. తెలుగు వాళ్లనోళ్లలో తిరిగితే కదా. నీ పేరేమి అంటే, సీదా అంటుంది, సీదా కాదే సీత అనవే అంటే పలకలేదు. చిన్నోని పేరు మోగన్ అంట. మోహన్ అని పలు కరా అని నూరుసార్లు చెప్పినా, మోగన్ అనే అంటాడు" మరొకని పలుకు.

"వాళ్లకు, మేస్టరు పాఠం చెప్పే నపుడు చూడాల. ప్రహ్లాద అనమంటే పిరు కులాదా అంటారు. వాళ్ల నోళ్లలో బాబర్ పాపర్ అయిపోతాడు. జహంగీర్ సగం గీరు అయిపోతాడు. మేస్టరు పాట్లు పడరా నివి" నాలుగోవాడు.

"సెంగోడన్నకి ఎంగ్రేటు (వెర్రి వెంగళి) సెంగోడన్ అని మనోళ్లు అడ్డపేరు కూడా పెట్టేసుండారు" ఐదోవాడు.

అందరి మాటల్ని వింటాఉండే నాకయితే ఎపుడెపుడు వాళ్లను చూద్దామా అనిపిస్తా ఉంది. అదే మాటను నా జతగాళ్లతో అంటిని. అయితే పద ఎంగ్రేటన్న వాళ్లింటికి పోదాము అంటా దారి తీసిరి. వాళ్లింటికి పోయినంక నన్ను వాళ్లకి పరిచయం చేసిరి. అందరమూ సెంగోడన్న చుట్టూ కూకొంటిమి.

"అనా మన ప్రైమ్మినిస్టరు ఎవురన్నా" ఒకడు అడిగె.

"మన పిరదమ మందిరి దానే (ప్రథమ మంత్రే కదా), నేరు (నెహ్రూ) అన్నాడు. నాకు నగవొచ్చింది కానీ ఆపుకొంటిని. మవుంట్ పేడన్ (మౌంట్ బ్యాటన్), విగడోరియా మగరాణి (విక్టోరియా మహారాణి), పిరగాసం పందులు (ప్రకాశం పంతులు) అంటా ఉంటే ఇంక నగవును ఆపుకొనేకి కాలేదు. అంతలోనే సెంగోడన్న కూతురు సీదా వచ్చింది. మమ్మల్ని చూసి "గాందా, బదుమా, సంగర్, సవుందలే (కాంత, పద్మ, శంకర్, సౌందర్య) రండ ఆట్లాడేకి అని పిలిచింది. "పోదాములే రా కూకో" అని కూకోబెట్టి, "మీ ఇస్కూల్లో చిన్నోళ్ల పేర్లు చెప్పు" అని అడిగిరి మా వాళ్లు. "కీదా, సాందా, కోబి, పిరబాగర్, పిరదీవు, పిరగాసు, సత్తియ, పిరియ, విత్తియ, సందియ, బెత్తన్న" అని వరసపెట్టి చెప్పేసింది. గీత, శాంత, గోపి, ప్రభాకర్, ప్రదీప్, ప్రకాశ్, సత్య, ప్రియ, విద్య, సంధ్య, పెద్దన్నలు ఆ అరవనోట్లో అల్లాడిపోయిరి. "నటన మనోహర శివ శంకరా" అని పాడమంటే "నదణ మణోగర సివ సంగరా" అని పాడింది. ఇంక నగకుండా ఎట్లుండేది?

మా న్యాతరెడ్డికయితే సెంగోడన్న వాళ్లంటే చానా కోపము. 'న్యాతరెడ్డి' అనేది నోరు తిరగక, 'నీయాతు రెడ్డి' అని పిలుస్తుంటే

**కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!**

కోపం రాకుండా ఉంటుందా!

ఆ అరవ అక్షరాలూ అంతే, క,గ, లకు రెండిటికి ఒకే అక్షరం; ట,డలకు ఒకటే; త,దలకు ఒకటే; ప,బ,లకు ఒకటే; శ అనే అక్షరమే లేదు; జ,స,ష,హ అక్షరాలుండినా వాటిని వాడకూడదంట. జ,స లకు కూడా చ అక్షరమే. 'హ' ను 'గ' అని పలికి 'క' రాస్తారు. మా తట్టు ఉండే తెలుగు పేర్లను చానా వాటిని అరవంలో రాసేకే రాదు. పుట్టారెడ్డికి బుడ్డారెడ్డికీ ఒకే అక్షరాలు. ముత్తన్న ముద్దన్న ఒకటే. కిట్టన్నకూ గిడ్డన్నకూ తేడాలేదు. పాల్‌రాజో బాల్‌రాజో చదివి తెలుసుకోలేము.

ఈ తికమకల మకతికల అరవాన్ని, మేము ఒకే వారంలో నేర్చుకొనేసి, ఎంగ్రేటన్నకి సెలవు చెప్పేసి, పేటలోని గురువుగారింటికి పయనమైతిమి.

**కొండకడుపులో వింత :**

1955, జూన్ నెల వచ్చేసింది. స్కూళ్లన్నీ నిద్రలేస్తా మెల్లమెల్లగా ఆవలిస్తున్నట్లు తరగతులు ఆరంభమాయె. మేమూ స్కూలు ఫీజులు కట్టి ఏడోతరగతిలో చేరితిమి. నెలకు ఏడు రూపాయల ఫీజు కట్టాల. ఏడాదికి సుమారు డెబ్బై రూపాయలు. ఫీజు దుడ్లూ, కొత్త పొత్తాలు, రాతపొత్తాలు, బట్టలు, బ్యాగులూ, పెన్సిల్లూ, ఉక్కు కడ్లూ, సిరాబుడ్లూ అన్నీ కలిసి మా పెద్దోళ్లకు తడిసి మోపుడవుతుంది. చిన్నోడిని స్కూలుకు పంపాలంటే ఒక ఆవునో రెండు గొర్రెల్నో అమ్మాల.

హోసూరులో ఉండే మా స్కూలుకు చుట్టూ ఏడెనిమిది మైళ్లనింకా చిన్నోళ్లు వస్తుంటారు. చాలామంది నడిచే వస్తారు. పెద్ద తరగతుల వాళ్లు కొందరు బైసికిళ్లలో వస్తారు. కొన్ని పల్లెల్లో పదిమంది వరకూ స్కూలు చిన్నోళ్లు ఉంటారు కదా, అట్లా ఊర్ల పెద్దోళ్లు అందరూ కలిసి ఒక ఎద్దులబండిలో చిన్నోళ్లను పంపిస్తుంటారు. స్కూల్లో బైసికిళ్లను నిలిపే నిలుకు (స్టాండ్), బండ్లను నిలిపే తావు ఉండాయి. కానగమాన్ల నీడన పణుకొని, మాకు మేస్టర్లు చెపుతుండే పాఠాలను అవి కూడా వింటా నెమరేస్తా ఉంటాయి ఎద్దులు. దూరం నింకా నడిచి వచ్చే వాళ్ల పేర్లు మేస్టర్ల దగ్గర ఉంటాయి. వాళ్లని మాపుసరి నాలుగ్గంటలకే పంపేస్తారు.

"మన హోసూరుకే ఒక మణిమకుటమురా తూర్పున ఉండే ఈ కొండ. భక్త జన వరదుడైన చంద్ర చూడేశ్వరుడూ పార్వతీదేవి కలిసి వెలసిన కొండ ఇది. వీర భక్త హనుమంతుడు, బండాంజనేయునిగా నెలకొన్న కొండ ఇది. అప్పుడప్పుడూ ఇక్కడకు వచ్చి, ఆ దేవుళ్లని దర్శనం చేసుకొని, ఈ మానుల నీడన కూకొని చదువుకోండి" అని గురువుగారు చెప్పిరి ఒకసారి. అప్పటినింకా ఆయిత్తారం (ఆదివారం) వస్తే చాలు, తరగతి పొత్తాలను చేత పట్టుకొని కొండమీదకు వచ్చేస్తుండాము.

ఒకనాడు ఒకవింతను చూస్తిమి. కొండలో పడమరతట్టు ఒక గవి (గుహ) ఉంది. ఆ గవి దగ్గర కూకొని ఉండాము. మా ఈడువాళ్లే ఒక పదిమంది చిన్నోళ్లు ఆ గవిలోనింకా బయటికి వచ్చిరి. అలసట తీర్చుకొనేకి అన్నట్లు మాకు దగ్గరలోనే వచ్చి కూకొని, గది లోపలి వింతలను గురించి చెప్పుకొంటా ఉండారు. మాకు ఆశ్చర్యమనిపించి, వాళ్లతో మాటలు కలిపితిమి.

"అవును, లోపల శివలింగాలు ఉండాయి. లోగాకి పోయే దోవ చానా ఇరుకు. సన్నగా ఉండేవాళ్లు మాత్రమే పోయేకి అవుతుంది. దోవను బద్రంగా గుర్తుపెట్టుకొంటా పోవాల. కావాలంటే వచ్చే ఆయిత్తారం నాడు రండి, మీరూ చూడచ్చు" అనిరి. మాకైతే చెప్పలేనంత ఆశ్చర్యమూ ఆసక్తీ కలిగింది. చూసి తీరాలనే తీర్మానించుకొంటిమి. ఎప్పుడెప్పుడు వారం గడిచిపోతుందా అని ఎదురు చూసి ఎదురుచూసి, ఆయిత్తారం వస్తానే కొండ తట్టుకు ఉరికితిమి.

వాళ్లు ఐదుగురు వచ్చిండారు. మేము ఐదుగురము. వాళ్ల చేతుల్లో మైనం వత్తులూ అగ్గిపెట్టెలూ బ్యాటరీ లైటూ బొరుగులూ చెనగపప్పు చాక్ పీసులూ కర్పూరమూ సాంబ్రాణి కడ్లూ ఉండాయి. గవి ముందు అందరమూ మాట్లాడుకొంటిమి. బ్యాటరీనీ మైనం వత్తుల్నీ వెలిగించుకొని వాళ్లు ముందుగా దూరి, మమ్మల్ని వెనక రమ్మనిరి. పదిమందిమీ వరసగా సొరంగంలో పోతుండాము. కొంచెం దూరం పోతానే సొరంగం ఎత్తు తగ్గిపోయింది, మేము వంగి నడిస్తిమి. ఇంకొంచెం సేపటికి కూకొని నడిస్తిమి, అనెంక నాలుగు కాళ్లమీద పోతిమి, రవంత దూరం పణుకొనే బరికితిమి. ఇట్ల సుమారుగా 250 గజాలు పోతిమి. ఆశ్చర్యం, పదిమంది పెద్దోళ్లయినా నిలబడగలిగినంత పెద్ద గవికి చేరుకొంటిమి. గవికి నట్టనడుమన, ఒక అడుగెత్తు పానవట్టం మీద, అడుగెత్తు శివలింగం. ఆశ్చర్యంతో మా ఒళ్లు గగురు పొడిచె. శివలింగం దగ్గరికి పోయి సాంబ్రాణి కడ్లూ కర్పూరమూ వెలిగించి దండం పెడితిమి.

అక్కడ భీతి పుట్టించే ఇంకొక వింత. మేము ఇంత వరకూ దూరి వచ్చిన సొరంగం ఏదో తెలియనట్లుగా నాలుగు పక్కలా నాలుగు సొరంగాలు. కొత్తగా పోయిన మాకు దిగులుతో తల తిరిగినట్లయింది. ముందు వచ్చినవాళ్లు చాక్‌పీసుతో గీతలూ గీసుకొంటూ బొరుగులు చల్లుకొంటా రాకపోయుంటే, మేము ఏదో సొరంగంలో దూరి, ఎక్కడెక్కడికో చేరుకొని, కొండ కడుపులోనే ఉండిపోయుండే వాళ్లం.

"దిగులు పడద్దు, ఇంకా ముందు ఇంకొక శివలింగముంది, అక్కడికంటా పోయేసి వద్దాం రండి" అని వాళ్లు ఎదురుగానే ఉండే ఒక సొరంగంలోకి దూరిరి. దిగులు దిగులుగానే వాళ్ల వెనక మేమూ దూరితిమి. మళ్లా మేము దేకుతా పాకుతా బరుకుతా ఇంకంత దూరం పోతిమి. ఇంకో విశాలమైన గవీ, నట్టనడుమ శివలింగమూ, నాలుగు పక్కలా మళ్లా నాలుగు సొరంగాలు. అక్కడ కూడా దండం పెట్టుకొని, గుర్తుల ప్రకారం వెనక్కి తిరిగి అట్లే బయటికి వస్తిమి. మా బట్టలకూ ఒంటికీ మెత్తుకొనుండే పాచినీ తోలుగువ్వల (గబ్బిలాల) పియ్యనూ కడుక్కొని ఇండ్లకు చేరుకొంటిమి. అంతుపట్టని ఆ కొండ కడుపులో ఇంకెన్ని సొరంగాలూ శివలింగాలూ ఉండాయో!

**( తరువాయి వచ్చే సంచికలో...)**

**పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పే**

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

# నేల విడిచిన సాములు!!

ఇప్పుడు అమల్లో ఉన్న విద్యావిధానం గురించికానీ, అమ్మ భాష ఆంగ్ల భాషల బోధనా విధానాలను గురించికానీ కాదు నేనిప్పుడు చెప్పదలచుకొన్నది. అక్కడ పని చేస్తున్న బాధ్యతాయుతమైన ఉపాధ్యాయుల గురించి!!

ముప్పై యేళ్లకు ముందు పాఠశాల, కళాశాలల (కళా శాల అనే పేరెందుకు పెట్టారో పిసరంత ఆలోచించండి) దినోత్సవం కావచ్చు,స్వాతంత్ర దిన కార్యక్రమం వగైరాలు కావచ్చు...దాదాపు నెలా, రెండు నెలలకు ముందే ఒక పద్ధతి మేర పిల్లల వయస్సు, మనస్సు, ఆ ప్రాంతపు సమస్యలు, సంఘటనలను ఆధారం చేసు కొని చిన్న నాటికలు, గేయాలు, ఏక పాత్రాభినయాలు, అభిన యాలూ, కోలాటలు, చెక్క భజనలూ తయారు చేసి చిత్తశుద్ధితో తరిఫీదిచ్చి ప్రదర్శనలు పిల్లల చేత చేయించేవారు.

అప్పటి ఉపాధ్యాయులు కేవలం ఐదునుంచి ఏడవతరగతి మాత్రమే చదివి- ప్రాథమిక పాఠశాలకు, ఉన్నత పాఠశాల స్థాయివారు- ప్రాథమికోన్నత బడులకు, డిగ్రీ చదివి ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారు- ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులుగా ఉండేవారు. వారికి ఇప్పట్లా రకరకాల పుస్తకాలు కానీ, అంతర్జాలంలో దేనినైనా వెతుక్కొనే వెసలుబాటుకానీ ఉండేవికావు. అయినా శ్రమ తీసుకొని పిల్లల లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేసేవారు.

అయితే ఇప్పుడు కళాశాలలు, ఉన్నతపాఠశాలల్లోనే కాదు ప్రాథమిక పాఠశాలల్లోనూ పీజీలూ, పీహెచ్ డీలూ చేసినవారు ఉపాధ్యా యులుగా పని చేస్తున్నారు. వారి బోధన ఎలావుందో చెప్పడం కాదు ఇక్కడి విషయం. కళలు,మన సాంస్కృతిక, భాష, స్థానిక పదజాలం వగైరాల గురించి వారి అవగాహన, విద్యార్థుల స్థాయికి తగ్గట్టు ఎలా కృషిచేస్తున్నారన్నది చర్చ.

ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన తరువాత నేను ఈ మధ్య చాలా కళాశాలలకూ, ఉన్నత పాఠశాలలకూ వెళుతున్నాను. ఎక్కడకూడా విద్యార్థుల ప్రతిభ కనిపించడం లేదు. కార్యక్రమంలో ప్రార్థన మొదలుకొని ఏక వ్యక్తి నృత్యాలూ, గుంపుగా కలిసి పాడే పాటలూ... ఒక్కటేమిటి ప్రతిదాన్నీ పెన్‌డ్రైవ్‌లో నింపి మైక్‌సెట్‌లో కుక్కి, అది పాడుతుంటే దానికి తగ్గట్టుగా ఎగరడం!! ఆ అభిన యాన్ని చూస్తూ ఎదురుగా కూర్చున్న వారంతా ఈలలు వేస్తూ ఊగడం!!

ఆ పాటల్లో వారు నివసిస్తున్న సమాజం ఉండదు. దానిని రాసిందొకరు, పాడింది వేరొకరు, సంగీతం సమకూర్చింది ఇంకొకరు, ఇంత హంగామా, అవకాశం కల్పించిన యంత్రపరికరాలు ఇతర్లవి!! అంతే కాదు. ఆ పాటకు సినిమాలో ఎటువంటి రంగుల హంగుల దుస్తులు, అతికొత్త ధగధగల ఆభరణాలూ ధరించారో, వాటినే అద్దెకో మరేరకంగానో తెచ్చుకొని, అందులో చేసినట్లే అంగాంగాన్ని వంచుతూ, చించుతూ వెకిలి చేష్టలు!!

ఇటువంటి ప్రదర్శనలో ఉపాధ్యాయుల, విద్యార్థుల ప్రతిభ ఏ రకంగా కనిపిస్తుంది?? నాకు తెలిసి ఇక్కడ ప్రధానోపాధ్యాయుల ఉపాధ్యాయుల సోమరితనమే ఎక్కువగా కనిపిస్తుంది. ఏమాత్రం సమాజ అవగాహన లేదు!! ఇటీవల గిడుగురామ్మూర్తిగారి పుట్టిన రోజును తెలుగుభాషా ఉత్సవంగా జరుపుకొన్నారుకదా!!

ఆ రోజు చాలా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు భగవత్ గీతలోని శ్లోకాలు వల్లెవేయడంలోనూ, సుభాషితాలూ, వ్యాక రణ సూత్రాలు, పద్యాలు చెప్పడంలో పోటీలూ...భువనవిజయ ప్రద ర్శన, అష్టావధానాలు చాలా ఆర్భాటంగా నిర్వహించారు.

నిజంగా చెప్పాలంటే గిడుగువారు పై వానికంతా వ్యతిరేకం!! ఆయా ప్రాంతాల్లోని పిల్లలు ప్రతినిత్యం ఇళ్లల్లో కుటుంబసభ్యులతో మాట్లాడే స్థానిక పదజాలంతోనే చదువులు చెప్పాలి. వారు సహజంగా అమ్మ పాలతో సహా ఒంటబట్టిచ్చుకొన్న భాషను కాదని ఉపాధ్యా యులు తాము నేర్చిన కృతక భాషను వారి నెత్తి మీద రుద్దరాదు. చెప్పాల్సింది విషయం మాత్రమే (sabject only). వారి మనోభావాల్ని అక్షరాలుగా తప్పులు లేకుండా రాయడము చేస్తూ, వ్యతిరేక, అసహ్యం అర్థాల వంటివి ఉంటే వాటినీ, ఉచ్చారణా దోషాలను సవరించడం. మూఢనమ్మకాలవంటి వాటిని పారతోలడం మాత్రమే!!

పూర్తి వ్యాపార మయమైన సినిమాల్ని ఆదర్శంగా చేసుకొని మన రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లోని జీవనవిధానాన్ని, పదజాలాన్నీ, సంస్కృతినీ,ఆచారవ్యవహారాల్నీ, అలవాట్లనీ, వేషధారణనీ విధ్వంసం చేస్తూ యువత అంతా తయారవుతున్నది. అట్లని మార్పును వ్యతిరేకిం చడం కాదు. సమాజం పరిణామశీలి. అది క్రమంగా కాలాను గుణంగా రావాలి. అనుకరణలకు పోయి అభాసుపాలవుతున్నది. ఈ నేల విడిచిన సాముకు తల్లిదండ్రులూ ఉపాధ్యాయులే బాధ్యులు!! నియమబద్ధంగా విద్యార్థుల వృద్ధికి కృషిచేస్తున్న ఉపాధ్యాయులు లేరని కాదు. వారికి వందనాలు. అలా చేయని చాలా ఎక్కువ మందిని గురించే నా ఆవేదన)

**తెలుగులో రాయలేని, రాయని అధికార్లను నిలదీయండి**

డా॥ జి. వెంకటేశ్వరరావు
9491457496

## విక్రమసింహపురి కీర్తి ప్రతిష్ఠలను పతాకస్థాయికి తీసికొని వెళ్ళిన చరిత్రకారుడు

# ఒంగోలు వెంకటరంగయ్య



చరిత్ర పరిశోధనలో అనన్య సామాన్యమైన కృషి చేసిన వ్యక్తి – ఒంగోలు వెంకటరంగయ్య. వీరు 1867 అక్టోబరులో నెల్లూరులో జన్మించారు. వీరు మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో బి.ఏ., బి.యల్. చదివారు. కొంతకాలం మద్రాసులో రిజిస్ట్రారుగా పనిచేశారు. తరువాత నెల్లూరు వచ్చి వకీలు వృత్తిని ప్రారంభించారు.

వీరు గ్రీకు, లాటిన్, ఫ్రెంచ్, అరబ్బీ, ఉర్దూ భాషలను నేర్చుకొన్నారు. సంస్కృతం, హిందీ భాషలలో ప్రావీణ్యం సంపాదించారు. ప్రాచీన, మధ్యయుగముల నాటి అనేక శాసనములను చదివి, వాటి మీద పరిశోధన చేసి, అనేక చారిత్రక విషయములను గ్రహించి అనేక వ్యాసములను వ్రాసినారు.

వెంకటరంగయ్య భరత నాట్య శాస్త్ర గ్రంథానికి, తాండవ లక్షణము అను గ్రంథానికి చక్కని ఉపోద్ఘాతములను ఆంగ్లంలో వ్రాశారు. భరతనాట్య శాస్త్రంలోని నాలుగవ అధ్యాయమైన తాండవ లక్షణమును ఆంగ్లభాషలోనికి అనువదించారు. రామాయణ విమర్శనము అనే గ్రంథమును, అనేక చారిత్రక గ్రంథములను, పరిశోధనాత్మక వ్యాసములను రచించారు. భారతి, గృహలక్ష్మి, త్రిలింగ, మొదలగు పత్రికలకు వ్యాసములు వ్రాసినారు.

వెంకటరంగయ్య స్వాతంత్ర్య ఉద్యమకాలంలో ప్రారంభమైన ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమకాలంలోనే మాంటెగు – ఛెమ్స్‌ఫర్డ్ వద్దకు వెళ్ళిన రాయబారుల బృందంలో వీరు కూడ ఉన్నారు. వీరు నెల్లూరు జిల్లా కాంగ్రెసు సదస్సులలో పాల్గొన్నారు. "కొందరు నెల్లూరు గొప్పవారు" అనే గ్రంథమును రచించారు. నెల్లూరు జిల్లాలోని ప్రసిద్ధ పండితులు, స్వాతంత్ర్య సమరయోధులు, కళాకారులను గురించిన వ్యాసములు ఇందులో ఉన్నాయి.

నాట్య శాస్త్రంల, శిల్పశాస్త్రంల, సాహిత్యంలో వారు రచించిన వ్యాసములు భారతి, త్రిలింగ, గృహలక్ష్మి, స్ఫూర్తి, శక్తి మొదలగు పత్రికలలో ప్రచురింపబడినవి. అప్పుడు అన్నామలై విశ్వవిద్యాలయ ఆచార్యులు – బి.వి.నారాయణ స్వామినాయుడు, పి.యస్.నాయుడు – చిదంబర దేవాలయ శిల్పాలపై ఒక పెద్ద గ్రంథాన్ని వ్రాయాలని అనుకున్నారు. అయితే వారికి నాట్యశాస్త్రం శ్లోకములకు ఇంగ్లీషులో వ్యాఖ్యానం అవసరమైంది. అందుకోసం తమ విద్యార్థి అయిన యన్. యస్. కృష్ణమూర్తిని వెంకటరంగయ్య వద్దకు పంపినారు. వెంకటరంగయ్య ఆ శ్లోకములకు ఆంగ్ల భాషలో వివరణను వ్రాసి పంపినారు. అది తర్వాత ఆంగ్లంలో "తాండవ లక్షణం" అనే పేరుతో గ్రంథంగా ముద్రింపబడింది.

న్యాయవాద వృత్తిలో బాగా రాణించారు. కానీ ఈ వృత్తిలోని దళారీ విధానం వారికి నచ్చలేదు. దీనివల్ల లా ప్రాక్టీసు తగ్గింది. చివరి రోజులలో ఋణగ్రస్తుడైనాడు. వీరు రంగనాథస్వామి దేవాలయ ట్రస్టీగా వెంకటగిరి రాజా హైస్కూలు పాలకవర్గ కమిటీ సభ్యునిగా ఉండినారు.

1919లో నెల్లూరులో జరిగిన ప్రావిన్షియల్ కాన్ఫరెన్స్ (రాష్ట్రీయ సదస్సు)లో వీరు చేసిన స్వాగతోపన్యాసం సర్.సి.పి.రామ స్వామి అయ్యర్‌లాంటి మేధావుల ప్రశంసలను పొందినది.

వెంకటరంగయ్య చరిత్ర పరిశోధకునిగా బాగా రాణించారు. అనేక శతాబ్దాల చరిత్ర కలిగిన సింహపురి పట్టణాన్ని గురించి పరిశోధించి అనేక వ్యాసములను వ్రాసినారు. ఇవన్నీ "పాతకాలపు నెల్లూరు" అనే పుస్తక రూపంలో వచ్చాయి. యన్. యస్.కృష్ణమూర్తి తాను రచించిన ''ఆంధ్ర డ్యాన్స్&కల్చర్'' అనే గ్రంథానికి ముందుమాట వ్రాస్తూ, "ఈ గ్రంథాన్ని వ్రాయడానికి తన గురువు అయిన ఒంగోలు వెంకటరంగయ్య పుణ్యమేనని" ప్రస్తుతించారు. వేదం వెంకటరాయశాస్త్రి "ప్రతాపరుద్రీయం" అనే జాతీయ భావాన్ని కలిగించే నాటకమును వ్రాయగా, ఒంగోలు వెంకటరంగయ్య ఈ నాటకానికి దర్శకత్వం వహించి ప్రదర్శింప చేశారు.

వెంకటరంగయ్య మంచి విమర్శకుడు, అనేక ప్రాచీన శాసనాలను పరిష్కరించినారు. శాసన లిపి శాస్త్రవేత్తగా కూడా పేరుగాంచినారు. నాట్యశాస్త్ర లక్షణకర్తగానూ రాణించారు.

**స్పందనను వ్రాయండి**

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి'**,
జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ–520 004.
ఇ–మెయిల్ : *editorammanudi@gmail.com*

ధారావాహిక

# జోగిని మంజమ్మ ఆత్మకథ




కన్నడ మూలం

డా. చంద్రప్ప సొబటి

అనువాదం

రంగనాథ రామచంద్రరావు

90597799289


( గత సంచిక తరువాయి...)

### నా తాళిని నేనే కట్టుకున్నాను

ఆ రోజు హొసపేట తాలూకా హులిగి గ్రామంలోని సుప్రసిద్ధ హులిగమ్మ దేవస్థానంలో నేను 'జోగమ్మ దీక్ష' తీసుకున్నాను. నేను జోగమ్మగా దీక్ష తీసుకున్న కాలంలో పూజారులే జోగమ్మ దీక్ష ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు ఆ పద్ధతిని ఆపేశారు. వాళ్ళు ఆపారు అని అనటంకన్నా ప్రభుత్వం అలాంటి పద్ధతిని నిషేధించిందని చెప్పాలి. హులిగిలో మాత్రమే కాదు. సవదత్తి మొదలైన దేవస్థానాలలోనూ ఆపేశారు. పూజారులు ఇస్తున్న జోగమ్మ దీక్ష నిలిపిన తరువాత ఎవరైనా జోగమ్మలు కావాలనుకుంటే అలాంటివాళ్ళు వృద్ధజోగమ్మల సమక్షంలో దీక్ష తీసుకుంటారు. ఈ పద్ధతిలో దీక్ష తీసుకున్నవారికి పూజారుల చేత ముత్తెపుదండను కట్టించుకున్నంత గౌరవాన్ని పొందలేరు. ఈ మధ్యన దేహంలో నాలా మార్పులు చెందినవారు జోగమ్మలుగా మారడానికి ఇష్టపడటంలేదు. అలా జోగమ్మలు కాకుండా ఉన్నవారిలో కొందరు అనేక అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతుంటారు. అలాంటి వార్తలు మీరు పత్రికల్లో గమనించేవుంటారు. దైవస్వరూపులైన జోగమ్మలు అనైతిక పనులు చేయటం అసాధ్యం. వాళ్ళల్లో భయభక్తులు, ప్రజలపట్ల ప్రేమాభిమానాలు, నీతినియమాలు వేధిస్తుంటాయి.

నాకు హులిగమ్మ పూజారులే దీక్ష ఇచ్చారు. ఆ సందర్భంలో అనేక ఆచారాలను పాటించే సాంప్రదాయం జోగమ్మల సంస్కృతిలో ఉంది. ఆ ఆచరణల కోసం అయిదుమంది వృద్ధ జోగమ్మలను పిలిపిస్తారు. వారి ఎదుట ఆ రోజు దేవస్థానం ముందు భాగంలో ప్రవహించే తుంగభద్ర కాలువలో స్నానం చేయాలి. నేనూ స్నానం చేశాను. స్నానం చేసి బయటికి వచ్చినపుడు వృద్ధ జోగమ్మలు మొలతాడును తెంచివేయాలన్న పారంపరిక సంప్రదాయముంది. నా మొలతాడును నా మేనమామ 'గాందెమ్మ జోగమ్మ' తెంచాడు. ఎవరు మొలతాడును తెంచుతారో వాళ్ళు మాకు తల్లితో సమానం. వాళ్ళను 'అమ్మా' అని పిలవాలనే పారంపరిక పద్ధతి మాలో ఉంది. అయితే నేను మామయ్యను ఎన్నడూ 'అమ్మా' అని పిలవలేదు. అయితే ఆయన చనిపోయిన తరువాత ప్రతి సంవత్సరం చనిపోయిన రోజున ఒక చీర, జాకెట్టు సమర్పిస్తాను. ఇలా చేయడం ద్వారా అమ్మ ఆత్మకు శాంతి లభించాలని దేవుడి దగ్గర సంవత్సరానికి ఒకసారి వేడుకుని వస్తాను. ఇది నాలో ప్రాణం ఉన్నంత వరకు పాటించాలనే కోరిక నాలో ఉంది.

మొలతాడు తెంచిన తరువాత దేవస్థానంలో కూర్చోబెట్టి మరోకొన్ని ఆచారాలను చేస్తారు. అటుతరువాత మేము హులిగమ్మ దేవత ఆశీర్వాదం పొందాలి. అప్పుడు నేను అత్యంత భక్తిపూర్వకంగా ఆ దేవత దగ్గర నా ఈ స్థితిని చూసి ఏడుస్తున్న నా కన్నతల్లిని ఓదార్చుమని వేడుకున్నాను. నన్ను కని, పెంచి, పెద్దచేసి, నీకు అర్పిస్తున్న ఆ తల్లిని ఈ రోజు నుంచి నా తల్లివైన నువ్వు కాపాడు అని ప్రార్థించాను. ఆ సమయంలో నాకళ్ళల్లో కన్నీళ్ళు ఆగకుండా ప్రవహించాయి. అటుతరువాత వృద్ధజోగమ్మలు పూజారి ఇంటికి పిల్చుకునిపోయారు. అక్కడ చీర కట్టించి, ఒడి నింపారు. పూజారే ముత్తెపు దండ కట్టాడు. అదయిన తరువాత, 'ఇది హులిగమ్మ తాళి, ఈ తాళిని నువ్వే కట్టుకో' అని నా చేతికి ఇచ్చారు.

అప్పుడు నా తాళిని నేనే కట్టుకున్నాను.

ఆ సందర్భంలో జోగమ్మల లెక్కలో ఇది పెళ్ళి జరిగినట్టే.

ఈ ఆచరణలో ఇంటివాళ్ళు తప్పనిసరిగా పాల్గొనాలి.

ఆ రోజు తెల్లచీర, తెల్ల జాకెట్టు, తెల్ల పెటీకోటు, పసుపు, కుంకుమలు ఇచ్చి గాజులు తొడిగించారు.

ఆ సమయంలో పేగులు తెగేలా, హృదయవికారంగా రోదిస్తున్న నా కన్నతల్లి ఏడ్పును నేను వివరించలేను.



దేవతను కట్టించుకుని నన్ను కుక్కువాడకు పిల్చుకుని వచ్చారు.

అప్పటి నుంచే ఆరంభమైంది మరొక రకమైన బాధ.

అప్పుడు అనేక రకాలైన కష్టాలను అనుభవించాను.

నాన్నయితే చాలా హింసించాడు. చాలా బాధపెట్టాడు.

నేను బయట నిలబడితే నువ్వు ఇక్కడేం చేస్తున్నావు? లోపలికి పో" అనేవాడు.

నాన్న తిట్టాడని లోపలికి పోతే, "ఇక్కడ నీకేం పని? ఆడవాళ్ళతో ఎప్పుడూ లోపలే ఉంటావా? బయటికి వెళ్ళు" అనేవాడు.

ఇదేదీ వద్దని నా పాటికి నేను మౌనంగా కూర్చుని వుంటే "ఎందుకు మాట్లాడకుండా కూర్చున్నావు? ఏదైనా పని చేసుకో? లేదా "ఎవరితోనైనా మాట్లాడు" అనేవాడు.

సరే నాన్న చెప్పాడుకదా, అని ఎవరి చేతనైనా తలుదువ్వుకుంటూ మాట్లాడుతూ వుంటే దానికీ తిట్టేవాడు.

నీళ్ళ కోసం వెళ్ళి ఎవరితోనైనా మగపిల్లలతో మాట్లాడితే ఆ కుర్రవాళ్ళ దగ్గర నీకేం పని అని తిట్టేవాడు. ఒక్కొక్కసారి కొట్టడానికి వచ్చేవాడు. అయితే దేవతను కట్టించుకున్న కారణానికి కొట్టేవాడు కాదు. ఇలా ఎక్కడికిపోయినా, ఏం చేసినా, ఏమి మాట్లాడినా, మాట్లడకపోయినా, లేచినా, కూర్చున్నా తిట్లే తప్ప నాకు ఒక్కింత కూడా ప్రేమాభిమానాలు దొరకలేదు.

అది గమనించి నాలో నేను కుమిలిపోయేదాన్ని. చివరికి వీళ్ళు నన్ను దగ్గరికి తీసుకోరు. ప్రేమగా ఒక్క మాట కూడా మాట్లారుకదా, వీళ్ళకు దూరమైపోయాననే నిర్ణయానికి వచ్చేశాను.

నా జీవితమన్నది సముద్రపు మొక్కలాంటిది. ఆ మొక్కను ఎవరూ పెంచరు. ఒకవేళ పెరిగినా దాని నీడలోకి ఎవరూ రారు. చీరకట్టుకుని ఇప్పటికి ఇరవై ఒక్క రోజులు గడిచాయి. నా ఇంట్లో నా కన్నవాళ్ళే నన్ను దగ్గర తీయటం లేదు. అలాంటప్పుడు బయటివాళ్ళు ఏం చూస్తారు? నన్ను ఇష్టపడేవాళ్ళు ఎవరు? నా దేహం పెట్టిన ఆరేడు సంవత్సరాల బాధకన్నా ఈ కొద్దిరోజులు నేను పడ్డ బాధ అత్యంత తీవ్రమైందని భయపడిపోయాను. ఆ మానసిక వ్యథను భరించలేక నేను బతికివుండకూడదని నిర్ణయించుకున్నాను.

దావణగెరెకు పోయాను.

విషం తెచ్చుకున్నాను.

రాత్రి భోజనం చేశాను.

పడుకునే ముందు విషం తాగి, నోట్లో బట్ట దూర్చుకుని పడుకున్నాను.

ఎప్పుడు వాంతికి అవుతుందో ఏమో?

ఆ శబ్దం విని ఇంట్లోని జనం నా దగ్గరికి వచ్చేస్తారు. ఏమైందని అడిగి ఆస్పత్రికి తీసుకునిపోయి నన్ను బతికిస్తారు. అలా బతికితే అప్పుడు మరింత నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. అలా కాకూడదు. నేను చచ్చిపోవాల్సిందే అని ఎలాంటి చప్పుడు నా నోటి నుంచి బయటికి రాకూడదనే పాతబట్టను నోట కుక్కుకున్నాను.

విషం తాగిన కొద్ది సేపట్లోనే కడుపులో సంకటం నొప్పి, సంకటం మొదలైంది.

నాకు స్పృహ తప్పుతున్నట్టుగా ఉంది.

ఆ దశ చేరేవరకే కాస్త మెలుకువగా ఉంది.

తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు.

అయితే ఆ బాధ భరించలేక నాకు తెలియకుండా గిలగిలా తన్నుకున్నట్టున్నాను.

నోట పెట్టుకున్న పాతబట్టఎప్పుడు బయటికి వచ్చిందో తెలియదు.

అప్పుడు బిగ్గరగా వాంతి చేసుకున్నానట. ఆ శబ్దానికి ఇంట్లోవాళ్ళు లేచి నా దగ్గరికి వచ్చారట. నేనేమీ మాట్లాడలేదు. మాట్లాడే స్థితిలో కూడా లేను. లీలగా వాళ్ళ మాటలు నాకు వినిపిస్తున్నాయి. రాత్రి ఏదో తినివుంటాడు. అరగలేదేమో? అని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ ముందే మరొక సారి వాంతి అయ్యింది. కాస్త మెలుకువ వచ్చింది. అమ్మ పాతబట్టతో నా నోరు తుడుచింది. నేను బలవంతంగా లేచి ఆ బట్టను బయట పారవేయటానికి వచ్చాను. బట్టవిసిరిన తరువాత ఇంట్లోకి రావడానికి సాధ్యం కాలేదు.

కడుపులోని పేగులు ఉండలు చుట్టుకున్న బాధ.

కాళ్ళల్లో వణుకు.

తల గిర్రున తిరిగినట్టయి అక్కడే కూలిపోయాను.

నాకు పూర్తిగా స్పృహ తప్పింది.

అప్పుడు నన్ను చిగటేరి ఆస్పత్రికి పిల్చుకునిపోయారు.

విషం తాగినట్టు అందరికి తెలిసిపోయింది.

డాక్టర్లు చికిత్స చేయసాగారు.

దాదాపు పదిహేను రోజుల తరువాత నాకు పూర్తిగా స్పృహ వచ్చింది.

ఆ రోజే మా వాళ్ళందరూ నన్నొక్కదాన్నే ఆస్పత్రిలో వదిలేసి వెళ్ళిపోయారు.

డాక్టర్లు నన్ను నెల రోజులు ఆస్పత్రిలోనే ఉంచుకున్నారు.
ఇంటివాళ్ళు ఎవరూ నన్ను చూడటానికి రాలేదు.
నాకు జీవితం మీద విరక్తి కలిగింది.

ఈ జీవితమే వద్దనిపించింది.

ఆ హులిగమ్మ తల్లి నన్ను ఇలాంటి స్థితిని అనుభవించటానికే ఈ విధంగా చేసిందా? అందుకే నన్ను బతికించిందా? అనే ఆలోచన నన్ను నలిపివేయసాగింది. అయితే ఎందుకో అదే రోజున ఇకపై చావటానికి నేను ప్రయత్నం చేయకూడదని నిర్ణయం తీసుకున్నాను.

వాళ్ళ కంటే ఉన్నతంగా బతికి చూపించాలనే నిర్ణయానికి వచ్చాను.

ఆ నిర్ణయమే నేను ఈ స్థాయికి రావడానికి కారణమైంది.

**రోగుల ముందు ఆడి పాడి, నృత్యం చేసి కడుపు నింపుకున్నాను.**

ఆస్పత్రిలో ఇంటివాళ్లంతా నన్ను వదిలేసి పోయిన తరువాత అక్కడి బతుకు దుర్భరమైంది. ఇంటివాళ్ళే ఇలా చేసిపోయిన మరుసటి రోజునే ఆస్పత్రి వదిలిపోదామని బయలుదేరాను.

అయితే డాక్టరు, "నువ్వు ఇప్పుడే వెళ్ళకు. నువ్వు ఇంకా కోలుకోలేదు. నీకు సహాయంగా మేమున్నాం. భయపడవలసిన పని లేదు. మరికొన్ని రోజులు ట్రీట్‌మెంట్ తీసుకుని వెళ్ళు" అని చెప్పాడు.

ఆ కారణంగా అక్కడే ఉండిపోయాను. అక్కడ ఉండిపోయిన కారణంగా ఉన్నన్ని రోజులు అక్కడ నేను నా బతుకుతెరువును వెతుక్కోవలసి వచ్చింది. అందువల్లనే డాక్టర్ బయటికి పోయిన తరువాత నర్సులు, పేషంట్లు, పేషంట్లను చూడటానికి వచ్చిన జనం ముందు నాకు తెలిసిన పాటలు పాడి, నృత్యం చేసేదాన్ని. ఇలా నృత్యం చేస్తూ ప్రజల ప్రేమను గెలిచి, వాళ్ళు ఇచ్చిన దాంతో కడుపు నింపుకున్నాను.

కొందరు ఇంటి నుంచి కట్టుకొచ్చిన సద్దిలోంచి నాకూ కొంత పెట్టేవాళ్ళు.

మరికొందరు హోటల్‌కు తీసుకునిపోయి టీ ఇప్పించేవాళ్ళు.

ఇంకొందరు తమకు తోచినంత డబ్బులిచ్చేవాళ్ళు.

పల్లె నుంచి వచ్చిన జనం డబ్బులివ్వడం తక్కువే. నర్సులు, సిటీ నుంచి వచ్చిన జనం డబ్బులు ఇచ్చేవాళ్ళు. అలా కొంత డబ్బు కూడబెట్టుకున్నాను. వచ్చిన డబ్బులో కొంత ఖర్చుపెట్టినా, ఎనిమిది పది రూపాయలు మిగిలాయి.

ఆ డబ్బుతో కుక్కువాడలో ఉన్న ఇంటికి వచ్చాను.

నాలుగు వారాల తరువాత నేను నా ఇంటికి వచ్చాను.

శుక్రవారం ఇల్లొదిలాను. మళ్ళీ శుక్రవారానికి ఒక రోజు ముందు అంటే గురువారం ఇల్లు చేరాను.

అప్పుడు నన్ను ఎవరూ పలకరించలేదు.

ఆస్పత్రిలో ఎలా ఉన్నావు? ఇప్పుడు ఆరోగ్యం ఎలా ఉంది? ఆరోగ్యంగా ఉన్నావా? ఎలా వచ్చావు? అని అడగలేదు.

ఆ సమయంలో అసలు ఇంటికి ఎందుకు వచ్చానా? అని అనిపించింది.

ఆస్పత్రి దేవాలయంలా ఉండేది. ప్రతీ ఒక్కరూ ప్రేమగా పలకరించేవాళ్ళు. అభిమానాన్ని చూపేవాళ్ళు. అలాంటి స్థలాన్ని వదిలి ఎందుకు వచ్చానని అనిపించింది.

మరుసటి రోజు నా తండ్రి దావణగెరెకు వెళ్ళి వచ్చాడు.

చీర, జాకెట్టు తెచ్చాడు.

జోగమ్మల్లో దేవత కట్టించిన తరువాత 'మాస పూజ ' చేయాలనే సంప్రదాయం ఉంది. అయితే నేను ఈ పూజ చేయించండని ఇంటివాళ్ళను అడగలేదు. ఎందుకంటే ఈ ఆచరణ చేయాలని దేవతను కట్టుకున్న తరువాత అయిదు వారాలు ఊళ్ళో తిరగాలి. అలా తిరిగి భిక్షం వేయించుకోవాలి. భిక్షంలో వచ్చిన గింజలను సంగ్రహించి, దాంతోనే వంట చేసి అయిదుమంది జోగమ్మలను పిలిపించి 'ఒడి నింపాలి'. పడ్లీగి (దేవతా విగ్రహం ఉన్న బుట్ట) నింపి అన్నం నైవేద్యం పెట్టాలనే పద్ధతి ఉంది. అయితే నేను ఊళ్ళో భిక్షానికి పోలేదు. అంటే భిక్షాటన చేయవలసిన కాలమంతా నేను ఆస్పత్రిలో ఉన్నాను.

అయినా నాన్న ఈ కార్యాన్ని చేయడానికి సిద్ధమయ్యాడు.

నాకు సంతోషం కలిగింది.

నన్ను పలకరించకపోయినా పరవాలేదు.

నాకు సంబంధించిన కార్యక్రమం చేస్తున్నాడుకదా అని సంతోషం కలిగింది.

అయితే ఆ సంతోషం ఎక్కువసేపు నిలువలేదు.

ఈ ఆచరణ జరిపించిన రోజే నేను తల్లితండ్రుల నుంచి,ఇంటివాళ్ళ నుంచి దూరమయ్యాను.

మా ఇంటి దగ్గరున్న హాలుస్వామి మఠంలో ఆ పూజ చేయించారు.

జనమంతా చేరారు.

అప్పుడు మా నాన్న జనం ముందు మాట్లాడిన మాటలు నా జీవితాన్ని మార్చాయి.

ఆ రోజు అతను –"చూడండి, నా కొడుకు జోగమ్మ అయ్యాడు. చావడానికి విషం తాగాడు. కానీ చావలేదు. నెలల కొద్దీ ఆస్పత్రిలో ఉన్నాడు. ఈ రోజు ఇంటికి వచ్చాడు. మగవాడు అయివుంటే పెళ్ళి చేసి వేరే ఇంట్లో కాపురం పెట్టించి ఉండేవాడిని. ఆడదై వుంటే పెళ్ళి చేసి భర్త ఇంటికి కాపురానికి పంపి వుండేవాడిని. గుడ్డివాడో, కుంటివాడో అయివుంటే ఒక మూలన కూర్చోబెట్టి ఇంత అన్నం వేసేవాడిని. ఇతను అదేదీ కాదు. అన్నిటినీ మించినవాడు. అన్నిటిని తప్పినవాడు. గుడ్డివాడూ కాదు. కుంటివాడూ కాదు. ఆడదీకాదు, మగవాడూ కాదు. ఇతను ఏ జాతికి చెందని మగజోగమ్మ అయ్యాడు. ఈ జోగమ్మలు ఎలా జీవితాన్ని సాగిస్తారో ఇకపై అలాగే జీవితాన్ని సాగించనీ" అని చెప్పి ప్రజల ఎదుటే నా తండ్రి నన్ను స్వయంగా ఇంటి నుంచి బయటికి పంపాడు.

భాష లేకపోతే భావంలేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది



అక్కడి నుంచి నా సంచార జీవితం ప్రారంభమైంది.

అప్పుడు నాకు ఎక్కడికి పోవాలో అర్థంకాలేదు.

దారి కనిపించలేదు.

దేవస్థానంలో మౌనంగా కూర్చుండిపోయాను.

నా మనస్సంతా దుఃఖంతో నిండిపోయింది.

బిగ్గరగా ఏడ్వాలనే మనస్థితి ఏర్పడింది.

అయితే ఏడ్చే ప్రయత్నం చేయలేదు.

ఏడిస్తే అక్కడ చేరిన జనమంతా నా గురించి చులకనగా మాట్లాడుతారు.

ఇందులో నా అభిమానం, నా ఇంటివారి మర్యాదకు సంబంధించిన ప్రశ్న ఉందనే కారణంగా అతి కష్టంతో ఏడుపును దిగమింగుకున్నాను. ఆ రోజు ఏడుపు మింగుకోవటం బతకాలనే ధైర్యాన్ని నాకు తెచ్చిపెట్టింది. అప్పుడే వీళ్ళను వదిలివేసి ఎక్కడికైనా వెళ్ళిపోదామని దృఢంగా నిర్ణయించుకున్నాను.

హఠాత్తుగా నాకు ఆస్పత్రిలో పరిచయమైన శ్రీమతి రాధమ్మ గుర్తుకు వచ్చింది.

ఆస్పత్రిలో అమ్మ నన్ను వదిలి వెళ్ళిపోయినప్పుడు రాధమ్మ తల్లిలా నాలో ధైర్యాన్ని నింపింది.

నన్ను కూతురిలా ప్రేమించింది.

అందువల్లే ఆ సందర్భంలో ఆమె గుర్తుకొచ్చింది.

దేవస్థానం నుంచి నేరుగా ఇంటికివెళ్ళి ఆమె చిరునామా రాసిపెట్టుకున్న కాయితాన్ని వెదికి, బట్టలు, పడ్లీగి తీసుకుని తల్లితండ్రులను, బంధు బలగాన్ని వదిలి బయటికి వచ్చేశాను.

వెనక్కు తిరిగి చూడలేదు.

నేను ఇల్లు వదిలి వెళ్ళిన రోజున నా దగ్గర కేవలం రెండే రెండు చీరలు ఉన్నాయి.

అంటే 'ముత్తైపుదండ' కట్టించిన రోజున తెచ్చిన ఒక తెల్లటి చీర, మళ్ళీ 'మాసపూజ' రోజున నాన్న తెచ్చిన కాటన్ చీర.

అయితే ఆ చీర నాకు సరిపోయేదికాదు. ఎందుకంటే ఆ చీర పొట్టిగా ఉంది. నేను పొడుగ్గా ఉంటాను. అయినా దాన్ని కట్టుకుని అమ్మకు చూపాను. అప్పుడు అమ్మ, 'నువ్వు దాన్ని కట్టుకున్న తరువాత నాకు ఇవ్వు. నేను వేరే చీర ఇస్తానని ఒక పాత చీర ఇచ్చింది.

ఆ రెండు చీరలతోనే ఎన్నో నెలలు జీవితాన్ని గడిపాను.

ఈ రోజు నా దగ్గర తక్కువలో తక్కువ అంటే యాభై కాటన్ చీరలున్నాయి.

అన్ని రకాల చీరలు లెక్కబెడితే సుమారు ఎనభై ఉండొచ్చు.

**దేవస్థానం బండలను తుడిచి పొట్ట నింపుకున్నాను.**

రాధమ్మ ఇంటికి పోయి మా ఇంట్లో జరిగిన విషయాన్నంతా చెప్పాను.

ఆమె నా తల్లితండ్రులను తిట్టింది.

నన్ను ఓదార్చి తన ఇంటిదగ్గరే ఉన్న దేవస్థానం దగ్గరికి పిల్చుకునిపోయింది.

దేవుడికి నమస్కరించి ఆ దేవస్థానంలో కూర్చున్నాం.

అప్పుడు దేవస్థానంలో పూజలు చేస్తున్న ఒక అవ్వను రాధమ్మ పరిచయం చేసింది. దేవుళ్ళు పూజ చేయటమే అవ్వ పని.

రాధమ్మ ఆమెతో, "ఈ మంజమ్మ నువ్వు చేస్తున్న పనిలో సహాయపడుతుంది" అని చెప్పింది.

ఆ మాటకు ఆ అవ్వ ఒప్పుకుంది.

ఆ నాటి నుంచి నేను అవ్వ చెబుతున్న పనులన్నీ ప్రేమతో, శ్రద్ధతో చేసేదాన్ని. దేవుడి పూజకు వాడే సామానులను శుభ్రంగా కడిగి తుడిచిపెట్టేదాన్ని. దేవస్థానం చుట్టూ శుభ్రంగా కసువు చిమ్మి నేలను తుడిచి ముగ్గులు వేసేదాన్ని. ఒక్కొక్కసారి అవ్వ బట్టలు ఉతికి ఇచ్చేదాన్ని. అవ్వకోసం ఇంటినుంచి దేవస్థానానికి సద్దిమూట వచ్చేది. అందులోంచి ఆమె నాకు కొంత పెట్టేది. దేవుడి పూజకోసం వచ్చి పండ్లు, కాయలు, కొబ్బరి వీటిల్లో నాకు కొంత తీసిపెట్టి తినమని ఇచ్చేది.

అయితే ఈ ప్రేమ ఎందువల్లనో చాలా రోజులు ఉండలేదు.

సుమారు నెల రోజులు గడిచి వుండొచ్చు.

ఉన్నట్టుండి అవ్వ నా మీద విసుక్కోవటం, కోప్పడ్డం మొదలుపెట్టింది.

ఎందుకో నాకు అర్థం కాలేదు.

ఎందుకని ఆమె నాకు చెప్పలేదు.

కారణం లేకుండా రోజూ రాత్రి పగలూ నన్ను తిడుతోందని మాత్రం నాకు అర్థమైంది.

భోజనం చేసేటప్పుడు మునుపట్లా నాకు పెట్టేదికాదు. కనీసం భోజనానికి నన్ను పిలిచేది కాదు. పనులు కూడా చెప్పేది కాదు. పలకరిస్తే పలికేది కాదు. రెండు రోజులు గడిచాయి. ఆ పరిస్థితికి నాకు ఏడుపు వచ్చేది. రోజూ వెక్కి వెక్కి ఏడ్చి మౌనంగా నిద్రలోకి జారుకునేదాన్ని.

దేవస్థానం ప్రసాదం తింటూ పదిపన్నెండు రోజులు గడిపాను.

చివరికి ఈ బాధ భరించలేక రాధమ్మ దగ్గరికి వెళ్ళి ఏడ్చేశాను.

ఆమె నన్ను ఓదార్చి భోజనం పెట్టింది.

ఆ రోజు నన్ను తన ఇంట్లోనే పెట్టుకుని మరుసటి రోజున

దావణగెరెలోని జాలినగరలో ఉన్న తన చెల్లెలి ఇంటికి పిల్చుకుని వెళ్ళి ఆమెకు నన్ను పరిచయం చేసింది. వారి చెల్లెలి ఇంటి దగ్గర్లోనే నెలకు యాభై రూపాయలకు అద్దెకు ఇల్లు ఇప్పించింది. తన ఇంట్లో ఉన్న కొన్ని పాత సామానులను ఇచ్చి నీకు మేమున్నాం, నువ్వు దేనికి భయపడకు అని ధైర్యం చెప్పారు. ఆమె మనస్సు గొప్పది.

అక్కడి నుంచి నా స్వతంత్ర జీవితం ప్రారంభమైంది.

ఇలాంటి జీవితానికి కారణమైన రాధమ్మను నాలో ప్రాణాలు ఉన్నంత వరకు మరిచిపోను.

**భిక్షం అడిగి ఇంటి అద్దె కట్టేదాన్ని**

అద్దెకు ఇల్లు తీసుకున్న తరువాత ఒంటరినయ్యాను.

అప్పుడు నా బతుకు తెరువు చూసుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.

అప్పుడు పడ్లీగి తీసుకుని భిక్షాటన చేయటం మొదలుపెట్టాను.

నేను చేయగలిగిన పని లేదా తప్పకుండా నేను చేయాల్సిన పని అదే.

అందువల్ల శుక్రవారం, మంగళవారం పడ్లీగి తీసుకుని ఊళ్ళోకి భిక్షానికి వెళ్ళేదాన్ని.

భిక్షాటనవల్ల వారానికి ఏడెనిమిది కేజీల బియ్యం దొరికేది.

అందులో నాకు కావలసినంత బియ్యం ఇంట్లో పెట్టుకుని మిగినదంతా రెండు రూపాయలకు కేజి ప్రకారం అమ్మి వచ్చిన డబ్బును అదే అంగట్లో నెలల తరబడి కూడబెట్టేదాన్ని. ఆదివారం పడ్లీగి తీసుకుని వీధంతా తిరిగి భిక్షాటన చేసేదాన్ని. ఇలా చేయటం వల్ల డబ్బులు, బియ్యం, కాయగూరలు, మిరపకాయలు దొరికేవి. వచ్చిన డబ్బుతో నూనె, బెల్లం, టీ పొడి, సబ్బు కొనుక్కుని జీవనం సాగించేదాన్ని.

ఇలా జీవితం గడుపుతూ అంగట్లో కూడబెట్టిన డబ్బుతో ఇంటిఅద్దె చెల్లించేదాన్ని.

ఒక రోజు సంతలో భిక్షం అడుక్కుంటూ ఉండగా ఆ సంత మైదానంలో ఒక చోట చాలా మంది గుమిగూడిన గుంపు కనిపించింది. అంతమంది ఎందుకున్నారు? అని కుతూహలం కలిగింది. అక్కడికి వెళితే మంచి కలెక్షన్ అవుతుందని అక్కడికి వెళ్ళాను. అక్కడ నృత్యప్రదర్శన జరుగుతోంది. ఒక చిన్న కుర్రవాడు జోగమ్మగా మారినట్టున్నాడు. అతను తలమీద చిన్న కడవ (కలశం) మోసుకుని నృత్యం చేస్తున్నాడు. అతని తండ్రి పాట పాడుతున్నాడు. ప్రజలు ఆ నృత్యానికి ఆకర్షింపబడి, ఆనందంతో చిల్లర కాసులు వేస్తున్నారు. నేను కూడా కలెక్షన్ అయిన డబ్బులోంచి ఒక రూపాయి వేశాను.

ఆ కుర్రవాడి నృత్యం అద్భుతంగా ఉంది.

నాకూ నృత్యం చేయాలనే కోరిక కలిగింది.

చిన్నకుర్రవాడు, దేవతను మోసుకుని నృత్యం చేస్తున్నాడు.

నేను చీర కట్టుకున్నాను.

చావాలని విషం తాగాను.

తల్లితండ్రులు ఇంటి నుంచి బయటికి పంపేశారు.

బంధువులు ఎవరూ దగ్గరికి చేర్చుకోలేదు.

అంతా దూరం పెట్టారు.

ప్రజల నుంచి అవమానింపబడ్డాను.

నా జీవితం ఇంతగా మారిపోయిన తరువాత ఈ కళను ఎందుకు నేర్చుకోకూడదని అనుకున్నాను. విషయం తెలుసుకుందామని నృత్యం ముగిసేవరకు అక్కడే ఉన్నాను.

నృత్యం ముగిసింది.

గుమిగూడిన జనం చెదరిపోయారు.

అప్పుడు నేను ఆ కుర్రవాడి తండ్రి దగ్గరికి వెళ్ళి, "అప్పాజి" అని పిలిచాను.

ఆయన ఆ పిలుపుకి ఆశ్చర్యపోతూ నా వైపు చూశాడు.

నన్ను చూసిన వెంటనే కంగారుగా "ఏమమ్మా?" అన్నాడు.

"మీ పిల్లవాడు నృత్యం చేస్తాడు కదా, అలా నాకు నృత్యం చేయాలని ఉంది. నాకు నేర్పిస్తారా?" అని అడిగాను.

ఆయన నన్ను తన పక్కన కూర్చోబెట్టుకుని నా గురించి అడిగాడు.

నేను నా జీవితంలో జరిగినదంతా ఏదీ దాచుకోకుండా చెప్పాను.

ఆయనకు నా కష్టాలు అర్థమయ్యాయి.

'అయ్యో' అంటూ నా పట్ల జాలి చూపాడు.

నాకు నృత్యం నేర్పడానికి ఒప్పుకున్నాడు.

'రేపు మా ఇంటికి రా' అని చెప్పి తన ఇంటి చిరునామా రాసి ఇచ్చాడు.

అతని పేరు బసప్ప.

అతను చెప్పినట్టే మరుసటి రోజు సాయంకాలమే వాళ్ళింటికి వెళ్ళాను.

ఇచ్చిన మాట ప్రకారం నాకు తర్ఫీదు ఇవ్వసాగాడు.

నాకు నృత్యం ఎలా చేయాలో నేర్పించసాగాడు.

ఆయన నేర్పే విధానం చాలా బాగుంది.

ఇప్పటికీ నేను ఆ పద్ధతినే పాటిస్తున్నాను.

మొదటి రోజు ఒక చెంబులో నీళ్ళు నింపి నా తల మీద పెట్టి, తన కొడుకు అడుగులు వేసినట్టే వేయమని చెప్పాడు.

అతని కొడుకు ఆ సమయంలో చిన్న కడవ (కలశం) తలమీద పెట్టుకోలేదు. అయితే తండ్రి పాటకు తగినట్టు లయబద్ధంగా

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే



అడుగులు వేస్తున్నాడు. నేను ఆ కుర్రవాడిని చూస్తూ అడుగులు వేయ సాగాను. నేను తప్పు చేసినప్పుడు బసప్పే స్వయంగా సరిదిద్దే వాడు. సాధారణంగా అతని చేత ఒకసారి చెప్పించుకున్నది మరొకసారి చెప్పించుకునేదాన్ని కాదు. రెండవసారి చెప్పించుకోకుండా నేర్చుకోవాలనే పట్టుదల నాది. ఏదైనా చాలా తొందరగా గ్రహించేదాన్ని.

ఒక వారం రోజులు ఇదే విధంగా నా చేత నృత్యం అభ్యాసం చేయించాడు.

అతను నేర్పినదంతా చేసి చూపించాను.

అటు తరువాత దేవతను కట్టిన నిండు కలశాన్ని తలమీద పెట్టి నృత్యం చేయటం నేర్పించాడు.

దేవతను కట్టిన కలశానికి జోగమ్మ సంప్రదాయంలో చాలా గౌరవం ఉంది.

పొరబాటున ఆ కలశం తలమీది నుంచి కిందపడితే దాన్ని అపశకునంగా భావిస్తారు.

దేవతకు అవమానం చేసినట్టేనని జనం నమ్ముతారు.

అందుకే కలశం మోసుకుని నృత్యం చేయడానికి నేర్పే ముందు చెంబుతోనే బాగా నేర్పి, దాని మీద పూర్తిగా పట్టు దొరికిన తరువాత దేవతను కట్టిన కలశంతో చేయిస్తారు. అప్పటిదాకా దేవతను కట్టిన కలశాన్ని ఇవ్వరు. నేను, నాలా నృత్యం నేర్చుకోవడానికి వచ్చిన వారికి కలశాన్ని మోసుకుని వీళ్ళు నృత్యం చేయగలరని నమ్మకం కలిగాక ఆ కలశాన్ని ఇస్తారు.

జోగమ్మలందరూ ఇదే పద్ధతిని పాటిస్తారు.

నేను నిండుగా ఉన్న కడవను తలమీద మోసుకుని చక్కగా నృత్యం చేయడం చూసి, దేవతను కట్టిన కలశాన్ని తలమీద పెట్టించి నృత్యం చేయించారు. అప్పుడు కూడా చక్కగా నృత్యం చేశాను.

అదే మొదటిసారి నేను కలశం మోయటం.

నాకు చాలా సంతోషం కలిగింది.

ఇది చూసి రేపటి నుంచి మాతో భిక్షాటనకు రమ్మని పిలిచారు.

ఆ మాట విన్నప్పుడు నాకు చాలా సంతోషం కలిగింది.

ఆ రోజు నుంచి నా ఒంటరి భిక్షాటన జీవితం ముగిసిందని అనుకున్నాను.

నా తల మీదున్న దేవతే ఈ కళను నేర్పిందని ఆమెకు భక్తితో చేతులు జోడించాను.

ఆమెను మోసుకుని నృత్యం చేసి, నృత్యం చేసి సంతోష సాగరంలో మునకలు వేశాను.

***(తరువాయి వచ్చే సంచికలో...)***

కవిత

# కలలకు బలివేదిక

మీ కలలు సాకారం కావటానికి
ముక్కారు పంటలు పండే మా భూమితల్లిని
బలివేదిక చేస్తే ఎలా ఓర్చుకోగలం?
తోటలు...పంటలు...అడవుల సమాధులపై
సేద తీరాలనుకునే అస్మదీయులు...రియల్టర్లకోసం
స్వంతగడ్డపై నిర్మించే విదేశీ నగర పాదాలకింద
ఆక్రందించే అన్న దాతల గుండెఘోష అర్థం కానిదెవ్వరికి?
కొండలు...నదులు...ఔషధాలు...జలచరాలతో
అన్నంపెట్టే అమ్మని నమ్ముకోవటం మానేసి
తెగనమ్ముకోవాలనే ఆధునిక యుగ పాలకులు
ఆ దోపిడీ ఉత్తర్వులన్నీ పరాయి భాషలో ముద్రించి
అర్థంకాక అమాయకంగా చూసే మా మొహాన కొట్టటం
ముందు తరాల మెడలకు ఉరితాళ్లు పేనటమే కదా!
మట్టిలోంచి పుట్టే చెట్టు...మెట్ట...కంపల్ని వదిలి
దేశాత్మను తొక్కేసే ధనవంతుల బాట పట్టిన పెద్దల్ని
వ్యవసాయాన్నే నమ్ముకున్న మట్టి మనిషిగా ప్రశ్నిస్తున్నాను
నేను శ్రామికుడ్నయితే మీ కంచంలోకి అన్నం ఎలా?
మా ఆత్మహత్యల నివేదికలు...నిరసనల్లోంచి
మా మొహాల్లో పరచుకునే దుఃఖాందోళనల్లోంచి
మీ అన్యాయపు చట్టం కొరడా ఝళిపింపుల్లోంచి
పురుటి గడ్డలో ప్రకంపనలు మొలకెత్తుకుంటాయా!

డా॥సి. భవానీదేవి
9866847000

య. మాధవరావు
9494228248

# నా నాసిక్ యాత్ర



ఈ యాత్ర 1975 సం॥లో చేశాను. నేను అప్పుడు హైదరాబాద్‌లో పి.యమ్.జీ. ఆఫీసులో ఇన్వెస్టిగేషన్ సెక్షన్‌లో ఇనస్పెక్టరుగా పనిచేయుచుంటిని. అప్పుడు మన ఆంధ్రప్రదేశ్ తపాలా మండలంలో పోస్టుకార్డులు, ఇన్‌లాండ్ లెటర్సు వగైరా స్టేషనరీ కొరత నెలకొని ఉంది. ఒక డైరెక్టరుగారు (నేను లోగడ ఆయన గుంటూరు డివిజన్ ఎస్.ఎస్.పి. గా ఉన్నప్పుడు నరసరావుపేటలో తపాలా ఇనస్పెక్టర్‌గా పనిచేశాను) నన్ను పిలిచి "నీవు తక్షణమే నాసిక్‌కు వెళ్లి, సెక్యూరిటీ ప్రెస్ మేనేజరును కలిసి, కనీసం ఒక లారే లోడ్ పోస్టుకార్డులు మన మండలానికి తరలించాలి" అని ఆదేశించారు. నేను 1 క్లాసు పాసు తీసుకొని, నాసిక్‌కు చేరుకొని మేనేజరును కలిసి, నాకు గెస్టుహౌస్‌లో ఒక గది కేటాయించమని చెప్పాను. ఆయన మీలాగే అదే పని మీద ఒడిస్సా మండలం నుండి వచ్చిన అసిస్టెంటు డైరెక్టరు శ్రీ జి. ప్రసాదరావు పట్నాయక్‌కు ఉన్న ఒకే ఒక గదిని కేటాయిం చాము. మీరు ఊళ్లో వసతి చూసుకోండి అన్నారు. నేను ఊళ్లోకి వెళ్లి ఉత్తరాది మఠంలో తెలుగు తెలిసిన ఒక మొదలియారును కలసి నేల మీద పరచిన పరుపుల మీద విశ్రమించాను.

మఱునాడు స్నానం చేసి ప్రెస్‌కు వెళ్లాను. అచ్చట నాకు పట్నాయక్‌గారితో పరిచయమయ్యింది. ఆయనకు తెలుగు బాగా తెలుసు. ఆయన తల్లిభాష అదే!

మీరెక్కడ దిగారని ఆయన అడుగగా ఉన్న విషయం చెప్పాను. ఆయన నాతో మీరు వెంటనే వెళ్లి మీ సామానుతో వచ్చేయండి. మనం కలసి ఉందాం. కాలక్షేపము కూడా బాగా అవుతుంది అని అన్నారు. నేను సంతోషంతో వెళ్లి నా సామానుతో ఆయన గదిలో దిగాను.

మేము ఇద్దరము మేనేజరును కలసి మా అభ్యర్థనను నివేదించాము. ఆయన "దేశంలోనే పోస్టుకార్డులకు తీవ్ర కొరత ఏర్పడింది. తయారయిన సరుకు ఎప్పటికప్పుడు రవాణా అవుతోంది" అని "మీరు పెద్ద ఆశతో ఇక్కడకు వచ్చారు మీకు ఆశాభంగం కలిగించనులెండి" అన్నారు. ఆయన పేరు కృష్ణపిళ్లై అనుకుంటాను. తెలుగు మాటాడలేదు కాని కొంచెం కొంచెం అర్థం చేసికొంటాడు. అవి వరుసగా శని, ఆదివారాలు. పట్నాయక్‌గారు కొద్ది వెసులుబాటు ఉందిగదా! మనం వెళ్లి గోదావరి జన్మస్థలిని దర్శనం చేసికొని వద్దాం అన్నారు. నేను సరే! అన్నాను. ఇద్దరమూ బస్సులో ప్రయాణించి 40 కి.మీ. దూరంలో నున్న త్ర్యంబకం చేరుకొన్నాము. వెంటనే కొండ ఎక్కటం ప్రారంభించి 4,5 గం॥లకు శిఖరాగ్రం చేరుకున్నాము. చూద్దుము కదా, ఎక్కడా గోదావరి పుట్టిన జాడలు కానరాలేదు. తోటి యాత్రికులు అక్కడో బొట్టు, ఇక్కడో బొట్టుగా పడుతున్న తావులను చూపి, ఇవే అన్నీ కలసి ఒక చిన్న ప్రవాహం ఏర్పడుతుందని, అట్టి చిన్న చిన్న నీటి జాలులు కలసి ఏరుగా ఏర్పడి, క్రిందికి పారుతాయని చెప్పారు. హిమాలయాలో అట్లు కాదు. మంచు కరిగి క్రిందికి పారుతున్న దృశ్యాలు, చాలా దూరం నుండే స్పష్టంగా కనబడతాయి. నాసిక్ కొండలు, కొండపల్లి కొండలకన్నా ఎత్తైనవి. నిటారుగా ఉంటాయి. కష్టము మీద ఎక్కి దిగాము. దిగేటప్పుడూ అదే కష్టం.

ఇక కుండంలో స్నానము చేయటానికి సిద్ధం అవుతున్నాము. ఎవరైనా బ్రాహ్మణుని చేత సంకల్పం చెప్పించుకోవాలని ఉద్దేశము. ఇంత వరకు, తెలుగో, ఇంగ్లీషో మాటాడి నిబాయించుకొని వచ్చాము. మాకు హిందీ, మరాఠీ రావు. ఎలా అని మదనపడుతున్నాము. ఇంతలో పెద్ద ఇబ్బంది వచ్చింది. కారణం అచ్చటనున్న బ్రాహ్మణులు మమ్ములను సమీపించి, మాతో చేయించుకోండి అంటే మాతోనే చేయించుకోండి అని హిందీలోను, మరాఠీలోనూ అంటూ, మమ్ములను వేధించ సాగారు. కొందరయితే మీద పడి చేతులు గుంజడం ప్రారంభించారు, దక్షిణ ముట్టుతుందన్న ఆశతో. మాకు పాలు పోయింది కాదు. ఈ బెడద ఎలా తప్పించుకోవాలి అని మాలో మేము తెలుగులో చర్చించుకుంటుంటే ఒక ఆయన మా దగ్గరకు వచ్చి, నేను మీ పురోహితుణ్ణి, మీతో సంకల్పం చేయిస్తా నన్నాడు. వెంటనే నేను ఆయనతో, మీకు తెలుగు తెలిసి నట్లుంది. బాగానే ఉంది. మీరు మా పురోహితులెట్లా అయ్యా"రని ప్రశ్నించాను. ఆయన "అయ్యా మీపేరు చెప్పండి నేను చెబుతా" నన్నాడు. నాకు బుద్ధి పుట్టాక ఎప్పుడూ నాసిక్, త్ర్యంబకాలకు రాలేదు. నా పేరు యద్దనపూడి మాధవరావు" అన్నాను. ఆయన తన వద్దనున్న ఒక కదిరి కట్టె తీసి గబగబా వెదికి తెలుగులో చేసి వున్న ఒక సంతకం చూపించాడు. అది యద్దనపూడి మూర్తిరాజు గారిది...ఆయన దివి తాలూకా కృష్ణాజిల్లా అని తన చిరునామా కూడా వ్రాశారు. ఆయనది మా ఊరే యద్దనపూడి. వారిది గుడి దగ్గర ఇల్లు. మాదేమో ఊరు మధ్యలో ఉంది. ఆయన సంతానము మా నాన్నగారి దగ్గరే విద్యాభ్యాసం చేశారు. ఆయన నోటు చేసిన తేది బట్టి నేను పుట్టిన 1935 సం॥లోనే నాసిక్ యాత్ర చేసినట్లు రూఢి అయింది. మూర్తిరాజుగారు మా

( ...తరువాయి 48 వ పుటలో )

డా॥ గుమ్మా సాంబశివరావు
9849265025

# యుద్ధమల్లుని బెజవాడ శాసన వ్యాసాలు



రచన : యుద్ధమల్లుని బెజవాడ శాసనము(లు) (ప్రముఖుల వ్యాస సంకలనం)
సంకలనం : డా॥ ఈమని శివనాగిరెడ్డి - స్థపతి ; వెల : రు. 50/-
సంపాదకులు : నాగోలు కృష్ణారెడ్డి, కొండా శ్రీనివాసులు, జయంతి చక్రవర్తి
ప్రధాన సంపాదకులు : డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ - మొదటి ముద్రణ జనవరి 2019
ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి, 2వ అంతస్తు, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత నృత్యకళాశాల, దుర్గాపురం, విజయవాడ - 3. ఫోన్ నెం. 9618848470

తెలుగు సాహిత్యం నన్నయ నుంచి ప్రారంభమైందని భావిస్తున్నా, నన్నయ కంటే ముందే తెలుగులో సాహిత్యం ఉన్నదనే విషయం శాసనాల ద్వారా తెలుస్తున్నదనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. ఎర్రగుడిపాడు శాసనం, పండరంగని అద్దంకి శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనం - ఇలా ఎన్నో శాసనాలు న్నాయి. కొన్ని పద్య శాసనాలు, కొన్ని గద్య శాసనాలున్నాయి. నన్నయకు పూర్వం లభించిన పద్య శాసనాల్లో యుద్ధమల్లుని శాసనం ప్రముఖమైంది. యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో 'మధ్యాక్కర' అనే దేశి చ్ఛందం ఉండటం గమనించదగిన విషయం. నన్నయను మనం ఆదికవి అని చెప్పినప్పటికీ ఆయనకంటే ముందే తెలుగులో పద్య సాహిత్యం ఉన్నదనటానికి అద్దంకి శాసనం, బెజవాడ శాసనం సాక్ష్యాలుగా నిలుస్తాయి.

యుద్ధమల్లుని బెజవాడ శాసనాన్ని గూర్చి జయంతి రామయ్య పంతులు, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు పంతులు, చిలుకూరి నారాయణరావుగార్లు రచించిన వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. వీటితోపాటు జయంతి రామయ్య పంతులు, సి.ఆర్.కృష్ణమాచారి. కె.వి.లక్ష్మణరావుగార్ల ఆంగ్ల వ్యాసాలు కూడా ఉన్నాయి. యుద్ధమల్లుని బెజవాడ శాసనం ఒకటా? రెండా? ఈ శాసనాన్ని ఒకరు వేయించారా? లేక ఇద్దరు వేయించారా అనే విషయంలో భేదాభిప్రాయాలున్నాయి. జయంతి రామయ్య పంతులుగారు బెజవాడ శాసనాన్ని తాత యుద్ధమల్లుడు, మనుమడు యుద్ధమల్లుడు వేయించారని తమ అభిప్రాయాన్ని ప్రకటించారు. సంకలనకర్త డా॥ ఈమని శివనాగిరెడ్డిగారు కూడా ఈ అభిప్రాయాన్నే బలపరిచారు.

యుద్ధమల్లుని బెజవాడ శాసనం ద్వారా క్రీ.శ. 848 సం॥ ప్రాంతంలో ఉన్న తెలుగు భాషా స్వరూపం, ఛందోమార్గం స్పష్టమవుతున్నాయి. ఆనాటి తెలుగులిపి, అక్షర స్వరూపం, (అచ్చులు, హల్లులు అనుస్వారం) ఛందస్సు స్వరూపాల్ని జయంతి రామయ్య పంతులుగారు సవివరంగా తెలియజేశారు. శాసన కాలాన్ని కూడా నిర్ణయించారు. మూలాన్ని యథావిధిగా కూడా ఇక్కడ ముద్రించటం సముచితంగా ఉంది. ఈ శాసనమంతా ఒక్క దస్తూరితో రచించబడింది కాబట్టి ఇది ఒక్క శాసనమని కొమర్రాజు వారు తమ అభిప్రాయాన్ని ప్రకటించారు. 'నన్నయకు పూర్వము పద్యములు గలవా?' అనే వ్యాసంలో యుద్ధమల్లుని బెజవాడ శాసనాన్ని గూర్చిన పలు విశేషాలు తెలియజేశారు. పరభాషీయులకు కూడా యుద్ధమల్లుని బెజవాడ శాసనాన్ని గూర్చి తెలియజేయటానికి ఆంగ్లవ్యాసాల్ని కూడా ఈ పుస్తకంలో చేర్చిన సంకలనకర్త, సంపాదకుల ప్రయత్నం బాగుంది. వీటితోపాటు శ్రీ జయంతి రామయ్య పంతులుగారి పరిచయం ఉంది. ప్రొఫెసర్ వెలమల సిమ్మన్నగారు రచించిన కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారి జీవిత విశేషాలున్నాయి. కొమ్మనామంచి జోగయ్య శర్మగారు రచించిన చిలుకూరి నారాయణరావుగారి జీవన రేఖలు కూడా ఈ పుస్తకంలో చేర్చిన సంకలనకర్త అభినందనీయులు.

తెలుగువారి ప్రాచీన భాషా స్వరూపం, ఛందోరీతిని తెలిపే శాసనం వివరాల్ని అందించిన ఈ పుస్తకాన్ని భాషాభిమానులు తప్పకుండా కొని చదవాల్సిన అవసరం ఉంది. ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సంస్కృతి సమితివారు అభినందనీయులు.

# శ్రీకృష్ణదేవరాయలు విడుదలచేసిన నాణేలు



శ్రీకృష్ణదేవరాయలు విడుదల చేసిన నాణేలు
రచన : డా॥ఈమని శివనాగిరెడ్డి,
జె.వి.ఎస్.వి.ప్రసాద్
పుటలు : 20, వెల : 25/-

దక్షిణాది రాజ్యాలన్నింటిలో ప్రత్యేకంగా గుర్తింపు పొందిన విజయనగర సామ్రాజ్యానికి చక్రవర్తి అయిన శ్రీకృష్ణదేవరాయలు అనేక రకాల నాణేలను విడుదల చేశారు. నాణేల తయారి, రూపురేఖలు, తన కంటే ముందున్న చక్రవర్తులు కంటే ఆకర్షణీయంగా బొమ్మల్ని ముద్రించారు. ముందు దేవతామూర్తులు. వెనుకవైపు చిహ్నాలు, చక్రవర్తి పేరుతోనూ ఒక్కోసారి సంక్షిప్త వివరాలతోను, దాదాపు ఒక్కోరకం నాణేలు విడుదల చేసారు. విజయ నగర రాజుల నాణేల పేర్లు, విలువలు, బరువులతో అందమైన ఛాయా చిత్రాలతో 'శ్రీకృష్ణదేవరాయలు విడుదల చేసిన నాణేలు' అన్న పుస్తకాన్ని రచించిన ఈమని శివనాగిరెడ్డి, జెవిఎస్‌వి ప్రసాద్‌లు అభినందనీయులు. మధ్యయుగాల ద్రవ్యవ్యవస్థ, వినియోగ పద్ధతి, చలామణిలోనున్న వివిధ పరిమాణంలో, వివిధ పేర్లతో పిలువబడిన నాణేలను గుర్తించి ఆసక్తికరమైన సమాచారమును ఆర్ట్ పేపరు మీద రంగుల్లో ముద్రించిన ఈ పుస్తకం అందరి దగ్గరా ఉండాలి.

పుస్తక సమీక్ష

# ‘మహా స్వప్నం మహాత్మాగాంధీ



సంపాదకుడు : డా॥నాగసూరి వేణుగోపాల్
వెల : రు. 100/-
ప్రతులకు : రామమోహన్‌లోహియా సమతా ట్రస్టు, లోహియా విజ్ఞాన సమితి, 101, గోదా నిలయం, మయూరీ మార్గ్
బేగంపేట, హైదరాబాద్-500016
సెల్ : 8121898440

జాతిపిత గురించి, జాతి మరచిపోతున్నదేమో, అనే అనుమానం ప్రబలమౌతున్న ఛాయలని ప్రస్ఫుటంగా కనబడుతున్నట్లు అనిపిస్తోంది. కాకపోతే, గత 8 అక్టోబరు 2 నాడు, గాంధీజి 150వ జన్మదిన సంబరాలు, సంవత్సరం పొడవునా, వేడుకగా జరుపుతామంటూ ప్రకటించిన ప్రభుత్వాలు - పట్టించుకున్నట్లు కనబడటం లేదు. ఇంకా అభిమానం మిగిలివున్నవారు చేసిన, చేస్తున్న చిన్నా చితకా ప్రయత్నాలు తప్ప.

ఈ పరిస్థితులలో ఒక కాంతిరేఖగా వెలువడిన పుస్తకం- ‘‘మహాస్వప్నం-మహాత్మాగాంధీ’’ డా॥నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో, రామ మనోహర్‌లోహియా సమతా ట్రస్టు మరియు లోహియా విజ్ఞాన సమితి వారి ప్రచురణగా వెలువడిన పుస్తకం.

ఈ పుస్తకానికి ఒక ప్రత్యేకత వుంది. సాధారణంగా ఒక మహానుభావుడి గురించి ప్రచురింపబడే పుస్తకాలలో, కొంత మంది ప్రముఖుల చేత ప్రత్యేక వ్యాసాలు వ్రాయించి, పేరున్న పెద్దలు, సంపాదకత్వ బాధ్యతను చేపడతారు. అలా కాకుండా, ప్రముఖ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావుగారు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, దినపత్రికలలో 1944-1973 సం॥ల మధ్యకాలంలో రాసిన సంపాదకీయాల సంకలనం ఇది.

నార్ల వేంకటేశ్వరరావుగారు - “తెలుగుల వెలుగు” ఆధునికతకు ప్రతీకగా, కులమత తత్త్వాలకు, మత మౌఢ్యాలకూ వ్యతిరేకంగా, నిర్విరామ పోరాటం సాగించిన కలం వారిది. ఒక మేధావి సునిశిత ప్రజా దృష్టికి - మూడు దశాబ్దాల కాలంలో మహాత్ముడిని పరికించిన తీరు, పరిశీలించి ఆయా సందర్భాలలో గాంధీగారిని సమర్థిస్తూ, అవసరమైతే ప్రశ్నిస్తూ వ్రాసిన 29 సంపాదకీయాలను, ఒక చోట చేర్చి - నార్లవారి హేతువాద దృష్టికి గాంధీ ఎలా కనిపించారో, మనకు కళ్లకు కట్టేలా కనిపింప చేశారు డా॥ నాగసూరి వేణుగోపాల్.

రచనా కాలం గురించి కూడా ఒకమాట చెప్పుకోవాలి. 1944 నుండి అంటే - రెండవ ప్రపంచ యుద్ధం రోజుల నుండి 1973 అంటే - స్వాతంత్ర్య సముపార్జన, ఆ తదుపరి గాంధీగారి హత్య తరువాత కాలం కూడా దాదాపు 5 సంవత్సరాల తదుపరి కాలం - పరిగణనలోకి తీసుకోబడింది. అంటే - గాంధీజిగారి మహాస్వప్నం ఇంకా సాకారం కానప్పటి నుండి, గాంధీజిగారు అంతర్ధానమైన తరువాత పాతికేళ్ల కాల వ్యవధిలో వచ్చిన పరిణామాల నేపథ్యం - ఒక ఫ్రేమ్‌లో బిగించబడింది. మిగిలిన వారందరూ మహాత్మునిగా భావించినా, నార్ల వారి కోణంలో నుండి గమనించినప్పుడు - మహాత్ముడిగా, ఎలా భారతజాతి, హృదయాలను గెలువగలిగారో మనకు కనబడుతుంది. చిత్రంగా - నార్ల గురించి మనకున్న గౌరవం కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుంది.

ఇటు మహాత్ముడూ - మరోసారి మనసులో మెదులుతారు, అటు నార్లవారి రచనాగరిమ కళ్లకు కడుతుంది.

డా॥ నాగసూరి చేసిన మంచిపని ఏమిటంటే - కేవలం నార్లవారి సంపాదకీయాలు కుప్పపోసి వూరుకోకుండా - కొన్ని అరుదైన వ్యాసాలను ఏరి కూర్చారు. సమీక్షలను చేర్చారు. అనుబందోపాధ్యాయగారి ‘శ్రమజీవి’ వ్యాసం జవహర్‌లాల్ నెహ్రూగారి - ‘భారతదేశానికి అపురూపమైన ప్రతినిధి’ వ్యాసం - విన్సెంట్ షీన్‌గారి - ‘తనకు తానుగా మారడమే గాంధీ జీవితం’ - ప్రత్యేకంగా చెప్పుకోదగ్గవి, పుస్తకానికి అరుదైన శోభను చేకూర్చాయి.

డా॥ నాగసూరి సంపాదకత్వంలో పుస్తక ప్రయోజనాన్ని పెంచడానికి చేసిన కృషిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గది - సంపాదకుడుగా తెలుగుల వెలుగు నార్ల వెంకటేశ్వరరావుగారి పైన వ్యాసం, విశ్వాంతర స్థాయిలో మహితాత్ముడు, అనుబంధంలో చేర్చబడిన తదితర వ్యాసాలు.

ఈ పుస్తకంలో మరో ప్రత్యేకత ఉంది. గాంధీజీని అభిమానించే వారిలో సైతం, గాంధీగారు ఆధునికత, సాంకేతికతను వ్యతిరేకిస్తారనే భావం ఒకటి బలంగానే వుంది. ఈ పుస్తక సంపాదకులు, డా॥ నాగసూరి వేణుగోపాల్ తాను స్వయంగా వ్రాసిన రెండు వ్యాసాలలో తమ పరిశోధన ఫలితంగా మన ముందుంచారు. “తక్కువ తెలుసుకుని ఎక్కువ మాట్లాడటం మన సమాజ స్వభావం కావచ్చు” అని చురకలంటిస్తూ, గాంధీగారి ‘హింద్ స్వరాజ్’ పుస్తకాన్ని సరిగ్గా పరిశీలించకుండా చర్చించడం జరిగిందనీ ప్రస్తావిస్తారు. గాంధీగారు సైన్సు బోధన పట్ల కూడా ఎంతో దృష్టిపెట్టి, స్థానిక భాషలలో అది సాగాలనీ, శాస్త్రవేత్త స్వభావం, దృక్పథం మరింత మానవీయంగా, గ్రామీణులకు అనుకూలంగా వుండాలని యోచన చేశారనీ, యాంత్రీకరణకు వ్యతిరేకం కాదనీ, అయితే ఆ యంత్రాలను వాడే మనుష్యుల బుద్ధిని దారిలో పెట్టాలనీ, తక్కువ వనరులు వినియోగించుకుని పొందే ఫలితం ఎక్కువ మందికి తోడ్పడాలనే సూత్రాన్ని సూచించారనీ, తర్వాతి కాలంలో గాంధియన్ ఇంజనీరింగ్ పేరిట ప్రాచుర్యంలోకి వచ్చిన ఆవిష్కరణలు వీనికి సాక్ష్యమనీ, సహేతుకంగా, ఉదాహరణలతో సహా తన పరిశోధన ఫలితంగా నిరూపించవచ్చనీ, ‘స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఈ పుస్తకానికి హైలైట్‌గా భావించవచ్చు. మృష్టాన్న భోజనం చేసిన తృప్తిని కలిగిస్తుందీ పుస్తకం, స్ఫూర్తినిస్తుంది. ఆలోచింపచేస్తుంది. కార్యోన్ముఖుల్ని చేస్తుంది. అదీ పుస్తక ప్రయోజనం. అదే, ఈ పుస్తకం సాధించింది.

- ఆచార్య వంగపల్లి విశ్వనాథం
9493101328

సమీక్షావ్యాసం

# ‘చలం నీడ చెప్పిన కథ’



రచన : వావిలాల సుబ్బారావు
పుటలు : 213, వెల : 100/-
ప్రచురణ : చలం ఫౌండేషన్
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్
హైదరాబాదు

డా॥వావిలాల సుబ్బారావు చలం రచనల మీద పరిశోధన చేశారు. చలం కథానికల అనుశీలనానికి వారికి డాక్టరేటు ప్రదానం అయింది. ఆ విధంగా సుబ్బారావు చలం భక్తకోటిలో ఒకరయ్యారు. తర్వాతి రోజులలో చలంగారి తత్వంపై వ్యాసాలు వ్రాశారు. వారి రచనల సంగ్రహ సంకలనం, విశ్లేషణాత్మక వ్యాసాలు వ్రాశారు. ఇక మిగిలింది చలంగారి జీవితం. అంపశయ్య నవీన్‌గారితో చేయి కలిపారు. తొలుత ఇద్దరూ కలసి చలం పల్లకీ మోయాలనుకున్నారు. కానీ జగద్విదితమయిన చలంగారి పూర్వార్థ జీవితాన్ని నవలగా ‘నవీన్’గారు వ్రాశారు. ఉత్తరార్ధపు ఆధ్యాత్మిక శోధనను సుబ్బారావుకు వొదిలిపెట్టారు. ఈ భాగాన్ని సుబ్బారావు ఒంటిగనే నిర్వహించారు.

ఒక రచయిత మనస్తత్వాన్ని, దృష్టిని ప్రవృత్తిని ప్రపంచ సమస్యలను అతను అర్థం చేసుకొనే విధానానికి - ఆతడు వ్రాసిన పుస్తకాలు, కథలు, చిత్రీకరణలు వ్రాసిన వ్యాసాలు ఉపయుక్తం అవుతాయి. వాటివల్ల నవీన్‌గారు చేయి తిరిగిన నవలాకారుడు కాబట్టి తాను ఎంచుకొని రచించిన పూర్వభాగం సులువుగా సంపన్నమయింది. కానీ చలంగారి ఆధ్యాత్మిక ప్రస్థానం పరిణామం గురించి అభివ్యక్తీకరించటానికి సుబ్బారావుగారికి మూసలు, ఉపాధులు సదుపాయాలు దొరకలేదు పైగా ఈ ప్రయాణం పూర్తిగా అంతర్గతం ఏదో “మ్యూజింగ్సు” లో రాసిన కొన్ని వివరణలు చలంగారికి రమణమహర్షిని పరిచయం చేసి ఆ దారిలో పెట్టిన దీక్షితులుగారు మరికొందరు చివరికంటా నమ్మకంలో వెన్నంటి ఉన్న స్నేహితులకు చెప్పిన, రాసిన ఉత్తరాలు తప్ప-ఈ రచనకు ఆధార సూచికలేమి దొరకలేదు. ఆ అవకాశమూ లేదు. చలంగారు రచించిన కథలు నవలలు మరొకసారి తరచి చూసి శల్య పరీక్ష చేసి వాటిలో నిగూఢంగా దాగి ఉన్న చలంగారి ఆత్మని వెన్నగా తీసే తపస్సు చేయవలసి వచ్చింది.

ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక జీవన పరిపక్వత గురించి నవలా రూపంలో ఎవరు చెప్పాలి - కథనం ఎవరి నోటి వెంట రావాలి? రచయితగా సుబ్బారావు ప్రథమ పురుష కోణంలో చెప్పే సాహసం చేయలేదు. అది రక్తి కట్టదు గూడాను - లేక ఉత్తమ పురుషతో కథనం చెయ్యాలంటే పరకాయ ప్రవేశం చెయ్యాలి. దానికి తోడు అనుమానాలతో సందేహాలతో ప్రశ్నలతో సతమతమవుతూ ఉన్న చలంగారి అంతర్గమనం వివరణకు అందుబాటులో ఉండదు సరికదా, ఏనాటికీ రచన పూర్తి కానేరదు, రచయిత ఒక మంచి ఆలోచన చేసి చలంగారిని ఎల్లవేళలా అంటిపెట్టుకొని ఉండే నీడ ద్వారా కథ చెప్పే ప్రక్రియ మొదలు పెట్టాడు. చలంగారి నీడ పడని చోట విషయాలు నిశితంగా విశ్లేషిస్తే తప్ప నవలలో ఎక్కడా కనిపించవు. ఆద్యంతం చలాన్ని వెన్నంటి ఉన్న నీడ చెపుతున్నట్లుగానె కథనం నడిచింది. ఈ ప్రక్రియ భవిష్యత్తులో రచయితల ఆదరణకు నోచుకో గలదు.

కథనం మూడు ప్రాతిపదికల మీద ఆధారపడి నడిచింది. చలంగారి స్నేహ బృందం, స్నేహితుల మీద వారి ఆదరణ, ప్రేమ, ఇది అప్పుడప్పుడు కాక మధ్యలో చివరల గూడ కథనానికి, చలంగారి ఆధ్యాత్మికోత్సాహానికి దోహదం చేస్తుంది. వారి అనుమానాలు, ప్రశ్నలు, వారి తర్కాలు, స్నేహితులతో వారు చేసే చర్చలలో బయట పడతాయి. అవి చలంగారి మనోఫలకాలను వెల్లడిస్తాయి. చర్చల ద్వారా తనను తాను తెలుసుకొనే ప్రయత్నం అసంకల్పితంగానే జరిగింది. ఇది చాలా ముఖ్యమయిన భూమికను నిర్వహిస్తుంది.

రెండవది చలంగారి వ్యక్తిత్వం, మొండితనం, మరొకరి ఆలోచనను అంగీకరించని విశ్లేషణా పటిమ. “నన్ను నేను వొదులుకోను” “డోంట్ థింక్ ఐ స్పీక్ యాజ్ ఇఫ్ కన్వర్టెడ్. ఐ హేవ్ ఆల్ మై ఇఫ్స్, అండ్ బట్స్” అంటారు చలంగారు స్నేహితులతో. ఈ లక్షణం ఆయన ప్రస్థానంలో అతి ముఖ్యమయినది. తన పెద్ద కూతురు “సౌరీన్” తన కంటే ఆలస్యంగా రమణ మహర్షి ప్రభావంలోకి వచ్చినా ఆత్మ సమర్పణ ద్వారా సిద్ధిలో తనకంటే ఎక్కువ దూరం ప్రయాణం చేయ గలిగింది. ఈశ్వరునికి కైవసం అయింది. ఈశ్వరుడే ఆమె ద్వారా చివరి రోజులలో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దిక్కూచిగ నిలచి ఈ కుటుంబాన్ని ఆదుకున్నారు - అయినా చలంగారు ప్రశ్నలు వేయటం మానలేదు. “ప్రశ్నలు వద్దు... అనుభవం నుండే ఏదయినా అర్థం చేసుకోవాలి. బుద్ధి నుండి కాదు” అని సౌరిస్ చెప్పింది. భగవాన్ రమణమహర్షి చెప్పారన్నా, అవధూత పిచ్చమ్మగారు చెప్పారన్నా, చలం నమ్మినపుడే అతనికి నిజం. సత్య సిద్ధికి అనుభవమే మార్గమని నమ్మినవాడు చలం.

ఇందులో ఒక చిక్కుముడి. అనుభవం పొందాలంటే “నేను” అనే గుర్తింపు ఉండాలిగదా! “నేను” ఉండి అనుభవం ఉంటె - “నేను” లేనట్టి అద్వైత భావం ఎట్లా సమకూరుతుంది?

ఆత్మ సమర్పణ, శరణాగతి, సౌరిస్‌కు సాధ్యమయినట్లు చలానికి చివరి వరకు సాధ్యం కాలేదు.

ముఖ్యమయిన మూడవ ప్రాతిపదిక. ఈ చలంగారి రమణ దర్శనం. దీన్ని రచయిత వివరించలేదు. కాని చాలాసార్లు ప్రస్తావించటం, చలంపై పెరుగుతున్న రమణ ప్రభావం - చలంలో వస్తున్న మార్పులను చిత్రించటం జరిగింది. ఇది అసలు కథ. కాని పాఠకుడు దర్శించే పార్శ్వం చలంలోని ఆధ్యాత్మిక సంక్లేశాలు అనుభూతులు అందుకోలేని బాధ, దానికి సంబంధించిన శంకలు మాత్రమే. వారిలో కలిగిన ఆధ్యాత్మిక పరిణతి సూచన ప్రాయమే. అది శబ్దానికి అతీతమయినది. అందుచేత చాలా చోట్ల సూచన రూపంలోను, పాటల రూపంలోను లేక చర్చలలో తటిల్లతా రూపంగా భాసించే ఉద్దేశాలలో వెతకాల్సి వస్తుంది.

చలం జీవితాన్ని ముఖ్యంగా ఉత్తరార్థంలో ప్రభావితం చేసిన వ్యక్తులు చాలా మంది ఉన్నారు. భగవాన్ రమణ మహర్షి, ఆ తర్వాత ఆయన కూతురు 'సౌరిస్" ఆ పైన 'అవధూత పిచ్చమ్మ" – "లీల". 'సౌరిస్‌లేక చలం లేదు' అన్న రీతిలో కథనం నడుస్తుంది. ఆమె అతడి చేయి పుచ్చుకొని పసిపిల్లవాడిని అడవిదాటించినట్లు, ఆధ్యాత్మిక శోధనలో విశ్వాసమే అలంబనగ చలాన్ని నడిపించింది. అతి త్వరలో ఆమె యింటికి పెద్ద దిక్కై కుటుంబ భారమంతా తానే మోయగల సామర్థ్యం సంపాదించింది. ఆమె దగ్గర చలానికి స్వాంతన లభించింది. ఆమె వాక్కు భగవాన్ వాక్కు, ఈశ్వరాజ్ఞ అయినాయి.

భగవాన్ మీద నమ్మకం సడల కుండా మార్గదర్శనం చేసినా పిచ్చమ్మగారి ఉదంతం చిన్నదే అయినా కథలో ముఖ్యమయినదే.

ఇక లీలగారు – చలం వ్యక్తిత్వంలో ఆమె ఆలస్యంగా తారసపడ్డారు. ఆయనలోని స్త్రీ కాంక్ష, సౌందర్య పిపాసలకు తనంత తానుగా ప్రవేశించిన ప్రతీక ఆమె. ఆధ్యాత్మిక శోధనకి ఇవి అడ్డంకులు కావని, స్త్రీ సౌందర్యం ఆస్వాదించలేనివాడు ప్రకృతి సౌందర్యం ఏమి చూడగలడు అని, భగవంతుని ఎలా చేరుకోగలడని అతని విశ్వాసం ఆ విశ్వాసానికి లీలగారు దోహదపడ్డారు. ఇతః పూర్వం ఆలోచనలలో, రచనలలో ఉన్న స్వేచ్ఛా ప్రణాళిక పోనుపోను ఆత్మ నిబద్ధతగా మారినట్లు కనిపిస్తోంది. ఆ చలం నుండి ఈ చలం వేరుకారని, సీతాకోక చిలుకవలె రూపాంతరం చెందిన అభిన్నతేనని అర్థం చేసుకోవటానికి లీలగారు సాయపడ్డారు. కాని ఆమె ప్రేమ, పొరవశ్యాలు లౌకికాలు. అపారంకాదు. లీలగారు భగవాన్‌పై ఈర్ష్య పడ్డారు. తమ ప్రేమ జీవితంలో భగవాన్ అడ్డుపుల్ల అనుకున్నారు. భగవాన్ని దర్శించిగూడ చలంభక్తిని అంగీకరించలేక పోయారు ఆమె. అందువల్లనే ఎంత బాధాకరమయినా సరే ప్రేమరాయిని అయిన 'లీల'ను విడచి ముందుకు సాగాడు చలం. రమణాశ్రమం చేరారు.

సాధనలో భాగంగానే మిత్రుల ప్రోద్బలం, సౌరిస్ ప్రోత్సాహం కారణంగా చలం రవీంద్రుని "గీతాంజలి" మొదలయిన రవీంద్ర కవితలను అనువాదం చేసారు.–సౌరిస్ చలం చేత రామాయణ భాగవతాది పురాణాలను ఉపనిషత్తులను చదివించింది. సౌరిస్ వ్యాఖ్యానిస్తుండగా అర్థం చేసుకున్నాడు. బైబిల్‌ని ఆమూలాగ్రం చదివి ఈశ్వర ప్రేరణతో అనువదించాడు. ఒకప్పుడు నిరసించిన భగవద్గీతను సంస్కృతం నుండి అనువదించాడు. ఇవన్నీ సాధనలో భాగాలుగ చేసాడు. ఇవన్నీ ధ్యాన నిష్టకు దోహదం చేస్తాయని సౌరిస్ నచ్చ చెప్పింది. చలం జీవితంలో భక్తిపారవశ్యం. అనుభవంలోకి వచ్చింది గాని, రమణులు చెప్పిన అద్వైత సిద్ధిని అనుభవంలోకి తెచ్చుకున్నట్లు మాత్రం కనిపించదు.

ఇది చలం నీడ చెప్పిన కథ. చలం ఆత్మదర్శన ప్రయత్నాలను – సాధన వ్యథలను ఆవిష్కరించిన నవల. కథనం సులభమయిన సరళ శైలిలో నడిచింది. భాషావేత్త అనుభవజ్ఞుడయిన ఉపాధ్యా యుడు గనుక రచనలో ఏ విధమయిన లొసుగులు కనపించవు. చలంగారి పూర్ణాభిమాని అయిగూడ బాహ్య కేంద్రం నుండి పరికించి తనశక్తి మేరకు యథాతథంగా చిత్రీకరించటంలో కృతకృత్యుడయినాడు.

ఆధ్యాత్మిక సాధకుడు, ప్రసిద్ధుడు అయిన వాని జీవిత కథను నవలగా వ్రాయటం అనే కొత్త ప్రక్రియలో కొత్త బాటలు వేసిన రచయిత ధన్యుడు.

– డా॥ఎస్. కృష్ణశర్మ
9533111287

(44 వ పుట తరువాయి...)

తాత సహోదరులు కూడా. దూరం బంధుత్వం.

నేను ఆశ్చర్యం నుండి తేరుకొని "మీరు ఇంత స్వచ్ఛమైన తెలుగులో మాటాడుతున్నారు. మీరు తెలుగు వారా? తెలుగు నేర్చిన మరాఠీ వారా" అన్నాను. ఆయన జవాబిచ్చాడు.

"మా పూర్వీకులు రాజమండ్రి ప్రాంతం. అప్పట్లో బ్రాహ్మణులు నదీ తీరాన్ని అనుసరించి వలసలు పోయేవారు కదా! అలా వారు కూడా ఇచ్చటికి వచ్చి స్థిరపడి పోయారు. నాది మూడవ తరం. మా తండ్రి, తాతలు కూడా తెలుగువారే. తెలుగు పిల్లలను వివాహ మాడారు. నేను మాత్రం మరాఠీ బ్రాహ్మణ పిల్లను వివాహమాడాను. నాకు తెలుగు బాగా వచ్చు. ఇంట్లో తెలుగు, మరాఠీ మాటాడుతాం. నాకు తెలుగు వ్రాయడం కూడా వచ్చు. మా పిల్లలు తెలుగులో కొంచెం మాటాడకలుగుతారు. వారు మరాఠీ భాషలో విద్యాభ్యాసం చేస్తున్నారు".

పట్నాయక్‌గారూ, నేను వెంటనే డిసైడయిపోయాం. మేము ఆయనతో "సరేనండి మిమ్ములనే మా పురోహితులుగా అంగీకరిస్తున్నాం. సంకల్పం చెప్పండి" అన్నాము. వారు మాతో గోత్ర నామాలు చెప్పించి సంకల్పం చెప్పారు. మేము వారికి దక్షిణలు ఇచ్చి తిరుగు ప్రయాణానికి సిద్ధం అవుతుండగా వారు తమ విజిటింగ్ కార్డులు కొన్ని ఇచ్చారు. దానిని బట్టి ఆయన పేరు చివుకుల పాపయ్య శాస్త్రి. ఆ కార్డులు మరాఠీ, ఇంగ్లీషు భాషలలో ముద్రింపబడినాయి. నాతోటి ఇనస్పెక్టరు చివుకుల గంగాధరం. ఆయనది రాజమండ్రియే. వానిని మాకిచ్చి, "మీరు మీ స్నేహితులకు బంధువులకు ఇవి ఇచ్చి వారికి నాసిక్‌కు వచ్చే ఉద్దేశం ఉంటే, నా దగ్గర చేయించుకొమ్మని చెప్పండి" అన్నాడు. రాలేని వారు గోత్ర నామాదులతో 12 రూ॥లు తనకు మనీ ఆర్డరు పంపితే గోదావరీ మాతకు పూజ చేసి ప్రసాదం పంపుతానని చెప్పాడు.

మేము ఆయన యొద్ద శెలవు తీసికొని, అచ్చటనే ఉన్న "ముక్తిధాం" అనే సుప్రసిద్ధ మ్యూజియం సందర్శించాము. అందులో దేశంలోని అన్ని ప్రసిద్ధ దేవాలయాల నమూనాలు విగ్రహాల ప్రతిరూపాలు ఉన్నాయి.

తరువాత నాసిక్‌లోని హోటల్‌లో భోజనాలు చేశాం. నాసిక్ ప్రాంతం పెద్ద ఉల్లిపాయల ఉత్పత్తి కేంద్రం. భోజనంలో పగలు పూరీలు, వరి అన్నం, రాత్రి పూట చపాతీలు వరి అన్నం వడ్డించారు. ప్రక్కనే ప్లేటు నిండా తరిగిన ఉల్లిపాయ ముక్కలు ఉంచారు.

మేము ప్రెస్సుకు వచ్చి మేనేజర్‌ను కలువగా, ఆయన "మీకు ఫికరు వద్దు, సామాన్యులు వాడే పోస్టు కార్డులు మీ రెండు మండలాలకు, రెండు వ్యాగన్లు కేటాయించాను. అవి మన్మాడ్ జంక్షన్ మీదుగా "మీ నగరాలకు చేరతాయి" అని ఊరటగా చెప్పారు. మా యాత్ర ఈ విధంగా సఫలమైంది. ఈ విధంగా స్వామి కార్యం, స్వకార్యం నెరవేరాయి. ఆల్‌థాంక్స్ టు తెలుగు అవర్ ఓన్ స్వీట్ తెలుగు! తెలుగు తల్లికి కృతజ్ఞతలతో.

పుస్తక సమీక్ష

# తొవ్వ ముచ్చట్లు




రచన : ఆచార్య జయధీర్ తిరుమలరావు
వెల : 200/-
ప్రతులకు : సాహితి సర్కిల్, 402, ఘరౌండ అపార్ట్‌మెంట్స్
ఒ.యు. మెయిన్‌గేట్ దగ్గర, 1 వ లైను డి.డి.కాలని, హైదరాబాదు - 500 007
మరియు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో.

తెలుగు సాహిత్య ప్రక్రియలలో యాత్రా సాహిత్యం, రచనలు మనకి తక్కువగానే దొరకుతున్నాయి. పర్యటనల, ప్రయాణాల సంచారాల, యాత్రల, క్షేత్రమహత్యాల గురించిన అనుభవాలు వ్యాసాలు అడపాదడపా వస్తున్నాయి. అయితే, 'తొవ్వ ముచ్చట్లు' పుస్తకం కొంచెం భిన్నమైంది. ఇందులో రచయిత నలుగురు నడిచిన దారిలో కాకుండా కాళ్లకు కళ్లు పెట్టుకుని, మనసుకి చెవులు పెట్టుకుని - జీవితాలని, వాటిలోని సమస్త వైవిధ్యాలని, వాటి లోతులలోకి వెళ్లి సమూలంగా స్పర్శించి తాత్వికంగా విశ్లేషించి తవ్వి వడబోసిన ముచ్చట్లు ఉన్నాయి. కొత్త చూపుతో, కొత్త పుంతలు తొక్కిన మూడు పంథాలు - సాహిత్యం, జర్నలిజం, పరిశోధన ముప్పేటగా కలనేత నేసిన ముచ్చటైన వినూత్న ప్రక్రియ ఇందులో మనం చూస్తాం.

తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక తొలి 12 మాసాల్లో - తేదీ 08-06-2014 నుండి 8-06-2015 వరకు 53 వారాలు 'ఆంధ్రభూమి' దినపత్రికలో ఈ ముచ్చట్లు (53 వ్యాసాలు) ప్రచురింపబడి పాఠకులను, సాహితీవేత్తలను, ఆలోచింపచేసే దిశగా నడిపించాయి. ప్రజాపక్షం వహించి, ప్రగతిశీల పరిశోధకుడిగా, రచయితగా ఒక బాధ్యతగల బుద్ధిజీవిగా, పౌరునిగా తిరుమలరావు అనే సామాజిక సంచారి- తాను నడుస్తూ చెప్పిన ముచ్చట్లు కొన్ని సందర్భాలలో వెనుకటి రాహుల్ సాంకృత్యాయన్‌ని గుర్తు చేస్తాయి. నిత్య అధ్యయనం, నిరంతర అన్వేషణ, క్రియాశీలతగల వ్యక్తి వేసిన
903 అడుగులివి, చెప్పిన నుడుగులివి.

రాష్ట్ర విభజన తర్వాతి రాజకీయ పరిణామాలు, ప్రజలతో కలసి రాలేని ప్రతిపక్షాల విమర్శలు, ప్రజావ్యతిరేక విధానాల పట్ల ధర్మాగ్రహం, దేశమంతా అభివృద్ధి పేరుతో ఆదివాసీల బతుకులు, భూములు తొలి బలి కావటం, పోలవరం ముంపుకి గురయ్యే ఏడు మండలాలను ఆంధ్రరాష్ట్రంలో కలపటాన్ని వ్యతిరేకిస్తూ, సామాజిక, సాంస్కృతిక, భాషా, పర్యావరణ, జీవావరణ, సాంఘిక దురాచారాల గురించి యిలా ఎంతో వైవిధ్యంగా రచన సాగింది. కోయల చరిత్రకి ఆకరాలయిన పగిడెలూ, పటాలు దొరికినందుకు, కోయతూర్ లిపి, భాషా సంస్కృతుల గురించి, కనుమరుగౌతున్న కిన్నెర వాయిద్యం, బుర్రకథలు, రచయితను గౌరవించని పుస్తకోత్సవాలు, పర్యావరణ జీవావరణ స్పృహలేని ఉగాదులు, బతుకమ్మ పండుగ కార్పోరేటు స్థాయి మెగా ఈవెంట్‌గా, జీవ పరిమళంలేని ప్లాస్టిక్ బతుకమ్మగా మారకూడదన్న ఆశాభావం - యిలా సమకాలీన ప్రధాన సమస్యలపై రచయిత చేసిన వ్యాఖ్యలు, పొందిన స్పందనగా భావించాలి. అంతేకాకుండా, దాశరథి రంగాచార్య, చే(కూరి) రా(మారావు), తూమాటి దొణప్ప, డా॥ ప్రేమ్‌పతి, మహమ్మద్ తాజుద్దీన్ ఖాన్, మిత్ర, (ఉరఫ్ అమర్ / కూర దేవేందర్), కానూరి వంటి ప్రముఖుల జీవన రేఖలు, కా(లీపట్నం) రా (మారావు) మాష్టారి 'తెలుగు కథల గూడు' (కథానిలయం) గురించీ, అంతరిస్తున్న కళారూపాలపై, ఒకటి కాదు దాదాపు అన్ని రకాల అంశాలను స్పృశించి కేవలం కాలక్షేపం బఠాణీలుగానో, ఉబుసుపోక చెప్పే ఊసులుగా కాకుండా ఆ అంశాలన్నిటిని విమర్శకు పెడుతూ తన అంతరంగాన్ని మథించి మనముందు ఉంచారు తిరుమలరావు. సమస్యలతో సతమతమయ్యే సమాజం గుండె చప్పుళ్ళు తాను వినటమేకాదు మనకూ వినవచ్చేలా సాగించిన శైలీ విన్యాసం ఎంతో విశిష్టంగా ఈ గ్రంథంలో చూస్తాం. సమకాలీన సమస్యలపై సహేతుకంగా తాత్వికంగా విమర్శనాత్మకంగా ముచ్చట్లు చెప్పి మంచి తొవ్వ (దారి, త్రోవ) చూపించిన త్రోవరి తిరుమలరావు చేసిన ఈ వినూత్న ప్రక్రియ ప్రశంసనీయం.

- ఎం.వి.శాస్త్రి
9441342999

---




**గాంధీజీ ప్రాణరక్షకుడు బతకామియా అన్సారీ**
**రచన : సయ్యద్ నసీర్ అహ్మద్**

1917 లో బీహార్ రాష్ట్రం చంపారన్ ప్రాంతంలో మహాత్మాగాంధి భారత రైతాంగం మీద నిలిమందు తోటల, కర్మాగారాల యజమానుల అకృత్యాల మీద విచారణకు వెళ్లారు. ఆ సందర్భంగా, ఆయన జరుపుతున్న విచారణ ఆంగ్లేయులైన నీలిమందు కర్మాగారాల యజమానులైన తమకు నష్టదాయకమయ్యే పరిస్థితి ఏర్పడటంతో వారిలో ఒకడైన ఇర్విన్ అనునతడు మహాత్మాగాంధీని విందుకు ఆహ్వానించి ఆహారంలో విషం కలిపి అంతం చేయడానికి కుట్రపన్నుతాడు. మహాత్ముడు ఆంగ్లేయుడి ఇంటికి విందుకు వచ్చాక ఆ ఇంటి వంట మనిషి 'బతఖ్ మియా అన్సారి' హత్యాయత్నం కుట్రను గాంధీజికి తెలిపి ఆయన ప్రాణాలను కాపాడుతాడు. ఈ విషయాన్ని 1950లో డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ బహిరంగ సమావేశంలో వెల్లడించారు. అప్పుడుగాని 'బతఖ్ మియా అన్సారి' సాహసం, తెగువ తెలియరాలేదు. ఆ మహత్తర సంఘటన గురించి సయ్యద్ నసీర్ అహమ్మద్ వెలువరించిన 'చరితార్థులు' ఆల్బమ్‌లో సంక్షిప్తంగా పొందు పర్చారు. తర్వాత ఆనాటి సంఘటన వివరాలను 'బతఖ్ మియా అన్సారి కుటుంబీ కులతో సంప్రదించి మరిన్ని వివరాలతో ఒక పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ నాలుగు భాషల్లో ప్రచురించారు.

ఏ భాషలోనైనా వెల : రు. 25/-, పుటలు 24

ప్రచురణ : అజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, ఉండవల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఫోన్ : 9440241727



**మతతత్వం - స్త్రీ వ్యక్తిత్వం**
రచన : డి.పేరలింగం
పుటలు:48, వెల: అమూల్యం
ప్రతులకు : డి.పేరలింగం
సైన్సు గ్రంథాలయం, ఎ.వి.అప్పారావు రోడ్,
బాలాజీ వీధి, రాజమండ్రి - 533 103
సెల్ : 9502654774

**శరధార**
రచయిత : ఊటుకూరు రంగారావు
పుటలు: 36, వెల: రు.25/-
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమి
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్ - 500 004
ఫోన్ : 040-29703142



**నాన్నా నీకు నూరేళ్లు...**
రచన : డా॥ సమ్మన్న ఈటెట
పుటలు:72, వెల: రు.80/-
ప్రతులకు: డా॥ సమ్మన్న ఈటెల
207, సిరి రెసిడెన్సీ, వీధి నెం. 2, తార్నాక
హైదరాబాద్ - 17
సెల్ : 9885238654





**మహాభారతం సొగసులు - సూక్ష్మాలు**
రచన : సాకం నాగరాజు
పుటలు:86, వెల: రు.100/
ప్రతులకు: సాకం శశికళ
6-1-70, వరదరాజ నగర్
తిరుపతి - 517 507
సెల్ : 0877-2230135



**మావూరి మంగలి కతలు :**
రచన : మూరిశెట్టి గోవింద్
పుటలు: 96, వెల :100/-
ప్రతులకు :మూరిశెట్టి గోవింద్
చిన్నదొరవారి కండిగ (పోస్టు)
కార్వేటినగరం (మం), చిత్తూరు (జి)
సెల్ : 9502200749

**ప్రత్యూష (పద్య, గేయ సంకలనం )**
పుటలు: 132, వెల: రు.50/-
ప్రచురణ, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 040-29703142



**మల్లంపల్లి సోమశేఖరశర్మగారు సురవరం ప్రతాపరెడ్డిగారికి రాసిన లేఖలు**
సంకలనం : ఈమని శివనాగిరెడ్డి, కొండా శ్రీనివాసులు
పుటలు :44, వెల: రు.25/-
ప్రచురణ : సుజాత ప్రచురణలు, 404, విజయశ్రద్ధ టవర్స్
మొగల్‌రాజపురం, విజయవాడ - 10
ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్ హౌస్‌లు





**రెండు అనువాద నాటకాలురెండు అనుసరణ నాటికలు :**
అనువాదకుడు : సుంకర కోటేశ్వరరావు
పుటలు: 250, వెల: రు.200/-
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు, నవచేతన బుక్ హౌస్ బ్రాంచీలు, సుంకర కోటేశ్వరరావు
3-33-68,4వ వీధి, ఎన్‌జివో కాలనీ, నరసరావుపేట,
గుంటూరు-522601, సెల్ : 9948023464



**మూడోకన్ను - కావ్యదర్శనం**
**చలపాక ప్రకాష్ కవిత్వ తత్త్వం**
రచన : పోతగాని సత్యనారాయణ
పుటలు: 80, వెల: రు.30/-
ప్రతులకు :విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట
విజయవాడ - 520004
సెల్ - 9441083763

**బుగతలనాటి చుక్కపల్లి**
రచయిత:చింతకింద శ్రీనివాసరావు
పుటలు:182, వెల: రు.150/-
ప్రతులకు : శ్రీనిజ ప్రచురణలు, 6-60/1
రవీంద్రనగర్, పాత డయిరీ ఫారం
విశాఖపట్నం - 530040
ఫోన్ : 8897147067



**నివురుగప్పిన నిజం :**
రచయిత:సుంకర కోటేశ్వరరావు
పుటలు:142,వెల:రు.125/-
ప్రతులకు:విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు, నవచేతన బుక్ హౌస్ బ్రాంచీలు, సుంకర కోటేశ్వరరావు 3-33-68,4వ వీధి, ఎన్‌జివో కాలనీ, నరసరావుపేట, గుంటూరు-522601
సెల్ : 9948023464





**పూనాలో పూచిన నానీలు**
రచన :సీతా సుధాకర్
పుటలు:84, వెల:100/-
ప్రతులకు: అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
ఫోన్: 09765390399

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

2వ అట్ట తరువాయి...

# తాపీధర్మారావు జయంతి




అధ్యక్షోపన్యాసం చేస్తున్న డా॥సామల రమేష్‌బాబు



ఆత్మీయఅతిథి శ్రీకొత్తపల్లి రవిబాబు



ప్రిన్సిపాల్ శ్రీకొలసాని రామచంద్




శ్రీ బొల్లిముంత కృష్ణ (విశాలాంధ్ర)




శ్రీ డి.ఎల్.నారాయణ (సాక్షి)




శ్రీ చందు సుబ్బారావు (ఈనాడు)




శ్రీ నర్రా రాజు (ఈటీవి)




శ్రీకురుగంటి రఘురామయ్య (టి.వి.9)



శ్రీచొప్పర సుధాకర్ (హారిక కేబిల్ నెట్‌వర్క్)

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
October 2019 Vol :5, Issue 8
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20


# దీపావళి శుభాకాంక్షలు

Bommidala
International



# బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు–522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com


If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244